ప్రపంచానిక ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



పార్లమెంటు సమావేశాలలోపు మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ
'విబి-జి రామ్ జీ'తో అధికార కేంద్రీకరణ, రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం
రామాలయం విరాళాల కేసు.. అరెస్టయిన 8 మంది ఇళ్లల్లో సోదాలు 07



సంపుటి 09, సంచిక: 209 | సోమవారం | 29-06-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


డిప్యుటేషన్ పద్ధతిలో

## టీచర్ పోస్టుల భర్తీ

- పాఠశాల విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల
- ఇంటర్వ్యూల నిర్వహణకు ప్రత్యేక కమిటీలు



ప్రజాపక్షం/హైదరాబాద్

వివిధ ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను డిప్యుటేషన్ పద్ధతిలో భర్తీ చేసేందుకు పాఠశాల విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఇంటర్వ్యూల నిర్వహణ నిమ్మితం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. డిఐఇటి, సిటిఇ, ఐఎఎస్ఇ పోస్టుల ఇంటర్వ్యల నిమ్మితం కమిటీ చైర్ పర్సన్‌గా జిల్లా కలెక్టర్లను, ఎస్‌సిఇఆర్‌టి పోస్టులకు పాఠశాల విద్యాశాఖ డైరక్టర్ చైర్‌పర్సన్‌తో రాష్ట్ర స్థాయి కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు డాక్టర్ ఇ.నవీన్ నికోలాస్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. డిఐఇటి, సిటిఇ, ఐఎఎస్ఇ,

తరువాయి 8లో


కాళేశ్వరాన్ని ఎటిఎంలా వాడుకున్న బిఆర్‌ఎస్
బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ 08


వచ్చే ఎన్నికల్లోపు

# ఎస్ఎల్‌బిసి టన్నెల్, డిండి పూర్తి

## నల్లగొండ సాగు, తాగునీటి సమస్య పరిష్కరిస్తాం



- పదేళ్లు పదవులు అనుభవించి కల్వకుంట్ల కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుంది
- ఎలక్షన్, కలెక్షన్, సెలక్షన్ రాజకీయాలతో రాష్ట్రాన్ని నష్టపరిచింది
- పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తుంటే కడుపు మంట ఎందుకు?
- మూసీ నది ప్రక్షాళన ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేస్తాం
- సిఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటన
- నల్లగొండలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- కనగల్‌లో 'హామ్' పైలాన్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/నల్లగొండ

నల్లగొండ ప్రజల దశాబ్దాల కల ఎస్ఎల్‌బిసి టన్నెల్, డిండి ప్రాజెక్టులు పాలకుల నిర్లక్ష్యం వల్లే ఆలస్యమయ్యాయి. పూర్తి చేయడం తమ ప్రభుత్వ లక్ష్యం. వచ్చే ఎన్నికలలోపు పూర్తి చేసి నల్లగొండకు సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఎవరు అడ్డువచ్చినా మూసీ నది ప్రక్షాళన ఆగదని స్పష్టం చేశారు. మూసీని ప్రక్షాళన చేసి నల్గొండ ప్రజలకు విముక్తి కలిగిస్తామని భరోసా కల్పించారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తూ తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా నిలబెడతామని అన్నారు. నల్లగొండ జిల్లా కనగల్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు సమీపంలో నల్లగొండ –దేవరకొండ రహదారిపై రూ.13,006.27 కోట్ల వ్యయంతో 6,092.37 కిలోమీటర్ల మేర 441 రహదారుల విస్తరణ, పటిష్టీకరణకు సంబంధించిన హామ్ (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) రోడ్ల పనుల శంకుస్థాపన పైలాన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఎన్‌జి కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. పదేళ్ల పదవులు అనుభవించి రాష్ట్రాన్ని దోచుకున్న కెసిఆర్ కుటుంబాన్ని ప్రజలు శాశ్వతంగా బహిష్కరించారని తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎంతోమంది త్యాగాలు చేసి రాష్ట్రాన్ని సాధిస్తే.. పదవులు మాత్రం కెసిఆర్ కుటుంబం అనుభవించిందని విమర్శించారు. ఆ కుటుంబానికి మళ్లీ అధికారం కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. 'గ్రామగ్రామాన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తుంటే బిఆర్‌ఎస్ వాళ్లకు కడుపు మండుతోంది. పదేళ్లపాటు ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు కానీ.. పేదల ఇళ్ల గురించి ఆలోచించలేదు' అని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ,

తరువాయి 12లో

## వాంగ్‌చుక్ నిరాహారదీక్ష

- సిజెపి నిరసన ప్రదర్శనకు సంఘీభావం
- మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్
- జంతర్ మంతర్ చేరుకున్న వేలాది మంది విద్యార్థులు, యువత, రైతు నాయకులు



**న్యూఢిల్లీ :** నీట్ పేపర్ లీక్, పరీక్షల్లో పదే పదే జరుగుతున్న అవకతవకలపై జవాబుదారీతనంగా ఉండాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'జనతా కాక్రోచ్ పార్టీ (సిజెపి)' ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆదివారం మరోసారి నిరసన ప్రదర్శన చేపట్టింది. నిరసన ప్రదర్శనకు పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్‌చుక్ సంఘీభావం ప్రకటించారు. నిరాహార దీక్ష ప్రారంభించారు. దీక్షకు ముందు వాంగ్‌చుక్ సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేతో కలిసి రాజ్‌ఘాట్‌ను సందర్శించి మహాత్మాగాంధీకి నివాళులర్పించారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్నవారంతా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. వాంగ్‌చుక్ తన నిరాహార దీక్షను ప్రారంభించినప్పుడు, వందలాది మంది నిరసనకారులు ప్రధానంగా యువత, విద్యార్థులు జంతర్ మంతర్ వద్ద గుమిగూడారు. నిరసనకు పలువురు రైతు నాయకులు కూడా హాజరయ్యారు. ఈ నిరసనలో చేరాలన్న తన నిర్ణయం గురించి వాంగ్‌చుక్ వివరిస్తూ, గత 40 ఏళ్లుగా విద్య అనేది తన హృదయానికి అత్యంత సన్నిహితమైన అంశమని, విద్యా విధానంపై

తరువాయి 8లో



# ఆరోగ్యమే లక్ష్యం

- పోలియో రహిత సమాజమే ధ్యేయం
- పల్స్ పోలియోను ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహ
- రాష్ట్రంలో 52 లక్షలకు పైగా వాక్సిన్‌లు సిద్ధంగా ఉన్నాయని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

పోలియో రహిత సమాజమే తమ ముందు ఉన్న లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. 'ఇంటింటి సర్వే'లో భాగంగా వైద్య సిబ్బంది మూడు రోజుల పాటు పర్యటించి, చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తారన్నారు. రాష్ట్రస్థాయి పల్స్ పోలియో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని హైదరాబాద్,జూబ్లీహిల్స్ లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ఎంపి అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వవిప్ అడ్డంకి దయాకర్, శాసనసభ్యులు నవీన్ యాదవ్‌తో కలసి మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో 52 లక్షలకు పైగా వ్యాక్సిన్లను సిద్ధంగా ఉన్నాయన్నారు. పల్స్ పోలియో కార్యక్రమం లో భాగంగా 42 లక్షల మంది పిల్లలకు, 22 వేలకు పైగా పోలింగ్ కేంద్రాలు, 900 ట్రాన్సిట్ పాయింట్‌ల వద్ద పోలియో చుక్కలు వేస్తున్నామన్నారు. 2,298 రూట్

తరువాయి 8లో

సంక్షోభ సమయంలో దేశాన్ని నడిపిన

# మహానేత పి.వి.

- యావత్ భారతదేశానికి మార్గదర్శకులు
- జయంతి కార్యక్రమంలో కొనియాడిన వక్తలు
- పి.వి.ఘాట్ వద్ద రాష్ట్ర మంత్రులు, కేంద్ర మంత్రులు, పలువురు రాజకీయ ప్రముఖులు నివాళి



ప్రజాపక్షం/హైదరాబాద్

భారతరత్న, మాజీ ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు 105వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని (పివి జ్ఞానభూమి) పివి ఘాట్ వద్ద పలువురు రాజకీయ ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. జ్ఞానభూమిలో జరిగిన కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణు గోపాల్ , ఎఐసిసి కార్యదర్శి రుద్రరాజు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపి అనిల్ కుమార్ యాదవ్, శాసనమండలి ప్రతిపక్ష నాయకులు మధు సుధానచారి, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, బిజెపి రాష్ట్ర కె.రామచందర్‌రావు,

తరువాయి 12లో

ఉరుములు, మెరుపులతో

# విస్తారంగా వర్షాలు

## పలు జిల్లాలకు ఐఎండి భారీ వర్షాల హెచ్చరిక



ప్రజాపక్షం/హైదరాబాద్

నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆదివారం మధ్యాహ్నం విడుదల చేసిన ప్రత్యేక బులెటిన్‌లో హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తుండగా, మరి కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఆది, సోమవారం ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమ, మంగళవారం ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు. మంగళ, బుధవారం ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. బుధ, గురువారాల్లో మంచిర్యాల, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో జిల్లాలకు భారీ వర్షాల హెచ్చరిక జారీ చేశారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలతో పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. ఈ కాలంలో కూడా ఉరుములు, మెరుపులు, గంటకు 3040 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందన్నారు.



హిందూ మహాసముద్రాన్ని

# 'అవకాశాల సంద్రం'గా మారుస్తాం

## అదే భారత లక్ష్యం, దార్శనికత
## సీషెల్స్‌లో ప్రధాని మోదీ

**విక్టోరియా (సీషెల్స్):** ఆర్థిక శ్రేయస్సుతో పాటు సముద్ర భద్రతకు కూడా భద్రత కల్పించే, అలాగే పరిమాణంపై కాకుండా పరస్పర గౌరవం, విశ్వాసంపై ఆధారపడిన భాగస్వామ్యాన్ని భారతదేశం ఆకాంక్షిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి మోదీ ఆదివారం సీషెల్స్‌ను సందర్శించారు. భారతదేశం, ఆ ద్వీప సమూహ దేశం రక్షణ, భద్రతలు ఒకదానికొకటి విడదీయరానివని నొక్కిచెప్పారు. 'హిందూ మహా సముద్రాన్ని అవకాశాల సముద్రంగా మార్చడమే మా దార్శనికత' అని సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీతో ప్రతినిధి బృందం స్థాయి చర్చల అనంతరం మోదీ చెప్పారు. ఈ చర్చల సందర్భంగా వారు ద్వైపాక్షిక సహకారం పూర్తి పరిధి గురించి సమీక్షించారు. పరస్పర ఆసక్తి ఉన్న ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. 'హిందూ మహాసముద్రం మన ఉమ్మడి ఇల్లు అని మేం విశ్వసిస్తున్నాం'. దాని భద్రత, సుస్థిరత, శ్రేయస్సు, మన ఉమ్మడి బాధ్యత' అని మోదీ అన్నారు. ఇదే భారతదేశపు మహాసాగర్ (ప్రాంతాల వారీగా భద్రత, వృద్ధి కోసం పరస్పర, సంపూర్ణ ప్రగతి)

తరువాయి 12లో

'సర్'లో ఓటు తొలగింపు

# నిలిచిన పాస్‌పోర్ట్ పునరుద్ధరణ

- 'ది టెలిగ్రాఫ్' మాజీ ఎడిటర్ ఆర్. రాజగోపాల్‌కు చేదు అనుభవం
- ఈ చర్య పౌరుల హక్కుల విస్తృత కోతకు నిదర్శనమని ప్రతిపక్షాలు ధ్వజం



**న్యూఢిల్లీ :** ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)లో భాగంగా ఓటరు జాబితా నుంచి అనేక మంది ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారు. ఈ చర్యపై ప్రతిపక్ష పార్టీలు ఎప్పటికప్పుడు కేంద్ర సర్కార్‌పై ధ్వజమెత్తుతున్నాయి. ఓటరు జాబితాలో పేర్లు తొలగించిన వారికి రేషన్,

తరువాయి 12లో

కువైట్, బహ్రైన్‌లో అమెరికా స్థావరాలపై

# విరుచుకుపడిన ఇరాన్

- బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్‌లతో రెండోరోజు యుద్ధం
- చర్చలు ఆపేస్తామని అమెరికాకు హెచ్చరిక
- ఇరాన్ ఉనికిలోనే ఉండదని ట్రంప్ ప్రకటన
- హోర్ముజ్ జలసంధి నియంత్రణ బాధ్యత మాదే : ఇరాన్



**టెహ్రాన్ :** అమెరికా–ఇరాన్ మధ్య వరుసగా రెండోరోజు ఆదివారం కూడా దాడులు కొనసాగాయి. కువైట్,బహ్రైన్ లలో ఉన్న అమెరికా స్థావరాలపై డ్రోన్లు,క్షిపణులతో ఇరాన్ దాడులు చేయగా,దానికి ముందుగానే దక్షిణ ఇరాన్ తీరప్రాంతంలో ఉన్న ఐదు స్థావరాలపై అమెరికా దాడులు చేసింది. పది కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా చేసిన దాడులకు ప్రతీకారంగా రెండోరోజు కూడా దాడులు కొనసాగించినట్లు ఇజ్రాయెల్ నావికాబలగాలు ప్రకటించాయి.ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్(ఐఆర్‌జిసి) ఆదివారం

తరువాయి 8లో

# ప్రత్యేక భావజాల ధోరణి 'వెరిస్మో'

సాహిత్య చరిత్రలో కొన్ని ధోరణులు కేవలం రచనా శైలులుగా మాత్రమే కాకుండా, ఒక ప్రత్యేకమైన దృక్కోణాన్ని, ప్రపంచాన్ని చూసే విధానాన్ని ప్రతిపాదిస్తాయి. ఇటాలియన్ సాహిత్యంలో ఉద్భవించిన వెరిస్మో అటువంటి ధోరణుల్లో ఒకటి. ఇది కేవలం రియలిజం లేదా నేచురలిజం ఉపశాఖగా చూడలేని స్థాయిలో తన కంటూ ప్రత్యేకమైన భావజాలాన్ని, రచనా విధానాన్ని, భాషా వినియోగాన్ని, పాఠకుడితో సంబంధాన్ని నిర్మించుకుంది. వెరిస్మో రియలిజం నేడు ఒక ప్రత్యేక సాహిత్య విభాగంగా రూపాంతరం చెందింది. 'వెరో' అనే ఇటాలియన్ పదం నుంచి వచ్చిన వెరిస్మో అనే పదానికి 'నిజం' లేదా 'వాస్తవం' అనే అర్థం ఉంది. అయినప్పటికీ, ఈ ధోరణి వాస్తవాన్ని ప్రతిబింబించే విధానం సాధారణ రియలిజం కంటే మరింత కఠినమైనది. మరింత నియంత్రితమైనది. తాత్వికంగా మరింత సంక్లిష్టమైనది. వెరిస్మో సాహితీ విధాన ఉద్భవాన్ని అర్థం చేసుకోవాలంటే, 19వ శతాబ్దం చివరలో ఇటలీలో జరిగిన సామాజిక, ఆర్థిక, రాజకీయ మార్పులను పరిశీలించాలి. ఇటలీ ఏకీకరణ తరువాత దేశం వేగంగా మార్పులను అనుభవించింది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలసలు పెరిగాయి, పరిశ్రమీకరణ ప్రారంభమైంది, సంప్రదాయ జీవన విధానాలు క్రమంగా క్షీణించాయి. ఈ మార్పుల ప్రభావం ముఖ్యంగా పేద, అణగారిన వర్గాలపై తీవ్రంగా పడింది. ఈ నేపథ్యాన్ని ప్రతిబింబించడానికి సాహిత్యంలో ఒక కొత్త దృక్కోణం అవసరమైంది. ఈ అవసరమే వెరిస్మోకు పునాది వేసింది. ఈ ధోరణిని అభివృద్ధి చేసిన ప్రధాన రచయితలు 'జీవనాన్ని ఎలా ఉందో అలా చూపించాలి' అని నమ్మారు. మరి, ఎలా ఉందో అలా చూపించడం అంటే ఏమిటి? ఇది కేవలం సంఘటనలను వరుసగా వర్ణించడం కాదు. ఇది ఒక శాస్త్రీయ పరిశీలకుడిలా జీవనాన్ని గమనించడం, పాత్రల ప్రవర్తనను వారి పరిస్థితుల ద్వారా అర్థం చేసుకోవడం. రచయిత స్వంత అభిప్రాయాన్ని ఆ చిత్రణలో కలపకుండా ఉండడం అనే కఠినమైన నియమాన్ని కలిగి ఉంటుంది. రచయిత పూర్తిగా నిష్పాక్షికుడుగా ఉండగలడని భావించడం ఈ విధాన పరిశీలనలో కీలకాంశం. అయితే, అది తర్కానికి నిలబడదు. కథను ఎంచుకోవడం, పాత్రల ఎంపిక, సంఘటనల క్రమం వంటివి రచయిత నిర్ణయాలు. కాబట్టి వెరిస్మోలో కనిపించే 'నిష్పాక్షికత' అనేది సహజంగా ఉద్భవించినది కాదు. అది ఒక కృత్రిమ నిర్మాణం. ఇది రచయిత తన వ్యక్తిగత వ్యాఖ్యానాన్ని దాచిపెట్టే ఒక శైలీ వ్యూహం. ఈ దృష్టిలో వెరిస్మోను పరిశీలిస్తే, అది నిజాన్ని చూపించడం కంటే నిజంలా కనిపించే నిర్మాణాన్ని సృష్టించడంగా కూడా భావించవచ్చు. వెరిస్మోలో పాత్రల ఎంపిక కూడా ఈ ధోరణిలో ముఖ్య లక్షణం. కథానాయకులు సాధారణంగా సమాజంలోని దిగువ తరగతులకు చెందినవారు. వారు రైతులు, కార్మికులు, చిన్న వ్యాపారులు, లేదా నిరుద్యోగులు. వీరి జీవితాలు సాధారణంగా పోరాటాలతో నిండి ఉంటాయి. ఈ పాత్రలను ఎందుకు ఎంచుకున్నారు? అనేది ఇక్కడ ఉద్భవించే ప్రశ్న. ఇది కేవలం వాస్తవాన్ని ప్రతిబింబించడానికి మాత్రమే పరిమితమా లేక పేదరికం, తద్వారా ఎదురయ్యే బాధను ఒక సాహిత్య వస్తువుగా మార్చే ప్రయత్నమా? అన్నది కొంత మంది విశ్లేషకుల ప్రశ్న. దీనికి సరళమైన సమాధానం లేదు. ఒకవైపు, ఈ పాత్రలు సమాజంలోని అసలు పరిస్థితులను చూపిస్తాయి. మరోవైపు, ఈ చిత్రణలో ఒక రకమైన స్థిరీకరణ ఉంటుంది. 'పేదవాళ్లు ఎప్పటికీ పేదవాళ్లుగానే ఉంటారు. వారి పరిస్థితి మారదు' అనే చిత్రమైన భావన. ఇది వెరిస్మోలో కనిపించే నిరాశావాద దృక్కోణానికి కారణం. ఈ ధోరణిలో పాత్రలు సాధారణంగా తమ పరిస్థితులను అధిగమించలేవు. వారు మార్పుకు అనుగుణంగా మారలేరు. ఈ తీరు నేచురలిజానికి చాలా దగ్గరగా ఉన్నప్పటికీ, ఒక ముఖ్యమైన తేడా ఉంది. నేచురలిజంలో శాస్త్రీయ నిర్ణయాలు, కారణఫలిత సంబంధాలు ప్రధానంగా ఉంటాయి. కానీ వెరిస్మోలో ఈ విశ్లేషణ అంతగా స్పష్టంగా కనిపించదు. ఇక్కడ జీవితం ఒక నిశ్శబ్ద దృశ్యంలా కనిపిస్తుంది. ఎవరూ వ్యాఖ్యానం చేయని, ఎవరూ పరిష్కారం సూచించని ఒక స్థితి. 'సామాజిక అన్యాయాన్ని వెరిస్మో విమర్శించదు' అనే అభిప్రాయం కొంతవరకు సత్యం. కానీ పూర్తిగా కాదు. వెరిస్మోలో స్పష్టమైన విమర్శ లేకపోయినా, వాస్తవాన్ని నిర్దాక్షిణ్యంగా చూపించడం ద్వారా ఒక పరోక్ష విమర్శ ఉత్పన్నమవుతుంది. ఉదాహరణకు, ఒక పేద కుటుంబం జీవన పోరాటాన్ని ఎలాంటి వ్యాఖ్యానం లేకుండా చూపించినా, ఆ చిత్రణ పాఠకుడిలో ఒక అసౌకర్యాన్ని, ప్రశ్నలను కలిగిస్తుంది. ఈ దృష్టిలో వెరిస్మో విమర్శించదని చెప్పడం సరైనది కాదు. ఈ విధానం 'విమర్శను పాఠకుడికి బదిలీ చేస్తుంది' అని చెప్పడం సముచితం. భాషా వినియోగం వెరిస్మోలో అత్యంత కీలకమైన అంశం. పాత్రల సామాజిక స్థితిని ప్రతిబింబించడానికి రచయితలు స్థానిక మాండలికాలను ఉపయోగిస్తారు. ఇది కథకు ఒక నిజమైన అనుభూతిని ఇస్తుంది.



కానీ ఇక్కడ కూడా ఒక సమస్య ఉంది. రాతరూపంలో మాండలికాన్ని పూర్తిగా పునఃసృష్టి చేయడం అసాధ్యం. రచయిత దానిని ఒక సవరించిన రూపంలో మాత్రమే చూపగలడు. కాబట్టి ఈ భాషా నిజత్వం కూడా ఒక రకమైన నిర్మాణమే. అయినప్పటికీ, ఇది 'భాషను సామాజిక వాస్తవంతో అనుసంధానించడం' అనే కొత్త దిశను సాహిత్యానికి ఇచ్చింది. ఈ కారణంగానే రియలిజం, నేచురలిజం మధ్యేమార్గంగా ఉంటుందని వెరిస్మో ముద్ర పడింది. రియలిజం సాధారణంగా సమాజాన్ని ప్రతిబింబిస్తూ, కొంతమేరకు విమర్శాత్మక దృక్కోణాన్ని కలిగి ఉంటుంది. నేచురలిజం శాస్త్రీయ దృక్కోణంతో మానవ ప్రవర్తనను విశ్లేషిస్తుంది. వెరిస్మో ఈ రెండింటి లక్షణాలను కలిగి ఉన్నప్పటికీ, తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటుంది. పూర్తిగా విమర్శాత్మకమైనదికాదు. అదే సమయంలో, పూర్తిగా శాస్త్రీయమైనది కూడా కాదు. ఇది ఒక నిరీక్షణాత్మక దృక్కోణం. సాహిత్యం ఉద్దేశ్యం ఏమిటి? అది సమాజాన్ని మార్చాలా, లేకపోతే కేవలం ప్రతిబింబించాలా? అన్న ప్రశ్నలు చాలాకాలంగా ఉన్నవే. ఈ మార్గాల్లో వెరిస్మో రెండవ దానిని ఎంచుకుంది. ఒక రచన పాఠకుడిని ఆలోచింపజేస్తే, అది కూడా ఒక రకమైన మార్పుకు దారితీస్తుంది. కాబట్టి మార్పు చేయదు అనే వాదన కూడా పూర్తిగా సరైనది కాదు.



వెరిస్మోలో కథన నిర్మాణం కూడా ప్రత్యేకమైనది. కథలు సాధారణంగా చిన్న సంఘటనల చుట్టూ తిరుగుతాయి. పెద్ద నాటకీయ మలుపులు ఉండవు. జీవితం ఎలా నడుస్తుందో అలాగే కథ ముందుకు సాగుతుంది. ఇది పాఠకుడికి ఒక మెల్లని, కానీ గాఢమైన అనుభూతిని ఇస్తుంది. ఈ విధానం పాఠకుడిని కథలోకి లాగుతుంది, కానీ అదే సమయంలో ఒక దూరాన్ని కూడా ఉంచుతుంది. వెరిస్మోలో నైతికత లేకపోవడం ఒక ముఖ్యమైన అంశం. అంటే, కథల్లో మంచిచెడుల స్పష్టమైన విభజన ఉండదు. పాత్రలు తమ పరిస్థితుల ప్రకారం ప్రవర్తిస్తాయి. ఇది మానవ స్వభావాన్ని మరింత సంక్లిష్టంగా చూపిస్తుంది. ఫలితంగా పాఠకుడికి ఒక అసౌకర్యాన్ని కూడా కలిగిస్తుంది. పాఠకుడు ఎప్పుడూ ఒక స్పష్టమైన తీర్పును కోరుకుంటాడు. కానీ, వెరిస్మో అందుకు భిన్నంగా ఉంటుంది. పాఠకుడికి ఆశించిన కథనంగానీ, ముగింపుగానీ లభించవు. ఒక రకంగా ఇవి వెరిస్మో రియలిజం ధోరణికి ప్రతికూల అంశాలే. కానీ, వాస్తవాలను ప్రతిబింబించడం, పాఠకులను ఆలోచింప చేయడం వంటి బలమైన కోణాలు కూడా ఇందులో ఉన్నాయి. అందుకే, ఇది కేవలం ఇటాలియన్ సాహిత్యానికే పరిమితం కాలేదు. ఇతర దేశాల సాహిత్యాలపైనా ప్రభావితం చూపింది. ఫలితంగా వివిధ ప్రాంతాల్లో, వివిధ భాషల్లో దీనికి సమానమైన ధోరణులు కనిపిస్తాయి. ముఖ్యంగా గ్రామీణ జీవితం, పేదరికం, సామాజిక మార్పుల ప్రభావాన్ని చూపించే రచనల్లో వెరిస్మో ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. అయితే, ఈ ధోరణికి పరిమితులు కూడా ఉన్నాయి. నిరాశావాద దృక్కోణం పాఠకుడిని ఒక స్థిరమైన నిరుత్సాహానికి దారితీస్తుంది. మార్పు సాధ్యమనే ఆశను ఇది తగ్గిస్తుంది. సాహిత్యం కేవలం వాస్తవాన్ని చూపించడమే కాదు, ఒక కొత్త దృక్కోణాన్ని కూడా ఇవ్వగలిగినప్పటికీ, వెరిస్మో ఇందుకు కొంత భిన్నంగా ఉంటుంది. ఏదిఏమైనా వెరిస్మో ఒక సంక్లిష్టమైన, తాత్వికంగా లోతైన సాహిత్య ధోరణి అనడంలో సందేహం లేదు. ఇది వాస్తవాన్ని అలంకారం లేకుండా చూపించడానికి ప్రయత్నిస్తుంది. కానీ అదే సమయంలో, ఈ నిజం కూడా ఒక నిర్మాణమే అనే అంశాన్ని మనం గుర్తించాలి. ఇది పాఠకుడిని క్రియాశీలంగా ఆలోచించడానికి ప్రేరేపిస్తుంది. రచయిత తన పాత్రను తగ్గించుకున్నప్పటికీ, పాఠకుడి బాధ్యతను పెంచుతుంది. వాస్తవాన్ని తీర్పు లేకుండా చూపించడమే వెరిస్మో బలం... అదే దీని బలహీనత కూడా. ఈ విధానం ఒకవైపు సాహిత్యానికి నిజాయితీని అద్దుతుంది. మరోవైపు, పాఠకుడిని అనిశ్చితిలోకి నెడుతుంది. ఈ ద్వంద్వ స్వభావమే వెరిస్మోను ప్రత్యేకంగా నిలబెడుతుంది.

– సత్య శ్రీ

## ఈ వారం కవిత

# బతుకుదాం

భూమి మీద పుట్టిన మనం
మనిషిలా బతుకుదాం
భూమి మీద ఇంకా
మంచితనం మిగిలే ఉంది
కోరుకున్నంత ప్రగతిని అందించే
ప్రకృతి సంపద మన కుంది
ప్రకృతి గురువై మనకి నిత్యం
జీవన పాఠాలను నేర్పుతూనే ఉన్నది
అయినా నీది గాని ప్రకృతి సంపదపై
వ్యామోహం ఎందుకు ?
నీది గాని సార్వభౌమాధికార
స్వేచ్ఛ జీవితాలపై
యుద్ధ వలను విసరటం ఎందుకు ?

హద్దులు దాటిన అహంకారంతో
బాంబుల మోతలతో మిస్సైల్స్ వేట
లతో మానవత్వాన్ని
విధ్వంసిస్తావెందుకు ?
నాగరికతకు పట్టం కట్టిన
నగరాలను, శ్రమ జీవన సౌందర్యాన్ని
నేలమట్టం చేస్తావెందుకు ?
సార్వభౌమాధికారానికి, స్వేచ్ఛకు
సంకెళ్లు వేసి సకిలిస్తావెందుకు ?
ప్రపంచ కట్టుబాట్ల కండ్లల్లో
సీసం పోస్తావెందుకు?
మానవీయ పాలసీ పాలల్లో
విషం కలుపుతావెందుకు ?

వారి ఊపిరిని ఉక్కు పాదాల
కింద తొక్కిపడేస్తూ
సకల ప్రజానికం
చమటోడ్చి కట్టబెట్టిన
లక్షల కోట్ల డబ్బునంతా
యుద్ధ ఆకలి జ్వాలాల్లో
తగలబెడతావెందుకు?
భూగోళమంతా అణువు అణువున
యుద్ధాలు లేని శాంతి, ప్రగతి,
వెలుగులను కోరుకునే
ప్రపంచ శాంతి కపోతం కలలను
రక్తసిక్తం చేస్తావ్ ఎందుకు?
గుర్తుంచుకో ... ఆధిపత్యపు
ఆలోచనలు ఎప్పుడూ
యుద్ధానికే దారులేస్తుంటాయి

నీది కాని దానికి ఎప్పుడు ఆశపడకు
ఆశపడితే నీవు ఒక యుద్ధోన్మాదివే
యుద్ధం చల్లిన విధ్వంసకాండలో
భవిష్యత్తును నిర్మించే
పాఠాలను చదువుతూ ప్రాణాలు
వదిలిన బాల్యాన్ని అడుగు ...
రక్తం కారుతున్న నాగరికత
శిథిలాలను అడుగు..
చివరి శ్వాసను వదిలే
ప్రతీ గుండెనడుగు..
యుద్ధం ఒక నేరమని చెబుతుంది..
యుద్ధం అంటే మరణం అని చెబుతుంది.
యుద్ధాలు లేని సమాజం గురించి,
శాంతి స్థాపన గురించి మరణ
వాంగ్మూలానిస్తుంది!

ఎన్నో కలలు కంటూ భూగోళం లాంటి
గర్భంలోని బిడ్డను బతికించుకుంటూ
నవ మాసాలు మోసి
జన్మనిచ్చిన తల్లి కసాయిదైతే
నువ్వు బతికేవాడివా?
తండ్రి కసాయి వాడైతే
నువ్వు ఎదిగే వాడివా ?
సమాజం నిన్ను ఆదరించకపోతే
నీ జీవితంలో కొత్త వెలుగు నిండేదా?
యుద్ధం నేటి తల్లిదండ్రులకు,
నేటి బాల్యానికి, రేపటి తరానికి
జీవితాన్నిస్తుందా ?
సమాజానికి ఆక్సిజన్ అందిస్తుందా?

నీ చుట్టూ ఉన్న సమాజాన్ని
బతికించుకోవడానికి
శాంతి ప్రగతి అభ్యుదయం భావాల
పంటను పండించడానికి
మానవత్వంతో ఆలోచించవెందుకు ?
నీ గుండె లోతుల్లో గూడు
కట్టుకున్న యుద్ధాలోచనల
రాక్షసిని సమాధి చేసి
శాంతి పావురాల రెక్కల
సంగీతపు చప్పుడు నువ్వు
ఒక్కసారి మనసుపెట్టి విను !

నీలో, నాలో, మనలో, నిత్యం
జీవనదిలా మానవత్వం
విరబూస్తూ ప్రవహించాలి !

మానవత్వమే కదా
మనుషులను దగ్గరికి చేర్చేది
నీకు తెలియదా ?
ప్రతీ మనిషీ రక్తపు రుచి మరిగిన
క్రూరత్వం నోటికి ఆహారంగా
బలి కావాలని కోరుకోడు.
రక్తం ఇచ్చి కాపాడిన
మానవత్వానికి పట్టం కట్టి
బంగారపు గుండె పళ్ళెంలో
కాళ్లు కడుగుతారు..
ఇప్పుడు చెప్పు !
రక్తం రుచి మరిగిన
యుద్ధ పిపాసిలా బతుకుదామా?
మానవత్వమై సజీవనదిలా ప్రవహిద్దామా!

ఈ సమాజపు గుండె లోతుల్లోకి
మనం తాత్విక దృష్టితో చూసి
ఆలోచించాలి కదా !
మనిషి మనిషికి మధ్యన ఉన్న తేడా
గురించి ఆలోచించాలి కదా !
వ్యక్తుల మధ్యన చిచ్చు పెట్టిన
చీడపురుగుల చదరంగపు ఆటల
గురించి ఆలోచించాలి కదా !
ఎన్ని మెట్లు ఎక్కినా పరమ
పద సోపాన పటములోని
పాము మింగిన వ్యక్తిలా
కింద పడుతూనే ఉన్న
జీవితాలను చూసి ఆనందించే
అసమానత్వ సమాజం అంతు చూసే
చర్యల గురించి ఆలోచించాలి కదా !

మనిషికి రకరకాల అవకాశవాద
రంగులను పూస్తున్నది ఎవరు ?
మనిషిలో రంగురంగుల ఆశలను
లేపుతున్నది ఎవరు ?
మనిషిలో ఉన్న ఆశయాలను
పాతాళానికి తొక్కుతున్నది ఎవరు ?
మన ఆశలను ఆశయాలను
చిదిమేసే అధికారం
వాడికి ఎవరిచ్చారు ?



బహుళ సంస్కృతుల పూల తోటలో
పరిమళిస్తు ప్రేమానురాగాల
దారుల్లో ప్రయాణిస్తున్న
జీవితాలపై మూకదాడులై
ముట్టడిస్తున్న ఉన్మాదపు
మూలాల అంతం గురించి
ఆలోచించాలి కదా !

నీ పుట్టుక ఏదైతేనేమి ?
రంగు మతం ఏదైతేనేమి ?
నీ ప్రాంతం హోదా ఏదైతేనేమి ?
అందరూ చిందించిన చెమట రక్తం
తోఎదిగిన వాడివే కదా
నీవు మనిషివే కదా..

మరి మనిషిలా ఆలోచించవెందుకు ?
ఒక్కసారి 'ఉన్మాదపు 'కుబుస
మిడిచి ఆలోచించి చూడు
మనుషుల పట్ల ఎటువంటి
భేదాన్ని చూపని
గాలి, నీరు, అగ్ని, భూమి,
ఆకాశములను, ఆవహించుకొని
నీ హృదయముతో
ఒక్కసారి ఆలోచించి చూడు ....

అందరూ సమానవకాశములతో
శాంతితో, సంతోష ఫలాలను
పంచుకు బతికే సమాజం గురించి
విశాలమైన హృదయముతో
ఆలోచించి చూడు
వినూత్నమైన మనిషిలా ....
ఉన్నతమైన విలువల శిఖరంపై
'సమతా పతాకాన్ని' ఎగరవేసే
మానవ సమాజం నిర్మాణం కోసం
విశ్వ శాంతిని కోరుకునే
మానవుడిలా బతకాలనిపిస్తుంది
మనిషిలా బతకాలనిపిస్తుంది...
అందరూ మనిషిలా
బతకాలి అనిపిస్తుంది.
అవును అందరం
మనిషిలా బతుకుదాం...

– రచన : కెవిఎల్

## స్వానుభవంతో రచనలు..



అత్యధిక శాతం మంది రచయితలు ఊహించిగానీ, తాము చూసినవిగానీ తమతమ రచనల్లో పొందుపరుస్తుంటారు. అయితే, తాము స్వయంగా చేసిన లేదా అనుభవించిన అంశాలను రచనల్లో చేర్చిన వారి సంఖ్య చాలా పరిమితంగా ఉంటుంది. అలాంటి అరుదైన రచయితల్లో ముందుగా 'షెర్లాక్ హోమ్స్' పాత్ర సృష్టికర్త ఆర్థర్ కానన్ డోయెల్ పేరును ప్రధానంగా ప్రస్తావించాలి. ఆయన డిటెక్టివ్ కథలు ఎంత గొప్పగా రాస్తాడో, కొన్ని సందర్భాల్లో వర్ణన కూడా అంతే గొప్పగా ఆవిష్కరిస్తాడు. 1893లో డోయెల్ నార్వేకి వెళ్లినప్పుడు స్కీయింగ్ అనుభవాన్ని పొందాడు. ఆ అనుభవాన్ని ఆయన రచనలలో, ముఖ్యంగా ఒక వ్యాసంలోవివరించాడు. ఈ వర్ణన ఆంగ్ల పాఠకులకు స్కీయింగ్ గురించి ఒక స్పష్టమైన, ప్రత్యక్ష అనుభూతిని అందించింది. ఆంగ్ల సాహిత్యంలో స్కీయింగ్ గురించి వివరించిన మొదటి రచయిత డోయెల్ కాకపోవచ్చు. సాహిత్యపరంగా చూస్తే, ఆయన ముందు కూడా కొన్ని ప్రయాణికులు లేదా పరిశోధకులు స్కీయింగ్ గురించి ఆంగ్లంలో ప్రస్తావించి ఉండే అవకాశం ఉంది. కానీ, రాసింది డోయెల్ కాబట్టి, విశేషంగా ప్రచారమైంది. స్కీయింగ్‌ను ఒక ఆసక్తికరమైన, సాహసభరితమైన క్రీడగా ప్రజల్లో పరిచయం చేసే క్రమంలో ఆయన వర్ణించిన తీరు, చూపిన ఉత్సాహం అందరినీ ఆకట్టుకుంది. అప్పటి వరకూ చాలా కొద్ది మందికి మాత్రమే పరిచమైన స్కీయింగ్ ఆ తర్వాతి కాలంలో విశేష ప్రాచుర్యం పొందింది. ఒక రచయిత ఏదైనా విషయాన్ని వర్ణించడమే దాని ప్రాచుర్యానికి కారణమవుతుందా అన్న ప్రశ్నకు, స్కీయింగ్‌ను ఉదాహరణగా పేర్కొంటారు. స్కీయింగ్ అప్పటికి నార్వేలో ఒక సాధారణ క్రీడ. ప్రపంచ వ్యాప్తంగా అంతగా పరిచయం లేనిది. కానీ, డోయెల్ కారణంగా స్కీయింగ్ సామాన్యులకు కూడా చేరింది. ఈ క్రీడ ఆయనకు ఎంతో రుణపడి ఉంటుంది.


# నిర్లక్ష్యంపై పోరాటం..

అంతులేని నిర్లక్ష్యానికి, అవమానానికి గురైన వారు ఒకొక్కరూ ఒక్కో రకంగా స్పందిస్తారు. ఒకవేళ వారు సాహితీకారులైతే, అక్షరాలను అస్త్రాలుగా చేసుకొని ప్రతిఘటన పోరాటాన్ని కొనసాగిస్తారు. అమెరికా దక్షిణ ప్రాంత సాహిత్య చరిత్రలో అలాంటి వారే 'ఫుజిటివ్ కవులు'. తమను తాము దక్షిణ అమెరికా నుంచి పారిపోయిన వారిగా పేర్కొన్న వీరిలో ఎక్కువ మంది వండర్‌బిల్ట్ యూనివర్సిటీకి చెందిన కవులు, మేధావులు. 1922–1925 మధ్యకాలంలో ప్రచురితమైన 'ది ఫుజిటివ్' అనే పత్రిక వీరి ఆలోచనలకు కేంద్రంగా పనిచేసింది. ఈ పత్రిక చుట్టూ ఏర్పడిన సాహిత్య వర్గమే ఫ్యూజిటివ్ కవులుగా ప్రసిద్ధి చెందింది. ఈ సమూహం ఏర్పడటానికి ఉన్న చారిత్రక నేపథ్యం గమనించాల్సినది. ఆ కాలంలో అమెరికా దక్షిణ ప్రాంతాన్ని సాంస్కృతికంగా వెనుకబడి ఉన్న ప్రాంతంగా విమర్శించారు. ఈ ప్రాంతాన్ని 'సహారా ఆఫ్ ది బొజార్ట్' అంటూ హెచ్‌ఎల్ మెకెన్ అభివర్ణించాడు. ఈ ధోరణి ఆ ప్రాంత రచయితలు, మేధావుల్లో కదలికకు కారణమైంది. ఈ విమర్శకు సాహిత్యపరంగా సమాధానం ఇవ్వాలనే ఉద్దేశంతో ఫ్యూజిటివ్ కవులు తమ రచనలను ప్రారంభించారు. ఈ సమూహం కేవలం సాహిత్య ప్రయోగం కాదని, అది ఒక ప్రాంతీయ గౌరవాన్ని తిరిగి స్థాపించాలనే ప్రయత్నమని నిరూపించారు. ఈ సమూహంలో జాన్ క్రో రాన్సమ్, అలెన్ టటే, రాబర్ట్ పెన్ వారెన్, డొనాల్డ్ డేవిడ్‌సన్ వంటి ప్రముఖులు ఉన్నాయి. ఈ సమూహంలో ఎక్కువ మంది కవులు... విమర్శకులు... మేధావులు... దార్శనికులు. వీరి రచనల్లో కవిత్వం, విమర్శ పరస్పర సంబంధంతో అభివృద్ధి చెందాయి. ఫ్యూజిటివ్ కవుల ప్రధాన లక్షణం వారి కవిత్వ దృష్టికోణం. ఆ కాలంలో ప్రాచుర్యంలోకి వస్తున్న ఆధునిక భావోద్వేగ కవిత్వానికి భిన్నంగా, వీరు కవిత్వంలో కట్టుదిట్టమైన నిర్మాణాన్ని, స్పష్టమైన దృశ్యాల రూపకల్పనను, మరియు వ్యంగ్యాన్ని కీలకంగా పరిగణించారు. వీరి అభిప్రాయం ప్రకారం, కవిత్వం కేవలం భావోద్వేగ ప్రవాహం కాదు... ఒక శిల్పం. ఈ దృష్టిలో వీరు సంప్రదాయ ఛందస్సులు, కవితా నిర్మాణాలను సమర్థించారు. వీరు ఆధునిక భావోద్వేగ కవిత్వాన్ని తిరస్కరించడం ద్వారా, సాహిత్యాన్ని ఒక నియంత్రిత వ్యవస్థలో బంధించారన్న విమర్శలు లేకపోలేదు. అయితే, కవిత్వానికి ఒక క్రమబద్ధతను తిరిగి తీసుకువచ్చారన్న వాదన కూడా ఉంది. ఒకవైపు, వీరి దృష్టికోణం కవిత్వాన్ని గంభీరంగా మార్చింది. మరోవైపు, అది స్వేచ్ఛా వ్యక్తీకరణను కొంతవరకు



పరిమితం చేసింది. ఈ సమూహం తరువాతి దశలో అమెరికన్ సాహిత్య విమర్శలో ఒక ప్రధాన ఉద్యమమైన 'న్యూ క్రిటిసిజం' అభివృద్ధికి పునాది వేసింది. ఈ విమర్శా పద్ధతి ప్రకారం, సాహిత్య కృతిని రచయిత జీవితం లేదా చారిత్రక నేపథ్యంతో కాకుండా, కృతిలోని అంతర్గత నిర్మాణం ఆధారంగా విశ్లేషించాలి. ఈ విధానం సాహిత్య అధ్యయనంలో ఒక కొత్త మార్గాన్ని చూపించింది. ఫ్యూజిటివ్ కవులలో చాలామంది తర్వాతి కాలంలో 'సదరన్ ఆగ్రేరియన్' ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఈ ఉద్యమం పరిశ్రమీకరణను వ్యతిరేకించింది. సంప్రదాయ వ్యవసాయ జీవన విధానాన్ని సమర్థించింది. ఈ భావజాలం 'ఐ విల్ టేక్ మై స్టాండ్' అనే పేరుతో వచ్చిన పుస్తకంలోని వ్యాసాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. మొదట పాత దక్షిణం నుంచి పారిపోయినట్లు తమను తాము 'ఫుజిటివ్'గా పేర్కొన్న ఈ కవులు, తరువాత అదే సంప్రదాయాలను రక్షించే దిశగా వెళ్లారు. ఈ మార్పు వారి ఆలోచనలోని సంక్లిష్టతను సూచిస్తుంది. కాగా, ఈ సమూహంలో మహిళా ప్రాతినిధ్యం తక్కువగా ఉండటం అప్పట్లో విమర్శలకు గురైంది. లారా రిడింగ్ ఈ వర్గంతో కలిసినప్పటికీ, ఆమెకు తగినంత గుర్తింపుగానీ, గౌరవంగానీ ఇవ్వలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇది ఆ కాలంలోని సాహిత్య వర్గాల లింగ అసమానతను ప్రతిబింబిస్తుంది. ఏదిఏమైనా, ఫ్యూజిటివ్ కవులు అమెరికా దక్షిణ ప్రాంతంలో ఒక సాహిత్య పునరుజ్జీవనానికి కారణమయ్యారు. వారు కవిత్వాన్ని క్రమబద్ధంగా, శిల్పాత్మకంగా అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించారు. భావోద్వేగ స్వేచ్ఛను నియంత్రించడం, సంప్రదాయాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం వారి ద్వంద్వ ధోరణులకు నిదర్శనం. ఈ స్వభావమే ఈ సమూహాన్ని సాహిత్య చరిత్రలో ప్రాముఖ్యంగా నిలబెడుతున్నదని విశ్లేషకుల అభిప్రాయం.

## స్థిరమైన సంచిక లేని పుస్తకం!



ఒక పుస్తకం ఎప్పుడు ముద్రించబడింది, పునర్ముద్రణ ఎప్పుడు జరిగింది అనే వివరాలు అందుబాటులో ఉంటాయి. కానీ, 'వన్ థౌజెండ్ అండ్ వన్ నైట్స్' (అరబిక్‌లో అల్ఫ్ లైలా వ లైలా) అనేది ఇందుకు పూర్తి భిన్నం. ఎందుకంటే, ఇది ఒకే రచయిత రాసిన గ్రంథం కాదు. శతాబ్దాలుగా వివిధ ప్రాంతాల్లో (పర్షియా, అరేబియా, ఇండియా) పుట్టిన కథల సమాహారం. అందువల్ల దీనికి స్థిరమైన అసలు సంచిక అనేదే లేదు. అల్లాద్దీన్, అలీ బాబా, సింద్‌బాద్ తదితర కథలు నిజంగా ప్రాచీన అరబిక్‌లో వెలువడిన పుస్తకంలో లేవనే వాదన ఉంది. వీటిలో అల్లాద్దీన్, అలీబాబా కథలు నిజంగానే ప్రాచీన అరబిక్ రాతప్రతుల్లో కనిపించవు. వీటిని 18వ శతాబ్దంలో ఫ్రెంచ్ పండితుడు ఆంటోయిన్ గాలాండ్ తన ఫ్రెంచ్ అనువాదంలో చేర్చాడు. ఆయనకు ఈ కథలు ఒక సిరియన్ కథకుడు 'హనాడియాబ్' ద్వారా మౌఖికంగా అందినట్లు పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే, ఇక్కడ మరో విషయాన్ని కూడా గుర్తుంచుకోవాలి. అదేమిటంటే, సింద్‌బాద్ కథలన్నీ పూర్తిగా గాలాండ్ మాత్రమే రాయలేదు. అవి, అంతకు ముందే అరబిక్ సంప్రదాయ జానపద గాథలుగా ప్రచారంలో ఉన్నాయి. అయితే, వాటిని ఆయా సంచికల్లో చేర్చలేదు. అంటే, గాలాండ్ సింద్‌బాద్ కథలను సృష్టించలేదు. అవి ప్రాచుర్యం పొందడానికి సహకరించాడు. కొన్ని కథలను అతను రచించినప్పటికీ, వాటికి మూలాలు అరబిక్ జానపదాల్లో ఉన్నాయని అంటారు. మరో వాదన ప్రకారం, గాలాండ్ మౌఖిక సంప్రదాయంలో ఉన్న కథలను లిఖిత రూపంలోకి తీసుకువచ్చాడు. దీనిని బట్టి అతను అంటే సంప్రదాయాన్ని విస్తరించాడు. అంతేతప్ప సృష్టించలేదు. ఈ వాదనలు... వాస్తవాలు ఎలావున్నా అల్లాదీన్, అలీ బాబా కథలు ఒరిజినల్ అరబి పుస్తకాల్లో లేకపోయినా, గాలాండ్ వల్లే అవి ప్రసిద్ధి పొందాయన్నది నిజం.అతను కేవలం పాఠ్యాన్ని మార్చలేదు.. మొత్తం సాహిత్య సంప్రదాయాన్ని మళ్లీ నిర్వచించాడు.



## ఇద్దరు మిత్రులు..



సాహిత్య రంగంలో ఇద్దరు రచయితల మధ్య స్నేహం అసాధ్యం కాకపోయినా, చాలా అరుదు. అలాంటి అరుదైన స్నేహితుల్లో జెఆర్ఆర్ టోల్కిన్, సిఎస్ లూయిస్ పేర్లను ప్రస్తావించారు. వీరిద్దరూ అత్యంత సన్నిహిత మిత్రులుగా పేరుపొందారు. ఇద్దరూ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఆంగ్ల సాహిత్య అధ్యాపకులుగా పని చేశారు. వీరు కలిసి పాల్గొన్న సాహిత్య వేదిక 'ది ఇన్‌క్లింగ్స్' చాలా ప్రసిద్ధి చెందింది.ఈ ఇంక్లింగ్స్ గుంపులో రచయితలు తమ రచనల ముసాయిదాలను ఒకరికి ఒకరు చదివి వినిపించి, విమర్శలు, సూచనలు ఇచ్చేవారు. ఈ పరస్పర విమర్శల వాతావరణం, టోల్కిన్ 'ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్' వంటి రచనల అభివృద్ధికి, అలాగే లూయిస్ 'ది క్రానికల్స్ ఆఫ్ నార్నియా' రూపకల్పనకు గణనీయంగా సహాయపడింది. వారి స్నేహం సాహిత్యపరంగా గుణాత్మక ఫలితాలు చూపింది. లూయిస్ తన కథల ప్రధాన పాత్రను టోల్కిన్‌ను దృష్టిలో ఉంచుకొని రూపకల్పన చేసేవాడని అంటారు. అయితే, టోల్కిన్ ఒక గంభీరమైన, భాషాపరంగా కఠినమైన పండితుడు. కానీ లూయిస్ కథల్లోని పాత్రలు సాధారణంగా పిల్లల అమాయకత్వం, నైతిక ప్రయాణం, ఆధ్యాత్మిక ప్రతీకల చుట్టూ తిరుగుతాయి. కాబట్టి, ఈ వాదన సరైనది కాకపోవచ్చు. కానీ, టోల్కిన్‌తో లూయిస్ మైత్రి నిజం. ఒకరికొకరు సహాయకులుగా, విమర్శకులుగా, మార్గదర్శకులుగా నిలిచారన్నది కూడా నిజమే. సాహితీ ప్రపంచంలో అరుదైన స్నేహితుల జాబితాలో వీరు తప్పనిసరిగా ఉంటారు.

# 30న రైతు ఆశీర్వాద సభ



● సానుకూల నిర్ణయాలు ప్రకటిస్తారా?

**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ ప్రభుత్వం రైతు ఆశీర్వాద సభ పేరుతో ఈనెల 30న భారీ సభ ఏర్పాటు చేయనుండటం స్వాగతించాల్సిన అంశమే. రాష్ట్రంలోని మిగిలిన వర్గాల కంటే రైతాంగంలోనే ప్రభుత్వం పట్ల అసమ్మతి పెరుగుతున్న వేళ ప్రభుత్వం మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టి రైతుల్లో మళ్లీ ఆశలు రేపింది. ఆశీర్వాద సభలో సానుకూల నిర్ణయాలు ప్రకటించకపోతే అసంతృప్తి నుంచి ఆగ్రహం కలిగే ప్రమాదం ఉంది. ముఖ్యంగా సభ ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్నందున జిల్లా సాగునీటి ప్రాజెక్టులు, స్థానిక అంశాల పైన స్పష్టమైన ప్రకటన చేయాల్సి ఉంది.

### సాగుతున్న సీతారామ- పెరుగుతున్న అంచనాలు

గోదావరి జలాలను ఉమ్మడి ఖమ్మంజిల్లాకు సాగునీటిగా అందించాలని అనేక చారిత్రిక పోరాటాలు జరిగాయి. కమ్యూనిస్టుల పోరాటాలు, అమరణ నిరాహార దీక్షలు, ర్యాలీలు, పాదయాత్రలు, ఆందోళనల ఫలితంగా దుమ్ముగూడెం వద్ద ఎత్తిపోతల నిర్మాణానికి పాదు పడింది. గోదావరి నదిపై రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ పేరుతో ప్రాజెక్టులు ప్రారంభమై రెండువేల కోట్లు ఖర్చు చేసిన తర్వాత రాష్ట్ర విభజనతో ఆ ప్రాజెక్టులకు బ్రేక్ పడింది. 2016లో సీతారామ ప్రాజెక్టుకు రూపకల్పన చేసి రెండున్నర లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, నాలుగున్నర లక్షల ఎకరాల సాగు స్థిరీకరణ చేయాలని శంకుస్థాపన చేశారు. రూ.11వేల కోట్లతో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు నిర్మాణంలో కాలయాపన కారణంగా రూ.19,365 కోట్లకు అంచనా వ్యయం పెరిగింది. బిఆర్ఎస్ ప్రభుత్వం తాత్సర్యం చేసిందంటే కాంగ్రెస్ పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. ఈ ఏడాది బడ్జెట్‌లో కేవలం రూ.360 కోట్లు మాత్రమే కేటాయించారు. మూడు బడ్జెట్లలో వెయ్యి కోట్లకు మించి కేటాయించలేదు. ఇదే రీతి కేటాయింపులు జరిపితే నిర్మాణ వ్యయం పెరగడం తప్ప సీతారామ కలగానే మిగులుతుంది. ఆశీర్వాద సభలో సీతారామ పూర్తికి నిర్దిష్ట గడువు ప్రకటించాలని జిల్లా రైతాంగం కోరుతుంది.

### రైతు భరోసా

రైతు భరోసాకు సంబంధించి ప్రభుత్వంపై రైతులు నమ్మకాన్ని కోల్పోతున్నారు. ఇచ్చిన హామీని రూ.15వేల నుంచి రూ.12వేలకు కుదించినా ఇది అయినా సక్రమంగా ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఎగవేతలు, కోతలతో రైతు భరోసా పథ కం నడుస్తుంది. గత యాసంగి పంటకు రెండు ఎకరాల వరకే రైతు భరోసా ఇచ్చారు. రైతు ఆశీర్వాద సభలో వానాకాలం పంటకు సంబంధించిఎన్ని ఎకరాల వరకు రైతు భరోసా అందిస్తారో స్పష్టత లేదు. ఎకరాకు రూ.12వేలు అయినా పూర్తిస్థాయిలో అంటే సాగు ఉన్న ప్రతి ఎకరాకు అందించేవిధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. చింతకాని రైతు ఆశీర్వాద సభలో రైతుల ఖాతాల్లో నగదు జమ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలి.

### పంటల బీమా

ప్రతి ఏటా ప్రకృతి ప్రకోపానికి రైతులు నష్టపోతున్నారు. అతివృష్టి, అనావృష్టి, చీడ పీడలు దిగుబడిపై ప్రభావం చూపుతున్నాయి. బిఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఫసల్ బీమా యోజన పథకం నుండి బయటకు వచ్చి రాష్ట్రంలో కొత్త పథకం ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ఆ పని చేయలేదు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పంట బీమా పథకం తీసుకు వస్తామని చెప్పి హామీ ఇచ్చిన అమలు కాలేదు. ఈ ఏడాది నుంచి పంట ల బీమా పథకం అమలుపై ఆశీర్వాద సభలో ప్రకటన చేసి రైతులను ఆశీర్వదించాలని కోరుతున్నారు. రైతు బీమాను కూడా అమలు చేయాలని కోరుతున్నారు.

### కొనుగోలు డబ్బులు - సన్న రకాలు

గత యాసంగిలో రైతులు పండించిన మొక్కజొన్నలను మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసింది. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు. సత్వరం రైతుల ఖాతాల్లో జమ చేసి పెట్టుబడికి ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు. ధాన్యానికి సంబంధించి ఏడు రకాల సన్నాలకు మాత్రమే బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆ ఏడు రకాల విత్తనాలు పూర్తి స్థాయిలో లభ్యం కావడం లేదు. గతంలో మాదిరిగానే అన్ని రకాల సన్న ధాన్యానికి బోనస్ ఇవ్వాలని, బోనస్ మొత్తాన్ని రైతుల ఖాతాల్లో తక్షణం జమ చేయాలని కోరుతున్నారు.

### వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు

జిల్లా విభజన తర్వాత ఖమ్మం జిల్లా కేవలం వ్యవసాయ ఆధారిత జిల్లాగా మారింది. జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పితే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయి. ఆ దిశగా ఆలోచన చేయాల్సి ఉంది. ప్రధాన పరిశ్రమగా ఉన్న గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలి. జిల్లాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి చూపుతున్న గ్రానైట్ పరిశ్రమ పరిరక్షణ ప్రభుత్వ బాధ్యతగా భావించాలి. ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాల్సి ఉంది. ఆరు గ్యారెంటీలకు సంబంధించి ప్రభుత్వం ఓ అడుగు ముందుకు వేయాలని కోరుతున్నారు. రైతు ఆశీర్వాద సభ తర్వాత రైతుల్లో ప్రభుత్వం పట్ల సానుకూలత పెరగాలి. ఇప్పుడిప్పుడే రగులుకుంటున్న అసమ్మతిని చల్లార్చేలా రైతు ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి ప్రకటన ఉండాలి. లేకపోతే ఆశీర్వాద సభ నుంచే రైతుల అసమ్మతి ఆగ్రహంగా మారుతుంది.



## భారతదేశ విముక్తికి మార్క్సిజమే అజేయం

● సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/మంచిర్యాల :** దేశ విముక్తి కమ్యూనిస్టు సిద్ధాంతం ద్వారా మాత్రమే సాధ్యమని, దాన్ని జయించడం ఎవరి తరం కాదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంచిర్యాలలోని ఎం కన్వెన్షన్ హాల్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమితి సభ్యుల రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ తరగతులకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లింగం రవి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించగా, తక్కలపల్లి శ్రీనివాసరావు ముఖ్య వక్తగా హాజరై ప్రారంభ ఉపన్యాసం చేశారు. అవినీతి రహిత సమాజమే ఎజెండా అని చెప్పున్న ప్రస్తుత బిజెపి ప్రభుత్వంలో చాలామంది అవినీతి పరులే దేశ పరిపాలనలో అగ్రగాములుగా ఉన్నారని ఆయన విమర్శించారు. దేశంలో దొంగ ఓట్లను ఏరివేస్తున్నామనే నెపంతో తీసుకువచ్చిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ కూడా బిజెపి వ్యతిరేక ఓట్ల ను ఏరివేస్తూ, ఆ పార్టీ అనుకూల ఓట్లను నమోదు చేయడానికి చేసిన మోసమేనని ఆరోపించారు. కులాంతర, మత తత్వ, అభివృద్ధి నిరోధక, అవకాశవాద బిజెపిని కూలదోయడం కాంగ్రెస్ పార్టీతో సాధ్యం కాదని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మరొక శిక్షకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ మార్క్స్ సిద్ధాంతం అజేయమైనదని, దీని ద్వారానే ప్రపంచంలో చాలా దేశాలు బానిస సంకెళ్లు తెంచుకుని స్వేచ్ఛగా జీవిస్తున్నాయని తెలిపారు. కమ్యూనిస్టు సిద్ధాంతం ఉన్నవాడు, లేనివాడు అనే తేడా చూడకుండా.. ఉన్నవాడు ఎందుకు ఉన్నవాడయ్యాడు, లేనివాడు ఎందుకు పేదవాడిగానే మిగిలిపోతున్నాడు అనే సూత్రాన్ని మాత్రమే చూసిందన్నారు. సమాజంలో అసమానతలు, దోపిడీ ఉన్నంతవరకు కమ్యూనిస్టు సిద్ధాంతం ప్రజల్లోకి వెళ్లాలని, దానికి వేదిక భారత కమ్యూనిస్టు పార్టీ కావాలని పేర్కొన్నారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక మార్పులు రావాలని కమ్యూనిస్టు సిద్ధాంతం కోరుకుందని, సమకాలీన భారతదేశంలో ఈ సిద్ధాంతాన్ని కాపాడుతూ దేశ విముక్తికి కంకణబద్ధులై ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యు లు కలవేన శంకర్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యు లు వాసిరెడ్డి సీతారామయ్య, మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్, ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, నిర్మల్ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ నాయక్, ఆసిఫాబాద్ జిల్లా కార్యదర్శి బద్రి సాయికుమార్, పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, ఎస్.విలా స్, మేకల దాసు, కలిందర్ అలీ ఖాన్, రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, ఇప్పకాయల లింగయ్య, బీమనథుని సుదర్శన్, దాగం మల్లేష్, కారుకూరి నగేశ్, రేగుంట చంద్రకళ, కే.వీర భద్రయ్య, ముస్కే సమ్మయ్య, ఎస్‌కె బాజీ సైదా తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో ఏరోమార్ట్- 2026..
# ప్రపంచ విమానయాన దిగ్గజాలకు వేదిక

● 25 దేశాల నుంచి 400 కంపెనీలు
● తెలంగాణకు పెట్టుబడులు, వ్యాపార అవకాశాలపై భారీ అంచనాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచ విమానయాన, రక్షణ తయారీ రంగాల దృష్టి మరోసారి హైదరాబాద్‌పై పడింది. జూన్ 30 నుంచి జులై 2 వరకు హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసిసి) వేదికగా జరగనున్న 'ఏరోమార్ట్ హైదరాబాద్ 2026' అంతర్జాతీయ సదస్సు దేశ విమానయాన పరిశ్రమకు కీలక మైలురాయిగా నిలవనుంది. ప్రపంచ దిగ్గజ విమాన తయారీ సంస్థలు, భారతీయ సరఫరాదారులు ఒకే వేదికపై సమావేశమై కొత్త వ్యాపార భాగస్వామ్యాలు, పెట్టుబడి అవకాశాలపై చర్చించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు 25 దేశాల నుంచి 400కుపైగా ప్రముఖ విమానయాన, రక్షణ సంస్థలు, 1,200 మందికి పైగా ప్రతినిధులు హాజరవుతున్నారు. విమానాలు, ఇంజిన్లు, విడిభాగాల తయారీ సంస్థలు భారతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలతో నేరుగా సమావేశమై సరఫరా ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం కల్పించనున్నారు. 'ఆత్మ నిర్భర్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా దేశీయ తయారీ రంగాన్ని బలోపేతం చేయడం, రక్షణ ఉత్పత్తుల్లో స్వావలంబన సాధించడం, ఎగుమతులను పెంచడం వంటి అంశాలు ఈ సదస్సులో ప్రధాన చర్చాంశాలుగా ఉండనున్నాయి. ప్రపంచ సంస్థలు తమ గ్లోబల్ సప్లై చైన్‌లో భారతీయ కంపెనీలను భాగస్వాములుగా చేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. విమానయాన, రక్షణ తయారీ రంగంలో హైదరాబాద్ ఇప్పటికే దేశంలో కీలక కేంద్రంగా ఎదిగింది. రాష్ట్రంలో 25కు పైగా ప్రధాన ఏరోస్పేస్, డిఫెన్స్ సంస్థలు, వెయ్యికి పైగా సరఫరా సంస్థలు, నాలుగు ప్రత్యేక ఏరోస్పేస్ పార్కులు, డిఆర్‌డిఒ ప్రయోగశాలలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రముఖ విద్యాసంస్థలు ఈ రంగానికి బలమైన మౌలిక వసతులను అందిస్తున్నాయి. బోయింగ్, ఎయిర్‌బస్, లాక్‌హీడ్ మార్టిన్, జిఇ ఏరోస్పేస్, హానీవెల్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఇప్పటికే తెలంగాణలో తమ కార్యకలాపాలను విస్తరించాయి. దీంతో విమాన విడిభాగాల తయారీ, నిర్వహణ (ఎంఆర్ఒ), అధునాతన ఇంజినీరింగ్ సేవలకు హైదరాబాద్ ప్రముఖ కేంద్రంగా గుర్తింపు పొందుతోంది. ఈ సదస్సు ద్వారా తెలంగాణకు కొత్త పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు స్థానిక చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అంతర్జాతీయ మార్కెట్లలో ప్రవేశించే అవకాశం లభించనుంది. వ్యాపార సమావేశాలతో పాటు విమానయాన తయారీ భవిష్యత్తు, డిజిటల్ సాంకేతికతలు, సరఫరా వ్యవస్థలు, కొనుగోలు విధానాలపై నిపుణులతో ప్రత్యేక సదస్సులు కూడా నిర్వహించనున్నారు. అడ్వాన్స్‌డ బిజినెస్ ఈవెంట్స్ (ఎబిఇ, బిసిఐ ఏరోస్పేస్ సంస్థలు తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ రైజింగ్, టిజిఐఐసి సహకారంతో నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ సదస్సు రాష్ట్రాన్ని ప్రపంచ ఏరోస్పేస్ మ్యాప్‌లో మరింత ఉన్నత స్థానంలో నిలబెడుతుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

## సిఎం రేవంత్‌రెడ్డి మాట నీటి మూట

● మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు



**ప్రజాపక్షం/సిద్ధిపేట :** 99 రోజుల్లో రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్స్ ఇస్తామన్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట నీటి మూట అయిందని .. ఉద్యోగులు జీవితకాలం దాచుకున్న డబ్బులు ఇవ్వకుండా కాంగ్రెస్ సర్కార్ దగా చేస్తుందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటి ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు అన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో అగ్రిమెంట్లు లేవని, ఉచిత వైద్యం అసలే లేదని, కాని క్యాష్‌లెస్ స్కీంతో ప్రతి నెల ఉద్యోగుల నుండి 1.5శాతం డబ్బులు కట్ చేస్తూ ప్రభుత్వం దోపీడికి పాల్పడుతుందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా 7 డిఎలు, పిఆర్‌సి పెండింగ్ పెట్టిన ప్రభుత్వమని.. న్యాయం అడిగిన ఉద్యోగ సంఘాలపై ఎసిబి, విజిలెన్స్ దాడులతో నియంతలా వ్యవహరిస్తుందని హరీష్‌రావు ఆరోపించారు. ఆదివారం సిద్దిపేట విపంచి కళామండపంలో వజ్రమ్మ పదవి విరమణ సత్కార కార్యక్రమంలో బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు పదవి విరమణ పొందిన వెంటనే వారికి రావాల్సిన బెన్‌ఫిట్స్ అన్ని అందేవని, కానీ ఇప్పుడు రిటైరవుతున్న వారికి తమ సొంత డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందన్నారు. 99రోజుల్లో రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్స్ ఇస్తానని ప్రకటించిన సిఎం మాట ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. సిఎం కుర్చీలో కూర్చొని ఇచ్చిన మాటకు విలువ ఉండాలన్నారు. రాష్ట్రంలో బ్రేక్‌ఫాసు పథకాన్ని మళ్లీ ప్రారంభించి సిద్దిపేట జిల్లాపై కక్షతో ఫేజ్1లో మన జిల్లా పేరు లేకుండా పూర్తిగా పక్కకు పెట్టారని, ఇది సిద్దిపేటపై పగ సాధించటమే అన్నారు. ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన వజ్రమ్మ భగవాన్‌రెడ్డి అత్యంత సాధారణ జీవితం గడుపుతూ పూర్తి చిత్తశుద్ధితో తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులుగా ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. తల్లిదండ్రుల క్రమశిక్షణతో పెరిగిన వారి కుమారులు అఖిల్, అంకిత్ గ్రూపు 1, సివిల్ సర్వీసెస్ సాధించి ఉన్నత స్థాయికి చేరటం సిద్దిపేటకు గర్వకారణమన్నారు. అనంతరం వజ్రమ్మ, భగవాన్‌రెడి దంపతులను మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత నందిని సిధారెడ్డి, టియుడబ్ల్యుజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహాత్ అలీ, దేవిప్రసాద్, పాపయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



## తమ్ముడిని నరికి చంపిన అన్న

**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** భూవివాదం కారణంగా అన్న చేతిలో తమ్ముడు దారుణ హత్యకు గురైన సంఘటన బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం, చంద్రవెల్లి గ్రామానికి చెందిన సందనవేణి రాజేష్ (28)పై ఆయన అన్న చందు గొడ్డలితో దాడి చేయగా, తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. భూమి విషయంలో కుటుంబ సభ్యుల మధ్య గత కొంతకాలంగా వివాదం కొనసాగుతోందని, గతంలో గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించి జరిమానా విధించినప్పటికీ వివాదం సద్దుమణగకపోవడంతో ఈ దారుణం జరిగింది. హత్య సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం బెల్లంపల్లి ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## 'రెండు ఓట్ల'పై ఇసి కఠిన నిఘా

● సర్‌తో ఒకే ఓటు మిగిలే అవకాశం
● హైదరాబాద్‌లోని ఎపి ఓటర్లను తొలగించే అవకాశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌తో పాటు తెలంగాణలో స్థిరపడిన లక్షలాది మంది ఆంధ్రప్రదేశ్ మూలాలున్న ఓటర్లకు కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ కీలకంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలంగాణలో ఒక ఓటు, స్వస్థలమైన ఆంధ్రప్రదేశ్‌లో మరో ఓటు కలిగి ఉన్న వారి వివరాలను గుర్తించి, చట్టబద్ధంగా ఒకే చోట ఓటు ఉండేలా చర్యలు తీసుకునే అవకాశం ఉందన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివసిస్తూ ఇక్కడే ఓటు హక్కు వినియోగించుకుంటున్న అనేక మంది తమ స్వగ్రామాలైన విజయవాడ, అమలాపురం, తిరుపతి తదితర ప్రాంతాల్లో కూడా ఓటర్లుగా నమోదై ఉన్నారని చెబుతున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను కచ్చితంగా అమలు చేస్తే ఈ డ్యూయల్ ఓట్లు గుర్తించి ఒక చోట ఓటు తొలగించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో ఆంధ్ర మూలాలున్న ఓటర్ల ముందుకు రెండు ఎంపికలు రానున్నాయి. హైదరాబాద్‌లోనే శాశ్వతంగా ఉంటూ ఇక్కడే ఓటు కొనసాగించాలంటే ఏపీలోని స్వగ్రామ ఓటును తొలగించుకోవాల్సి ఉంటుంది. మరోవైపు స్వగ్రామంలోనే ఓటు ఉంచుకోవాలనుకుంటే హైదరాబాద్‌లోని ఓటును వదులుకోవాల్సి వస్తుంది. హైదరాబాద్‌లోని ఆంధ్ర ఓటు బ్యాంకుపై తెలంగాణలోని ప్రధాన రాజకీయ పార్టీలు దృష్టి పెట్టగా, ఎపిలో కూడా ఈ ఓటర్లు పలు నియోజకవర్గాల్లో కీలక ప్రభావం చూపుతున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. గతంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఎన్నికలు వేర్వేరు సంవత్సరాల్లో జరగడంతో చాలా మంది రెండు రాష్ట్రాల్లోనూ ఓటు హక్కు వినియోగించుకున్నారనే వాదనలు ఉన్నా యి. ఇక ఎస్ఐఆర్ ప్రక్రియలో చనిపోయిన వారి పేర్లు, నివాసం మారిన వారి ఓట్లు, రెండు చోట్ల నమోదైన డ్యూయల్ ఓట్లను తొలగించడంపై ఎన్నికల సంఘం దృష్టి సారించినట్లు సమాచారం. ఫారమ్‌లలో ఆధార్ నంబర్‌ను కూడా సేకరిస్తుండటంతో ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు ఉన్నట్లయితే సులభంగా గుర్తించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఒక వ్యక్తి ఉద్దేశపూర్వకంగా రెండు చోట్లా ఓటు కొనసాగిస్తే ఎన్నికల చట్టాల ప్రకారం చర్యలు ఎదుర్కోవాల్సి రావచ్చని హెచ్చరికలు వినిపిస్తున్నాయి.

## 'సర్' ఫారం నింపడం సులభమే..

● రాష్ట్రంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ
● ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న బిఎల్‌ఓలు
● 2002 ఓటర్ల జాబితా ఆధారంగా ప్రస్తుత ఓటర్ల వివరాల ధృవీకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ఈ ఏడాది చివర్లో విడుదల చేయనున్న తుది ఓటర్ల జాబితాను మరింత కచ్చితత్వంతో రూపొందించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టింది. ఇందులో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బిఎల్‌ఓలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా పరిశీలిస్తున్నారు. ఎస్ఐఆర్ సర్వేలో భాగంగా ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి బిఎల్‌ఓలకు అందజేయాల్సి ఉంటుంది. 2002లో ఓటు హక్కు కలిగిన వారు అప్పటి ఓటర్ల జాబితాలో తమ పేరు ఎక్కడ నమోదై ఉందో వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. తెలియని వారు బిఎల్‌ఓల వద్ద ఉన్న పాత జాబితా ద్వారా లేదా ఎన్నికల సంఘం సిటిజన్ సర్వీస్ పోర్టల్లో స్వయంగా పరిశీలించుకోవచ్చు.

**2002 ఓటర్ల జాబితాలో పేరు ఇలా చెక్ చేసుకోండి**

ముందుగా ఎన్నికల సంఘం సిటిజన్ సర్వీస్ పోర్టల్‌ను సందర్శించాలి. అక్కడ 'సెర్చ్ యువర్ నెమ్ ఇన్ లిస్ట్ ఎస్ఐఆర్'ను ఎంపికను క్లిక్ చేసి, 'సెర్చ్ బై ఎలక్టోరల్ డిటైల్స్' ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అనంతరం రాష్ట్రం, జిల్లా, 2002 నాటి శాసన సభ నియోజకవర్గాన్ని ఎంపిక చేసి, ఓటరు పేరు, క్యాప్చా నమోదు చేసి సెర్చ్ చేయాలి. దీంతో సంబంధిత ఓటర్ల జాబితా ప్రదర్శించబడుతుంది. అందులో తమ పేరు, పార్ట్ నెంబర్, సీరియల్ నెంబర్, పోలింగ్ కేంద్రం వంటి వివరాలను తెలుసుకోవచ్చు.

**ఫారంలో ఏ వివరాలు నమోదు చేయాలి?**

2002 ఓటర్ల జాబితాలో లభించిన వివరాల ఆధారంగా ఓటరు పేరు, తండ్రి లేదా భర్త పేరు, బంధుత్వం, వయస్సు, జిల్లా, నియోజకవర్గం, పోలింగ్ కేంద్రం, పార్ట్ నెంబర్, సీరియల్ నెంబర్ వంటి వివరాలను ఎన్యూమరేషన్ ఫారంలో నమోదు చేయాలి. బిఎల్‌ఓలు ఇచ్చే ఫారంలో ఇప్పటికే ఓటరు పేరు, చిరునామా, ఎపిక్ నెంబర్, నియోజకవర్గం, పాత ఫొటో, క్యూఆర్ కోడ్ వంటి వివరాలు ముద్రించి ఉంటాయి. పాత ఫొటో పక్కన తాజా పాస్‌పోర్ట్ సైజు ఫొటోను అతికించాలి. మొదటి కాలమ్‌లో 2002 ఓటర్ల జాబితాలో ఉన్న వివరాలను నమోదు చేయాలి. రెండో కాలమ్‌లో 2002 జాబితాలో ఉన్న ఓటరుతో తనకు ఉన్న బంధాన్ని రాయాలి. అనంతరం జన్మ తేదీ, ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్, తల్లి, తండ్రి, జీవిత భాగస్వామి పేర్లు, వారి ఎపిక్ నెంబర్లు తెలిసి ఉంటే నమోదు చేయాలి. ఎన్యూమరేషన్ ఫారాన్ని రెండు ప్రతులుగా నింపాలి. ఒక ప్రతిని బిఎల్‌ఓకు అందజేయగా, మరో ప్రతిని రసీదుగా తమ వద్ద భద్రపరచుకోవాలని ఎన్నికల అధికారులు సూచించారు. దీంతో భవిష్యత్తులో అవసరమైనప్పుడు దానిని ఆధారంగా ఉపయోగించుకోవచ్చు అని చెప్పారు.



## దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ.. భాగస్వాములు కావాలి

● కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వానికి ప్రజలు అండగా నిలవాలని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. సికింద్రాబాద్‌లోని వైభవ్ ఫంక్షన్ హాల్లో బిజెపి కార్యకర్తలతో కలిసి ప్రధాని 135వ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని వీక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. 'మన్ కీ బాత్' ప్రజా చైతన్యానికి ప్రభావవంతమైన వేదికగా నిలిచిందని, పర్యావరణం, సంస్కృతి, క్రీడలు, యువత సాధనలు వంటి అంశాలపై ప్రధాని నరేంద్ర మోదీ సందేశాలు దేశ ప్రజలకు స్ఫూర్తినిస్తున్నాయన్నారు. బంగారం వినియోగంలో మితవాదం పాటించాలని ప్రధాని చేసిన పిలుపు తర్వాత కొనుగోళ్లు తగ్గడం ప్రజల విశ్వాసానికి నిదర్శనమని తెలిపారు. కరోనా, అంతర్జాతీయ సంక్షోభాల సమయంలో మోదీ తీసుకున్న నిర్ణయాలు దేశ ప్రయోజనాలను కాపాడాయని, యుద్ధాల కంటే చర్చలు, దౌత్యమే శాశ్వత పరిష్కారమన్నారు. ప్రతి నెల చివరి ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని వీక్షించి, దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రజలకు కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మేకల సారంగపాణి, భారత్ గౌడ్ పాల్గొన్నారు.

## బకాయిలు వెంటనే విడుదల చేయాలి

● ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసి కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. వేతన సవరణ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, ఎస్‌బిటి, ఎస్‌ఆర్‌బిఎస్, గ్రాట్యుటీ, పిఎఫ్‌కు సంబంధించిన బకాయిలు కలిపి మొత్తం రూ.7 వేల కోట్లు కార్మికులకు చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఈ బకాయిలపై సంవత్సరానికి 8 శాతం వడ్డీ చొప్పున ఏడేళ్లకు సుమారు రూ.560 కోట్లు వడ్డీ భారం ఏర్పడిందన్నారు. అలాగే 2021లో ఉద్యోగులకు వర్తింపజేసిన 11 శాతం ఫిట్‌మెంట్ ప్రకారం వేతన సవరణపై సుమారు రూ.450 కోట్ల బకాయిలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. కార్మికులు ఎంతో నష్టపోయారని, ప్రభుత్వం ఇక ఆలస్యం చేయకుండా అన్ని బకాయిలను తక్షణమే విడుదల చేసి కార్మికులకు న్యాయం చేయాలని ఎం.నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

## పివి ఉన్నత వ్యక్తిత్వం, దేశ ఆర్థిక భద్రత, నిబద్ధతకు ప్రతీక

సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు 105వ జయంతి సందర్భంగా సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కె.నారాయణ మాట్లాడుతూ, పివి తెలుగు ప్రజలతో పాటు దేశ ప్రజలందరికీ సుపరిచితమైన నాయకుడని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో భూ సంస్కరణలను అమలు చేయడంతో రాజకీయంగా తీవ్ర చర్చలకు దారితీసిందని గుర్తు చేశారు. ఆ సమయంలో తాను గుంటూరులో విద్యార్థిగా సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొన్నానని తెలిపారు. పివి ప్రధానమంత్రిగా, మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా దేశాన్ని ముందుకు నడిపించారని కొనియాడారు. దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశను చూపడంలో వారి నాయకత్వం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ప్రపంచీకరణ, సరళీకరణ, ఆర్థిక సంస్కరణలను అప్పట్లో కమ్యూనిస్టు పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయని, తాము కూడా అదే వైఖరిని అవలంబించామని చెప్పారు. అయితే కాలక్రమేణా ఆ సంస్కరణల ప్రభావాన్ని పరిశీలించినప్పుడు, వాటిలో ఏవి ప్రయోజనకరమైనవి, ఏవి ప్రతికూలమైనవో మరింత లోతుగా విశ్లేషించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత దేశ రాజకీయ పరిస్థితుల్లో పివి ఉన్నత వ్యక్తిత్వం, దేశ ఆర్థిక భద్రత పట్ల ఆయన నిబద్ధత మరింత స్పష్టంగా గుర్తుకు వస్తోందని అన్నారు. గతంలో తీసుకున్న నిర్ణయాలను సమీక్షించుకోవడంతో పాటు ప్రస్తుత పరిస్థితులను కూడా గమనించాలని సూచించారు. కేంద్ర ప్రభు త్వ విధానాలపై ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం సాగించాల్సిన అవసరం ఉందని ప్రజలకు పిలుపునిచ్చారు.

## నితిన్ నబిన్‌కు కిషన్‌రెడ్డి స్వాగతం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శంషాబాద్ విమానాశ్రయంలో బిజెపి జాతీయ అధ్యక్షుడు నితీన్ నబిన్‌కు స్వాగతం పలికిన కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు, ఎంపిలు డి.కె.అరుణ, ధర్మపురి అరవింద్, బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



# అన్నదాతకు ప్రభుత్వం కొండంత అండ

### రైతు ఆశీర్వాద సభను జయప్రదం చేయండి
### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఈనెల 30న జరగనున్న రైతు ఆశీర్వాద సభను జయప్రదం చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఆదివారం శాసన సభ్యులతో కలిసి చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేయనున్న సభా ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సాహసోపేత నిర్ణయాలతో అన్నదాతలకు కొండంత అండగా నిలుస్తుందన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రభుత్వం ఆశీర్వాద సభకు ఎటువంటి ఆటంకాలు కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టిందన్నారు. ఈనెల 30న వానాకాలం రైతు భరోసా అందించేందుకు ఈ సభను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రైతుల ఖాతాల్లో రైతు భరోసా జమ చేసి మరోసారి ఈ ప్రభుత్వం నిబద్ధతను చాటుకోనుందన్నారు. చరిత్రలో నిలిచిపోయేవిధంగా ఈ సభ జరగనుందన్నారు. ఇందిరమ్మ రాజ్యం లక్ష్యాలతో ప్రభుత్వం పేదలు, మహిళలు, రైతులు, యువత సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. మంత్రి తుమ్మల రైతు ఆశీర్వాద సభ పేరుతో ఈనెల 30న నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో బహిరంగ సభకు హాజరయ్యే రైతులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి. గోపి, కలెక్టర్ దివాకర టిఎస్, కమిషనర్ సునీల్ దత్‌లతో కలిసి సభా స్థలిని పరిశీలించారు. పార్కింగ్ సదుపాయాలు, వాహనాల రాకపోకలు, సభా ప్రాంగణంలోకి రైతుల ప్రవేశం, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. సాగులో ఉన్న భూములకు సంబంధించి వానాకాలం రూ.9వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేయనున్నామని ఆయన తెలిపారు. శాసన సభ్యులు మట్టా రాగమయి, రాందాస్ నాయక్, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, ఆదినారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## భారీ వర్షం
### ఆశీర్వాద సభ నిర్వహణపై సందిగ్ధత

చింతకానిలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీనితో ఈ నెల 30న జరగనున్న రైతు ఆశీర్వాద సభ నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. ఈనెల 30న రైతు భరోసా నిధులు విడుదల చేయడంతో పాటు వ్యవసాయ రంగ పథకాలు తదితర విషయాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో సభను నిర్వహించాలని తలపెట్టారు. ఇందు కొరకు గడిచిన వారం రోజులుగా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 120 ఎకరాల్లో సభా కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. ముమ్మరంగా పనులు జరుగుతున్న నేపథ్యంలో భారీ వర్షం రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. గాలి వానకు కొన్ని గుడారాలు నేలవాలాయి. వాతావరణ శాఖ భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిస్తున్న నేపథ్యంలో సభ నిర్వహణ కష్టమేనన్న భావన క్షేత్ర స్థాయిలో వినపడుతుంది. మల్లు భట్టి విక్రమార్క సోమవారం సభా స్థలిని పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం.

## సిపిఐ నేత వెంకయ్యకు నివాళి



**ప్రజాపక్షం/ చింతకాని :** మండల పరిధిలోని బస్వాపురం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు ఆవుల వెంకయ్య మృతిపట్ల పలువురు నివాళులర్పించారు. ఆదివారం ఆవుల వెంకయ్య దశ దిన కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు తదితరులు హాజరై వెంకయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ అభివృద్ధి కోసం వెంకయ్య చేసిన సేవలను కొనియాడారు. వారి కుటుంబానికి పార్టీ ఎల్లవేళల అండగా ఉంటుందని తెలిపారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లికార్జున్, కూచిపూడి రవి, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు రాసాల మోహన్‌రావు, సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శి శ్రీను, రైతు సంఘం మండల కార్యదర్శి దొబ్బల వెంగళరావు, సర్పంచ్ ఆవుల నర్సింహారావు, ఉప సర్పంచ్ చంద్రకాని నర్సింహారావు, నాయకులు కొండలరావు, మోహన్‌రావు, పలువురు నాయకులు పాల్గొని వెంకయ్యకు నివాళులర్పించారు.

## పోరాటాలతోనే సమస్యల పరిష్కారం
### సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా




**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లుతున్నాయని దీనితో గిరిజనులు నష్టపోతున్నారని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా తెలిపారు. బడ్జెట్‌లో కేటాయింపులు జరుగుతున్నా.. అవి ఖర్చు కావడం లేదని అంకెలు గణం అమలు శూన్యం అన్న చందంగా తయారైందన్నారు. తెలంగాణ గిరిజన సమాఖ్య విస్తృత స్థాయి సమావేశం ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో బానోత్ రాంబాబు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మౌలానా మాట్లాడుతూ ప్రతి ఏడాది కోట్లాది రూపాయలు గిరిజనుల పేరుతో కేటాయింపులు జరుగుతున్నా నిధులు పక్కదారి పడుతుండడంతో గిరిజన ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. గతంలో పోడు భూములకు సంబంధించి సాగులో ఉన్న ప్రతి ఎకరాకు పట్టా అందజేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందని కానీ దశాబ్దాలుగా సాగు చేసిన భూములను సైతం గిరిజనుల వద్ద నుంచి లాక్కుంటున్నారని మౌలానా ఆరోపించారు. గిరజనులను అటవీ, రెవెన్యూ శాఖలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ప్రస్తుత కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు సాగులో ఉన్న ప్రతి ఎకరాకు పట్టా అందజేయాలని లేని పక్షంలో గిరిజనులను సమీకరించి పోరాటాలకు సిద్ధం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులుగా బానోత్ రాంబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి, జిల్లా కార్యదర్శి బానోత్ జగన్, బానోత్ రామ్మూర్తి, పాల్తియా శ్రీనివాస్, వీరునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పోలియో చుక్కలు తప్పనిసరి
### కలెక్టర్ అంకిత్



**ప్రజాపక్షం/పాల్వంచ :** ఐదేండ్లలోపు ప్రతీ చిన్నారికి తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఇందిరానగర్ కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు.అనంతరం పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించకుండా మిగిలిపోకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించటానికి జిల్లావ్యాప్తంగా తగిన ఏర్పాట్లు చేశామని చెప్పారు. మొదటి రోజు పోలియో చుక్కలు వేయించుకోలేక పోయిన చిన్నారులకు 29, 30 తేదీలలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నారని తెలిపారు. ప్రయాణం చేస్తున్న వారు తమ పిల్లలకు బస్టాండ్‌లలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పోలియో నిర్మూలనలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని, ఐదేండ్ల లోపు చిన్నారులందరికి తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి తుకారాం రాథోడ్, అధికారులు, వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కక్షసాధింపు చర్యలు ఆపాలి
### పివైఎల్ రాష్ట్ర నాయకుడు మోతీలాల్



**ప్రజాపక్షం/ఇల్లందు:** సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని పోస్ట్ మెట్రిక్ హాస్టల్ వర్కర్లపై కక్షసాధింపు చర్యలు నిలిపివేసి, 16 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని పివైఎల్ రాష్ట్ర నాయకుడు మోతీలాల్ డిమాండ్ చేశారు. ఇల్లందులోని పివైఎల్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేతనాల సమస్యను గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినందుకు సాంఘిక సంక్షేమ శాఖ డిడి శ్రీలత ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని నోటీసులు ఇవ్వకుండా తొలగింపులు, బలవంతపు బదిలీలు చేస్తున్నారని ఆరోపించారు. మహిళా ఉద్యోగులను పురుషుల హాస్టళ్లకు, పురుషులను మహిళా హాస్టళ్లకు రిలీవింగ్ లేకుండా బదిలీ చేయడం, వాచ్‌మెన్, స్వీపర్, వంట సిబ్బందికి విధులకు సంబంధం లేని పనులు అప్పగిస్తూ బెదింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని డిడి శ్రీలతపై విచారణ జరిపి, హాస్టల్ వర్కర్లకు న్యాయం చేయాలని కోరారు.

## పోలియో రహిత సమాజం కోసం కృషి
### ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పోలియో రహిత సమాజ కోసం ప్రతి ఒక్కరం కృషి చేద్దామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు.ఆదివారం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ ఎండి రెహనా కమల్ పాషాతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయం గా చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికీ క్రమం తప్పకుండా పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు ఎంతో అవసరమని, తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, చల్లగుళ్ల కృష్ణయ్య, పింగళి సామెలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ సురేష్ నాయక్,మున్సిపల్ కమిషనర్ కె. నరసింహ, వైద్యులు, సిబ్బంది, ఆశా వర్కర్లు, ప్రజలు, చిన్నారులు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో చిన్నారుల జీవితానికి సంజీవిని
### సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** చిన్నారులనిండు జీవితానికి సంజీవిని లాంటి రెండు పోలియో చుక్కలు వేయించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా 31వ వార్డులోని సబ్‌సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని చిన్నారులకు చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దేశం పోలియో నిర్మూలనలో గొప్ప విజయాన్ని సాధించినప్పటికీ అప్రమత్తతను కొనసాగించడం అవసరమన్నారు. ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు తీసుకోకుండా మిగిలిపోకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రభు త్వం చేపడుతున్న ప్రజారోగ్య కార్యక్రమాలకు ప్ర జలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఏఓ శ్రీధర్‌రెడ్డి, 32వ వార్డు కౌన్సిలర్ మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, మున్సిపాలిటీ సిపిఎం కార్యదర్శి ఊరడి సుదర్శన్‌రెడ్డి, ఏఎన్ఎం అనురాధ, ఆశాలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# పిఎం శ్రీ నిధుల గోల్‌మాల్‌పై విచారణ



**ప్రజాపక్షం/పెనుబల్లి:** మండల పరిధిలోని అడివి మల్లెలలో గురుకుల పాఠశాలలో పిఎం శ్రీ నిధులు గోల్ మాల్ పై ఆరోపణలు రావడంతో గురుకుల పాఠశాలల జోనల్ అధికారిణి అపర్ణ విచారణ నిర్వహించారు. అంతకు ముందు ఈనెల 24వ తేదీన త్రిసభ్య కమిటీ విచారణ జరిపి వెళ్లారు. అనంతరం జోనల్ అధికారి సైతం ఉదయం 11 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు విచారణ నిర్వహించడం పలు అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. విచారణ అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నిధుల గోల్ మాల్ విషయంపై సమాధానం దాటవేసేందుకు ప్రయత్నించారు. దాంతో గురుకుల పాఠశాలలో జరుగుతున్న నిధుల వినియోగంపైన విధుల పట్ల కొందరు వ్యవహరిస్తున్న తీరుపట్ల జోనల్ అధికారిని విలేకరులు ప్రశ్నించడంతో ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగులు కొందరు అధికార పెత్తనం చెలాయించేందుకు ప్రయత్నిస్తున్నారని, మరికొందరు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని ఆమె తెలిపారు. అదే విధంగా కొన్ని విషయాలను నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆమె అన్నారు. నిధుల దుర్వినియోగంపై త్రిసభ్య కమిటీ విచారణ ఇంకా పూర్తి కాలేదని కొనసాగుతుందని ఆమె అన్నారు. విచారణ కొనసాగుతున్న సమయంలోనే జోనల్ అధికారి గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ ఛాంబర్ లో ఉండగానే శనివారం విద్యార్థినిలకు మెనూ ప్రకారం వడ్డించి, మాంసాహారాన్ని కొందరు సిబ్బంది బయటకు బాక్సుల ద్వారా క్యాన్ ల ద్వారా అక్రమంగా తరలిస్తున్న దృశ్యాలను విలేకరులు కెమెరాలో బంధించి జోనల్ అధికారిణి అపర్ణకు ప్రత్యక్ష సాక్ష్యం చూపించడంతో ఆమె నివ్వెర పోయారు. ప్రతి ఉద్యోగిని వ్యక్తిగతంగా విచారిస్తానని పాఠశాల విద్యార్థులను పదవ తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులను పాఠశాల నిర్వహణపైన, నిధుల ఖర్చులపైన విద్యార్థులకు అందాల్సిన సౌకర్యాలపైనా విచారణ నిర్వహిస్తామని ఆమె అన్నారు. కొన్ని విషయాల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు ఆమె అంగీకరించారు. పూర్తి స్థాయి విచారణ జరిగిన తరువాత తగు చర్యలు ఉంటాయని ఆమె వెల్లడించారు. పాఠశాలలో బోధించే ఉపాధ్యాయులు, లెక్చరర్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పని చేయాలని, ప్రతి విషయానికి నిబంధనలు ఉన్నాయని ఆమె అన్నారు. అడవి మల్లెల గురుకుల పాఠశాల లో పదవ తరగతి, ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతం తగ్గటం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ నియామకం జరిగేటప్పుడు ఉన్న నిబంధనలను పక్కనపెట్టి నిబంధనలకు విరుద్ధంగా వైస్ ప్రిన్సిపాల్ నియామకం జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని తగు చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

## పిచ్చికుక్క స్వైర విహారం
### ముగ్గురికి గాయాలు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** పిచ్చికుక్క దాడిలో ఓ చిన్నారి సహా ముగ్గురికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని కోయచలక, రేగులచలక గ్రామాల్లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఎస్‌సి కాలనీలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు పిచ్చికుక్క స్వైర విహారం చేస్తూ బీభత్సం సృష్టించింది. కనిపించిన వారిపై దాడి చేసింది. ఈ దాడిలో ముగ్గురికి గాయాలయ్యాయి. వారిలో స్థానిక ఆర్ఎంపి నారపోగు రాంబాబు ఆరేళ్ల కుమారుడు శశీంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారి ముఖంపై కుక్క దాడి చేయడంతో బుగ్గపై తీవ్ర గాయమైంది. కలకోట కృష్ణతో పాటు శుభకార్యానికి వచ్చిన ఓ వ్యక్తిని కూడా కుక్క కరిచింది. మనుషులతో పాటు పశువులు, కోళ్లపై కూడా పిచ్చి కుక్క దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. చిన్నారి శశీంద్రను ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి ప్లాస్టిక్ సర్జరీ చేయించినట్లు తండ్రి రాంబాబు తెలిపారు. కుక్కలను చూస్తేనే గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. వెంటనే వీధుల వెంబడి కుక్కలు తిరగకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రభుత్వ కళాశాలకు పెరుగుతున్న ఆదరణ



**ప్రజాపక్షం/కల్లూరు:** ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన విద్య, టిఫిన్, మధ్యాహ్న భోజనం, హాస్టల్ వసతి, క్రీడా మైదానం, ఉచిత పుస్తకాలు, ఉపకార వేతనం, ఏకరూప దుస్తులు, ఆన్లైన్ డిజిటల్ తరగతులు, ఉచిత బస్సు సౌకర్యం, పూర్తిస్థాయిలో అధ్యాపకులు రాష్ట్రస్థాయిలో 17 మందికి ఎంసెట్ ప్రవేశాలు సత్ఫలితాలను ఇచ్చిన అధ్యాపకుల ప్రచారం... కల్లూరు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అధ్యాపకులు ఇంటింటి ప్రచారం చేయడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ సంవత్సరం మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌లో 165 మంది చేరారు, కాగా గత సంవత్సరం 80 మంది మాత్రమే ఉన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు తో పాటు సంక్షేమ పథకాలను అమలుపరుస్తున్నామని ప్రచారం చేయటంతో ఈ సంవత్సరం అధికంగా విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ప్రైవేట్ కళాశాలలో ఫీజులు భారంతో తట్టుకోలేక పేద నిరుపేద, మధ్యతరగతి విద్యార్థినీ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కళాశాలకు వచ్చి విద్యార్థులను చేర్పిస్తున్నారు. ఇంకను పరిసర గ్రామాల ప్రజలు తమ విద్యార్థులను చేర్పించేందుకు ఆసక్తి చూపుతూ ఉన్నారు. కళాశాల ప్రారంభ దశలోనే అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రవేశం పొందారు. జులై నెలలో మధ్యాహ్న భోజనం, హాస్టల్ వసతిలు తదితర సంక్షేమ పథకాలు ప్రారంభమైతే కళాశాల నిండుతుందని ప్రిన్సిపల్ వేముల శేఖర్ పేర్కొన్నారు. నూతనంగా వచ్చిన కళాశాల ప్రిన్సిపాల్ ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులకు బోధన సౌకర్యాలతో పాటు తల్లిదండ్రులతో అవగాహన సదస్సులు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. అనేక పథకాలు అమలు కాబోతున్నాయని తెలుసుకొని తల్లిదండ్రులు విద్యార్థులను చేర్పించేందుకు ప్రత్యేకమైన ఆసక్తిని చూపిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను ప్రిన్సిపల్ వేముల శేఖర్ కోరుతున్నారు. ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు చదువుకొని, ఉత్తమ ఫలితాలు సాధనకు విద్యార్థులు కృషి చేయాలని ప్రిన్సిపాల్ కోరుతున్నారు.

## నెల్లిపాకలో క్షుద్ర పూజల కలకలం
### గోదావరి ఒడ్డున ఆనవాళ్లు
### భయాందోళనలో గ్రామస్తులు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలంనెల్లిపాక గ్రామ సమీపంలోని గోదావరి ఒడ్డున అనుమానాస్పద పూజలకు సంబంధించిన ఆనవాళ్లు కనిపించడంతో గ్రామంలో కలకలం రేగింది. ఆదివారం ఉదయం గోదావరి ఒడ్డుకు వెళ్లిన గ్రామస్తులు ఇసుకలో ఒక వృత్తాకర గుండం, దాని చుట్టూ మేకులు, నిమ్మకాయలు, పసుపు, కుంకుమతో పాటు జంతువుల అవశేషా లు కనిపించాయని తెలిపారు. గ్రామస్తుల కథనం ప్రకారం నిన్న అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు నిర్వహించి వెళ్లి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఘటనా స్థలంలో నాలుగు కోళ్ల అవశేషాలు, ఒక మేక అవశేషాలు కనిపించాయని వారు పేర్కొన్నారు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం తెలిపిన వెంటనే నెల్లిపాక గ్రామ సర్పంచ్ మంద్రు రామకృష్ణ గ్రామ ప్రజలతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇలాంటి ఘటన తమ గ్రామంలో ఇదే తొలిసారి జరుగుతుండడం ఆందోళన కలిగిస్తోందని ఆయన తెలిపారు. గ్రామంలో మూఢనమ్మకాలు, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి, దీనికి బాధ్యులెవరో గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే గ్రామాల్లో మూఢనమ్మకాల పేరుతో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# మన బొగ్గు మనకు దక్కేనా?

### రూ.50 వేల కోట్ల అప్పున్న జెన్‌కో వెర్సెస్ 135 ఏళ్ల సింగరేణి
### మణుగూరు ఓసీ - 2 డీప్‌సైడ్ బొగ్గుపై రాజకీయ రణం





**ప్రజాపక్షం/మణుగూరు:** ఉట్టికి ఎగరలేనమ్మ స్వర్గానికి ఎగురుతానన్నట్లు రూ.50 వేల కోట్ల బాకీ ఉన్న తెలంగాణ జెన్‌కో, 135 సంవత్సరాల అపార అనుభవం ఉన్న సింగరేణితో బొగ్గు వేలం పాటలో ఎందుకు పోటీ పడుతోంది? దీని వెనుక ఉన్న అదృశ్య రాజకీయ శక్తులు ఎవరు? అనే ప్రశ్నలు ఇప్పుడు మణుగూరులో హాట్ టాపిక్. మణుగూరు మణిహారం ఓసీ 2 డీప్‌సైడ్ విలువ మణుగూరు ఓసీ 2 డీప్‌సైడ్ బొగ్గు గనులు ప్రస్తుత సింగరేణి బొగ్గు ప్రాంతాల కంటే ఎక్కువ విలువైనవిగా గుర్తింపు పొందాయి. దీనికి తోడు సెంట్రల్ రిజర్వ్‌డ్ ఫారెస్ట్ ఆధీనంలో వందల వేల ఎకరాల్లో 20 సంవత్సరాలకు పైబడి తరగని బొగ్గు నిల్వలు ఉన్నాయి. సింగరేణి అనే సిరుల తల్లికి మణుగూరు మలిదశ బొగ్గు నిల్వలు మణిహారం లాంటివి. ఈ సంపదను సింగరేణి సొంతం చేసుకుంటేనే మణుగూరు పూర్వ వైభవం మళ్లీ బంగారు అక్షరాలతో వెలగనుంది. సింగరేణికే వేల కోట్లు బాకీ ఉన్న జెన్‌కో, బొగ్గు గనుల వేలంలో పోటీకి ఎందుకు దిగుతోంది? గనుల తవ్వకంలో 135 ఏళ్ల అనుభవం ఉన్న సింగరేణిని వదిలి, జెన్‌కోకు ఈ ఆత్రుత ఎందుకు? ఈ వేలం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయి? ఏ రాజకీయ శక్తులు తెరవెనుక నడుపుతున్నాయి? ఈ అంశంపై సర్వత్రా రాజకీయ చర్చ, ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. మన బొగ్గు మనకు దక్కాలి. మణుగూరు ఓసీ2 డీప్‌సైడ్ బొగ్గు పాట సింగరేణికే దక్కాలి. అప్పుడే స్థానిక కార్మికులకు ఉపాధి, ప్రాంత అభివృద్ధి, మణుగూరు మళ్లీ వెలుగుతుంది. ఈ విషయంలో ప్రభుత్వంపై ప్రజా ప్రతినిధులు విశ్వప్రయత్నాలు చేయడం శుభపరిణామం. మణుగూరు భవిష్యత్తు ఈ బొగ్గు గనుల పైనే ఆధారపడి ఉంది. అప్పుల కుప్ప జెన్‌కోకా? లేక అనుభవజ్ఞురాలైన సింగరేణికా? మణుగూరు ప్రజలు కళ్లల్లో ఆశతో చూస్తున్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి
### ఆరోగ్య, కుటుంబసంక్షేమ శాఖ కమిషనర్ బ్రహ్మోనందరావు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** అత్యవసర పరిస్థితుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ బ్రహ్మోనందరావు అన్నారు. మండల కేంద్రం కొణిజర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. 108 వాహనాన్ని, వాహనంలోని పరికరాలు, ఉద్యోగుల పనితీరుపరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వైద్యసేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది అందుబాటులో ఉండి రోగులపట్ల నిర్లక్ష్యం వహించకుండా వైద్యసేవలు అందించాలని పేర్కొన్నారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఈకార్యక్రమంలో 108 ప్రోగ్రామ్ మేనేజర్ నజీరుద్దీన్, టెక్నీషియన్స్ కొమ్ము వెంకటేష్, పైలెట్ రామారావు పాల్గొన్నారు.

## చిరుత పులి సంచారంతో ప్రజల భయాందోళనలు



ప్రజాపక్షం/నర్సంపేట: నర్సంపేట డివిజన్‌లోని ఖానాపురం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఆదివారం ఉదయం నుంచి చిరుత పులి సంచరిస్తున్న వార్త దహనంలా వ్యాపించింది. చిరుతపులి మండల కేంద్రంలోని రాగంపేటకు వెళ్లే రహదారి విజయలక్ష్మి రైస్ మిల్లు వద్ద నుండి వెళ్తున్న క్రమంలో రైస్ మిల్లు వద్ద ఉన్న సిసి కెమెరాలలో చిరుత పులి రోడ్డు క్రాస్ చేస్తున్న దృశ్యాలు రికార్డు అయ్యాయి. దీంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ విషయం తెలుసుకొని గ్రామ సర్పంచ్ దాసరి రమేష్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వెంకన్న, నాగరాజు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని గ్రామ సర్పంచ్, ఫారెస్ట్ అధికారులు యువకులు చిరుత పులి వెళ్లిన పాద ముద్రలను పరిశీలించారు. ఈసందర్భంగా ఫారెస్ట్ బీట్ అధికారి మాట్లాడుతూ చిరుత పులి మండల కేంద్రం శివారులో సంచరిస్తున్న మాట వాస్తవమని, మండల కేంద్రం శివారు నుండి శ్రీనివాస పారా బాయిల్డ్ రైస్ మిల్ నుండి మనుబోతులగడ్డ శివారు నుండి బుధరావుపేట శివారు, ధర్మరావుపేట, బాల్ తండాకు వెళ్లినట్లు అనవాల్లు ఉన్నట్లు ఫారెస్ట్ అధికారి తెలిపారు. మండల ప్రజలతో పాటు ముఖ్యంగా అటవీ ప్రాంతం పక్కన ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ అధికారి ప్రజలకు తెలిపారు.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, కలెక్టర్లు సత్యశారద,చాహత్ బాజ్‌పాయ్




ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : 2030 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారత కోసం విస్తృత కార్యక్రమాలు అమలు చేస్తోందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు.ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా వరంగల్ మహానగర పాలక సంస్థ, మేప్మా సంయుక్త ఆధ్వర్యంలో గీసుగొండ మండలం కొనయమాకుల గ్రామంలోని పీడీఆర్ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్, జిడబ్ల్యుఎంసి ప్రత్యేక అధికారి చాహాత్ బాజ్ పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలిసి ఎమ్మెల్యే పరకాల నియోజకవర్గం జిడబ్ల్యుఎంసి పరిధిలోని 15, 16, 17వ డివిజన్ల మహిళా సంఘాల సభ్యులకు చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహిళలు వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో మరింతగా రాణించేలా ప్రోత్సాహం అందిస్తున్నామని, పరకాల మహిళా డెయిరీ ద్వారా మహిళలకు శాశ్వత ఆదాయ వనరులు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. త్వరలోనే డెయిరీ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని, మహిళా సంఘాల కోసం ప్రత్యేక సమాఖ్య భవనం నిర్మాణానికి స్థల సేకరణతో పాటు అవసరమైన చర్యలు చేపడతామని వెల్లడించారు.మహిళల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం, వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణ మాఫీ, రైతు భరోసా వంటి పథకాల ద్వారా వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.యువతులకు ఉపాధి అవకాశాలు విస్తరించేందుకు టెక్స్టైల్ రంగంలో నైపుణ్య శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేశామని, 18 నుంచి 35 సంవత్సరాల మహిళలకు శిక్షణ అందించి ప్రస్తుతం 600 మందికి ఉపాధి కల్పించగా, మరో 1,400 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు.భవిష్యత్తులో సుమారు 2,800 మంది మహిళలకు ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.విద్యారంగంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య, యూనిఫారాలు, పౌష్టికాహారం, అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు. ఇటీవల పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధించిన అత్యుత్తమ ఫలితాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థ నాణ్యతకు నిదర్శనమని అన్నారు. సమాజంలోని ప్రతి వర్గం సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఒంటరి మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలుస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి తెలిపారు.జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహాత్ బాజ్ పాయి మాట్లాడుతూ, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2.38 లక్షల మంది అర్హులైన మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పారదర్శకంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హురాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని కోరారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ రూపొందించిన ఇందిరా మహిళా శక్తి చీరలు మహిళల పట్ల ప్రభుత్వం చూపుతున్న గౌరవానికి ప్రతీక అని అన్నారు. ప్రతి అర్హ మహిళకు నాణ్యమైన చీర అందేలా పారదర్శకంగా పంపిణీ చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా, సామాజికంగా మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజేశ్వర్, ఉప కమిషనర్ సమ్మయ్య, మెప్మా డీఆర్ఎం రేణుక, టీఎంసీ రమేష్, మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే దొంతి



ప్రజాపక్షం/నెక్కొండ: నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి అన్నారు. ఆదివారం నెక్కొండ మండలంలోని పలు గ్రామాల్లో కోట్లాది రూపాయల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. ముందుగా వెంకట్ నాయక్ తండాలో నూతన గ్రామ పంచాయతీ భవనంతో పాటు మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం బంజరుపల్లి గ్రామంలో రూ.10లక్షల వ్యయంతో నిర్మించనున్న వీఓ భవనానికి శంకుస్థాపన చేసి రూ.15 లక్షలతో నిర్మించిన అంతర్గత సిసి రోడ్లను ప్రారంభించారు. తదుపరి నెక్కొండ మండల కేంద్రంలో రూ.12లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన చేసి, రూ.6.50లక్షలతో నిర్మించిన సిసి రోడ్డులను ప్రజలకు అంకితం చేశారు. అనంతరం చంద్రుగొండ గ్రామంలో రూ.25లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత సిసి రోడ్లను ప్రారంభించి గ్రామ ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి గ్రామంలో రహదారులు, తాగునీరు, విద్య, మహిళా సంక్షేమం వంటి రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిఅపరు. ఈ కార్యక్రమాల్లో టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ హరీష్‌రెడ్డి, నెక్కొండ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, కుసుమ చెన్నకేశవులు, శ్రీనివాస్, బండి శివకుమార్, కాంగ్రెస్ పార్టీ మీడియా ఇన్‌చార్జి రావుల తిరుపతి రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ప్రజాపక్షం/భూపాలపల్లి : రెండు పోలియో చుక్కలు మీ పిల్లల నిండు జీవితానికి ఎంతో దోహదపడతాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. పోలియో దినోత్సవ సందర్భంగా ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూర్ పిహెచ్‌సి, భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధి లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి చిన్నపిల్లలకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు తప్పకుండా పోలియో డ్రాప్స్ వేయించాలని సూచించారు. పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశాన్ని పోలియో రహితంగా కొనసాగించేందుకు ప్రతి తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పల్స్ పోలియో కార్యక్రమం ద్వారా చిన్నారులను పోలియో వ్యాధి బారిన పడకుండా కాపాడవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చల్ల మధుసూదన్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, వైద్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఐదేళ్ల లోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి: కలెక్టర్



ప్రజాపక్షం/జనగామ టౌన్ / జనగామ: ప్రతి ఐదేళ్ల లోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌లో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పల్స్‌పోలియో చుక్కల కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా 0 నుంచి 5 సంవత్సరాలలోపు చిన్నారులకు స్వయంగా కలెక్టర్ పోలియో చుక్కలు వేశారు. ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం అత్యంత అవసరమన్నారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్న ప్రతి కుటుంబం తమ చిన్నారులను సమీపంలోని పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఏ ఒక్క చిన్నారి కూడా ఈ కార్యక్రమానికి దూరం కాకుండా అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యకరమంలో డీఎంహెచ్‌వో మల్లిఖార్జున రావు, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

## పివి నర్సింహారావు జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే నాయిని నివాళి



ప్రజాపక్షం/హనుమకొండ: భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ పి.వి. నర్సింహారావు 105వ జయంతి సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదివారం ఘనంగా నివాళులు అర్పించారు.ముందుగా హనుమకొండ డీసీసీ భవన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి, పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం హనుమకొండ బస్ స్టాండ్ ఆవరణలోని పీవీ నర్సింహారావు విగ్రహానికి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులు సమర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావు,సీనియర్ జర్నలిస్టు పివి మదన్ మోహన్, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వం సూచించిన వరి రకాలను సాగు చేయాలి

ప్రజాపక్షం/తొర్రూరు : రాష్ట్ర ప్రభుత్వం సూచించిన వరి రకాలను సాగు చేసి ప్రయోజనం పొందాలని ఏడీఏ శ్రీదేవి తెలిపారు. డివిజన్ కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న విత్తన మేళాను ఏడీఏ సందర్శించారు. రైతులకు పలు రకాల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన వరి రకాలను మాత్రమే సాగు చేయాలన్నారు. వర్షాధారిత పరిస్థితులను బట్టి స్వల్పకాలిక లేదా మధ్యకాలిక పంటలను ఎంచుకోవాలన్నారు. ప్రభుత్వం ఎంపిక చేసిన ఏడు వరి రకాలను సాగు చేయాలని, వాటికే ప్రభుత్వం రూ.500బోనస్ అందిస్తుందని చెప్పారు. నీటి ఎద్దడి ఉన్నప్పుడు పప్పుధాన్యాలు సాగు చేయాలని సూచించారు. యూరియాను సిఫార్సు చేసిన మోతాదులో పలు దఫాలుగా వాడాలని రైతులను కోరారు. రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా బిల్లు, విత్తన ట్యాగ్‌లను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు, పెద్దవంగర మండలాల ఏఓలు రామనర్సయ్య, స్వామినాయక్, స్థానిక రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలకు నిలయంగా మారిన సంక్షేమ హాస్టళ్ళు

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సొతుకు ప్రవీణ్ కుమార్



ప్రజాపక్షం/భూపాలపల్లి: జిల్లాలో సంక్షేమ హాస్టల్ సమస్యలకు నిలయంగా మారాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సొతుకు ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రం లోని ఎస్సీ సంక్షేమ బాలుర హాస్టల్‌ను ఏఐఎస్ఎఫ్ జిల్లా బృందం సందర్శించి విద్యార్థుల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సొతుకు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్ల పట్ల పూర్తిగా నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని తీవ్రంగా విమర్శించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టల్ సమస్యల వలయంలో విలవిలలాడుతున్నాయని, పేద, దళిత, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదువుకునే హాస్టళ్లు సమస్యలకు నిలయాలుగా మారినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. మౌలిక సదుపాయాలు అధ్వాన్నంగా ఉన్నాయని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు పెంచడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. నోట్ పుస్తకాలు కూడా సకాలంలో అందించడం లేదని విమర్శించారు. ప్రభుత్వం అది చేస్తాం ఇది చేస్తామని ప్రకటనలకే పరిమితం కాకుండా సంక్షేమ హాస్టళ్లను తక్షణమే అభివృద్ధి చేయాలని కోరారు. విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాలను కల్పించాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేణిగుంట్ల ప్రవీణ్, జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్, ఉల్లేరావు బన్నీ, రాజుల శివ, అభిరామ్, పవన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రానిక్ డిటోనేటర్ల వినియోగాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలి

గనుల్లో ప్రమాదాల నివారణకు చర్యలను చేపట్టాలి

ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ మోట పలుకుల రమేష్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ ఆసిఫ్ పాషా




ప్రజాపక్షం/భూపాలపల్లి : సింగరేణి గనుల్లో ఎలక్ట్రానిక్ డిటోనేటర్ల వినియోగం కారణంగా పలు నియర్‌మిస్ సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని తాత్కాలికంగా డిటోనేటర్ల ను నిలిపివేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల రమేష్, అసిస్టెంట్ బ్రాంచి కార్యదర్శి అసిఫ్ పాషా డిమాండ్ చేశారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని ఏఐటీయూసీ కొమురయ్య భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఈ డిటోనేటర్లతో మైనింగ్ సిబ్బంది, ముఖ్యంగా షార్ట్ ఫైరర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. అండర్ గ్రౌండ్‌లో తడి ప్రదేశాల్లో బ్లాస్టింగ్ ఆపరేషన్లు ఆలస్యమవుతున్నాయని, అలాగే ఎలక్ట్రానిక్ డిటోనేటర్లలో డిజిటల్ సందేశాలు కొన్నిసార్లు తప్పుగా ప్రదర్శించబడుతున్నాయని వారు పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో బ్లాస్టింగ్ జరగకపోయినా జరిగినట్లు సందేశం చూపించడం, మరికొన్ని సందర్భాల్లో ఆలస్యంగా అనూహ్యంగా పేలడం వంటి సంఘటనలపై షార్ట్ ఫైరర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ సమస్యలపై స్పష్టత కోసం సంబంధిత కంపెనీల సర్వీసింగ్ ఇంజనీర్లను యాజమాన్యం పిలిపించి చర్చించినప్పటికీ, షార్ట్ ఫైరర్లు లేవనెత్తిన సందేహాలకు సంతృప్తికరమైన సమాధానాలు లభించలేదని మైనింగ్ సిబ్బంది పేర్కొంటున్నట్లు చెప్పారు. అందువల్ల ఎలక్ట్రానిక్ డిటోనేటర్ల పనితీరు, భద్రతపై పూర్తి అవగాహన ఏర్పడి, కార్మికుల సందేహాలు నివృత్తి అయ్యే వరకు సింగరేణిలో వాటి వినియోగాన్ని తాత్కాలికంగా నిలిపివేసి, ప్రస్తుతం ఎలక్ట్రిక్ డిటోనేటర్లనే ఉపయోగించాలని సింగరేణి యాజమాన్యాన్ని గుర్తింపు సంఘం డిమాండ్ చేసింది. ఈ నెల 15 న కెటికె 5వ గనిలో జరిగిన జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన షార్ట్ ఫైరర్ శ్రీరాముల ప్రదీప్ కు సింగరేణి యాజమాన్యం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి, అతని ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని సీనియర్ మైనింగ్ సర్దార్ ఉద్యోగంలో సరైన స్థానంలో కొనసాగించాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జి శ్రీనివాస్, బ్రాంచ్ కమిటీ నాయకులు తాళ్ల పోశం తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు వేయించాలి

జిల్లాలోని 84,301 మంది చిన్నారులకు పల్స్ పోలియో వ్యాక్సిన్ లక్ష్యం

ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



ప్రజాపక్షం/హనుమకొండ : పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, జననం నుంచి ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహాత్ బాజ్ పాయి పిలుపునిచ్చారు. జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి (మిషన్ ఆసుపత్రి)లో వారు సంయుక్తంగా ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే" మాట్లాడుతూ, నిండు ప్రాణానికి రెండు చుక్కలు అనే నినాదంతో జూన్ 28, 29, 30 తేదీల్లో నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజలంతా విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి మాట్లాడుతూ, జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల 84,301 మంది చిన్నారులకు పోలియో వ్యాక్సిన్ అందించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఇందుకోసం 460 పోలియో బూత్‌లు, 27 మొబైల్ బృందాలు, 12 ట్రాన్సిట్ బృందాలు, 27 పర్యవేక్షణ బృందాలు ఏర్పాటు చేయగా, కార్యక్రమ నిర్వహణకు 1,804 మంది సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. ఆదివారం గ్రామ పంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో చిన్నారులకు వ్యాక్సిన్ అందిస్తారని, అనంతరం జూన్ 29, 30 తేదీల్లో మొదటి రోజు వ్యాక్సిన్ తీసుకోలేని చిన్నారులను గుర్తించి ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ దుర్గారామ్ కుమార్, డాక్టర్ మహేందర్, సుభాష్, డాక్టర్ విజయలక్ష్మి, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే పోలీస్ శాఖ లక్ష్యం

ప్రజాపక్షం/భూపాలపల్లి : జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే పోలీస్ శాఖ లక్ష్యమని సీసీఎస్ సీఐ రమేష్ తెలిపారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు, సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో జిల్లా నార్కోటిక్స్ విభాగం లీసులు, నార్కోటిక్స్ జాగిలంతో కలిసి ఆదివారం భూపాలపల్లి బస్టాండ్, బాంబులగడ్డ ప్రాంతంతో పాటు గంజాయి సేవించే అవకాశం ఉన్న అనుమానిత ప్రాంతాల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించారు.ఈ సందర్భంగా సిసిఎస్ సీఐ రమేష్ మాట్లాడుతూ, భూపాలపల్లి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే పోలీస్ శాఖ లక్ష్యమని, మాదక ద్రవ్యాల వినియోగం, నిల్వ, అక్రమ రవాణాపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు కొనసాగుతాయని తెలిపారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించి ప్రజలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఎవరైనా గంజాయి సేవిస్తున్నట్లు, నిల్వ ఉంచినట్లు లేదా రవాణా చేస్తున్నట్లు సమాచారం ఉంటే 100 లేదా 8712658111 నంబర్‌కు తెలియజేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచడంతో పాటు, నింధితులపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సోదాల్లో నార్కోటిక్స్ విభాగం ఆర్ఎస్ఐ రాజేష్, సిబ్బంది శ్రీనివాస్, ప్రశాంత్, శ్రీనివాస్ డాగ్ హ్యాండ్లర్ శ్రీధర్ పాల్గొన్నారు.

## గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



ప్రజాపక్షం/భూపాలపల్లి : పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండలం చెల్పూర్ గ్రామంలో బోనగాని ప్రవీణ్ నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని నూతన గృహాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ప్రవీణ్ దంపతులను శాలువతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ పథకం కింద ఇల్లు అందజేస్తామని చెప్పారు. నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి నియోజకవర్గానికి 3500 ఇండ్లతో పాటు అదనంగా ఇండ్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. రెండో విడతలో సైతం ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులకు అందజేసే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. విడతల వారిగా అర్హులైన ప్రతి పేద వాడికి అందజేస్తామని వివరించారు. గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.

**సోలార్ ఎనర్జీ షాప్ ప్రారంభం**

భూపాలపల్లి మంజూరు నగర్ నగర్ లో అన్న బోయిన శంకర్ నూతనంగా ఏర్పాటు చేసిన సోలార్ ఎనర్జీ షాపును ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించినారు. అనంతరం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కాశీంపల్లిలో ముత్యాల శ్యామ్ నాన్న సంవత్సరికం కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికిపూలు చల్లి నివాళులు అర్పించినారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, స్థానిక ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియోకు ప్రజలందరి సహకారం అవసరం: చంద్రకళ

ప్రజాపక్షం/ములుగు: భారతదేశాన్ని పోలియో రహిత దేశంగా నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలని ములుగు మున్సిపల్ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ పిలుపునిచ్చారు. ఆదివారం ములుగు మున్సిపల్ కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. యువజన మహిళా, స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రజలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్‌రావు మాట్లాడుతూ జిల్లాలో ఐదేళ్లలోపు 22,572 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 312 బూత్‌లు, 15 మొబైల్ బృందాలు, 10 ట్రాన్సిట్ బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. సోమ, మంగళవారాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి మిస్సైన పిల్లలకు పోలియో చుక్కలు వేస్తామని చెప్పారు. ఉదయం 7నుండి సాయంత్రం 6గంటల వరకు బూత్‌లు పనిచేస్తాయని, జిల్లాలో గుర్తించిన 35 హైరిస్క్ ప్రాంతాల్లోనూ మొబైల్ బృందాల ద్వారా టీకాలు అందజేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సుధీర్, మున్సిపల్ చైర్మన్ ఆసియా, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగ అన్వేష్, జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ సంపత్‌రెడ్డి, మాస్ మీడియా అధికారి సంపత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దుర్గారావు, ఎంఎల్‌హెచ్‌పి డాక్టర్ నంద కిషోర్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తుల పాల్గొన్నారు.

## ఎరువులను అధిక ధరలకు అమ్మితే చర్యలు



**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల పరిధిలో ఎరువులను నిర్ణీత ధరల కంటే ఎక్కువ రేట్లకు అమ్ముతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి అనూష స్పష్టం చేశా రు.ఆదివారం ప్రజాపక్షం దినపత్రిక విలేకరితోఏఒ అనూష చరవాణిలో మాట్లాడుతూ ముత్తారం మండలంలో ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు 'ప్రజాపక్షం' దినపత్రికలో వచ్చిన వార్తా కథనానికి వ్యవసాయ అధికారి సానుకూలంగా స్పందించారు.రైతులకు ఇబ్బంది కలిగిస్తూ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ ధరలకు ఎరువులు అమ్మే షాప్ యజమానులపై,ఇతర వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని అన్ని ఎరువుల దుకాణాల్లో ధరల పట్టికలను ప్రదర్శించాలని,రైతులకు రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్సులు రద్దు చేయడానికి కూడా వెనుకాడబోమని మండల వ్యవసాధికారి అనూష స్పష్టం చేశారు.

## సాగుకు సన్నద్ధమవుతున్న రైతన్నలు



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం వ్యాప్తంగా వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఇటీవల మండలంలోని పలు గ్రామాల్లో కురిసిన ముందస్తు వర్షాలకు రైతన్నలు తమ పొలాలను సాగుకు సిద్ధం చేస్తున్నారు.ఏరువాక పనులు ప్రారంభించి, పొలాలను దున్నుతూ విత్తనాలు వేయడానికి నేలను అనుకూలంగా మార్చుకుంటున్నారు.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఉదయం నుంచే రైతులు నాగళ్లతో పొలాల్లోకి చేరుకుంటున్నారు వానా కాలం పంటల సాగు కోసం భూములను చదును చేసే పనుల్లో బిజీగా మారారు.సమయానికి వర్షాలు కురవడంతో ఈ ఏడాది మంచి దిగుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## డయల్ 100కు తక్షణమే స్పందించాలి: సిఐ



**ప్రజాపక్షం /పెగడపల్లి :** ఇటీవల బదిలీపై బాధ్యతలు స్వీకరించిన మల్యాల సర్కిల్ ఇన్స్‌పెక్టర్ (సిఐ) మదాసు రాజ్ కుమార్ ఆదివారం పెగడపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి, శాంతిభద్రతల నిర్వహణపై సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా సిఐ రాజ్ కుమార్ మాట్లాడుతూ పోలీస్ పరిధిలో నేరాల నియంత్రణకు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.బాధితులకు తక్షణ న్యాయం జరిగేలా చూడాలని పేర్కొన్నారు. గ్రామాల్లో దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా బ్లూకోల్ట్స్, పెట్రో కార్ల ద్వారా నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే డయల్ 100 అత్యవసర కాల్స్‌కు సిబ్బంది అత్యంత వేగంగా, తక్షణమే స్పందించి ఘటనా స్థలానికి చేరుకోవాలని స్పష్టం చేశారు. బాధితులకు భరోసా కల్పించేలా ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేయాలన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పెగడపల్లి సబ్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, ఏఎస్సైలు,హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వలకు చిక్కిన భారీ చేప




**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండల కేంద్రంలోని పెద్ద చెరువులో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులకు 15 కిలోల భారీ చేప వలకు చిక్కింది. గత మూడు సంవత్సరాలుగా పెద్ద చెరువులో నీటి సాంద్రత ఎక్కువగా ఉన్నందున చేపలు ఎక్కువ మొత్తంలో బరువు పెరిగాయని,ఆదివారం రోజున వలకు 15 కిలోల భారీ చేప చిక్కడం ఆనందాన్నిచ్చిందని మత్స్యకారులు అన్నారు. ఇక్కడ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు ఏల్ల ఆశాలు,కార్యదర్శి న్యావనంది నికేష్,గంగపుత్రులు నడిపి నరసయ్య ,చిన్న దేవయ్య ,గంగాధర్ ,సురేష్ ,పెద్దిరెడ్డి ,గంగారం, నరసయ్య ,లక్ష్మీ నారాయణ,నవీన్,తదితరులు ఉన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: ఎస్ఐ



**ప్రజాపక్షం / కొడిమ్యాల :** యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, రాష్ డ్రైవింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై నరేష్ కుమార్ హెచ్చరించారు.ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటుందని అన్నారు.మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని, మైనర్ డ్రైవింగ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. అలాగే అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రజలు పోలీసులకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎస్సై నరేష్ కుమార్ కోరారు.

## పివి జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/ముత్తారం :** భారత మాజీ ప్రధాని, బహుభాషా కోవిదుడు, ఆర్థిక సంస్కరణల రూపశిల్పి పాములపర్తి వెంకట నరసింహారావు (పివి) జయంతి వేడుకలు ఆదివారం మంథని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.అనంతరం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అయి ప్రసాద్ ఆధ్వర్యంలో పివి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు,దూరదృష్టి నాయకత్వం ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలియో రహిత సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం

### జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**ప్రజాపక్షం/జగిత్యాల:** ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందించి పోలియో రహిత సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు.జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం జగిత్యాల పట్టణంలోని మోతెవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ దేశం పోలియో నిర్మూలనలో చారిత్రాత్మక విజయాన్ని సాధించినప్పటికీ, ఆ విజయాన్ని శాశ్వతంగా నిలబెట్టుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు.పోలియో చుక్కలు పూర్తిగా సురక్షితమైనవని, పిల్లల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత అవసరమని తెలిపారు.ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలకు దూరం కాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పోలియో రహిత భారతదేశాన్ని శాశ్వతంగా కొనసాగించేందుకు ప్రతి కుటుంబం ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. పోలియో రహిత జగిత్యాల జిల్లాగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలియో కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు,అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఏ ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు మిస్ కాకుండా ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. పోలియో నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు.తల్లిదండ్రులు ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించి తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు.జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలు, పోలియో బూత్‌లలో కార్యక్రమం సజావుగా కొనసాగుతోందని తెలిపారు.చిన్నారుల ఆరోగ్య రక్షణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వబోమన్నారు.పోలియో నివారణలో ప్రతి డోస్ ఎంతో విలువైనదని చెప్పారు. ప్రజలు అపోహలను నమ్మకుండా ఆరోగ్య సిబ్బంది సూచనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. పిల్లల భవిష్యత్తు ఆరోగ్యవంతంగా ఉండేందుకు పోలియో చుక్కలు అత్యంత ప్రభావవంతమైన రక్షణ అని వివరించారు.ఆరోగ్య శాఖ సిబ్బంది సేవలను ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ అభినందించారు.జిల్లాలోని అన్ని మండలాల్లో పోలియో కార్యక్రమం విజయవంతంగా కొనసాగేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ప్రతి పోలియో బూత్ వద్ద అవసరమైన మందులు,సిబ్బంది అందుబాటులో ఉన్నారని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. సుజాత, వైద్యులు, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## చిన్నారి ప్రాణాలకు 'ఒక చుక్క'రక్షణ

### మార్కపురి సూర్య
### సిపిఐ ఫ్లోర్ లీడర్
### 41 డివిజన్ కార్పొరేటర్




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఒక చుక్క చిన్నారుల ప్రాణాలకు రక్షణగా ఉంటుందని,ప్రతి ఒక్కరూ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని 41 డివిజన్ కార్పొరేటర్ సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య అన్నారు. ఆదివారం రోజునపల్స్ పోలియో దినం సందర్భంగా ఎల్బీనగర్ లోనే సిపిఐ జెండా వద్ద నిర్వహించిన పోలియో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య హాజరై కార్యక్రమాలు ప్రారంభించారు.అనంతరం సూర్య మాట్లాడుతూ భారతదేశాన్ని పోలియో రహితదేశంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ ఐదు సంవత్సరాల లోపు ఉన్న తమ పిల్లలకి పల్స్ పోలియో వేయించాలని విజ్ఞప్తి చేశారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో సోకకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా నిర్వహిస్తున్న పోలియో కార్యక్రమంలో అందరూ భాగస్వాములు వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రాణి,ఆశా సరస్వతి, ఆర్‌పిలు భాగ్య,సరోజ డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## కుందేళ్ల వెంకటి మృతి తీరని లోటు

### కుటుంబాన్ని పరామర్శించిన
### సిపిఐ నేత చాడ వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం /కరీంనగర్ :** బొమ్మనపల్లి గ్రామానికి చెందిన కుందేళ్ల వెంకటి తన తుదిశ్వాస విడిచేవరకు సిపిఐ పార్టీలో కొనసాగారని ఆయన మృతి సిపిఐకి, వారి కుటుంబానికి తీరని లోటని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం సిపిఐ నేతలతో కలిసి వెంకట్‌రెడ్డి కుందేళ్ల వెంకటి కుటుంబాన్ని పరామర్శించి వెంకటి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటి చిన్నతనంలోనే భారత కమ్యూనిస్టు పార్టీలో చేరారని పార్టీ పట్ల అంకిత భావంతో ఉండేవారని ఎవరెన్ని పార్టీలు మారినా ఆయన మాత్రం చివరి శ్వాస విడిచేవరకు ఎర్రజెండాను వీడలేదని అన్నారు. వారి కుటుంబానికి సిపిఐ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు వెంకట్ రెడ్డి ధైర్యం చెప్పారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వెంకటికి ముగ్గురు కుమార్తెలు,



ఒక కుమారుడు ఉన్నారని వారు ఇంకా చదువుకుంటున్నారని వారు నివసిస్తునన ఇల్లు కూడా శిథిలావస్థలో ఉందని వారికి ఇల్లు మం జూరు చేయాలని ప్రభుత్వం వారిని ఆదుకోవాలని వెం కట్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రా ష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, మండల కార్యదర్శి నా గెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ,కౌన్సిల్ సభ్యులు బోయిని అశోక్, గూడెం లక్ష్మీ, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, అందె చిన్నస్వామి, బూడిద సదాశివ, సిపిఐ గ్రామ కార్యదర్శి అందె సంపత్, సీతారాంపూర్ మాజీ సర్పంచ్ గోలి బాపురెడ్డి, సీనియర్ నాయకులు బండారుపెల్లి తిరుపతి, తాళ్లపెల్లి చంద్రయ్య, ఎలగందుల రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నిధుల కొరత.. గ్రామాభివృద్ధి కుంటుపాటు

* వర్షాకాలంలో పరిశుభ్రత, తాగునీటి వసతుల నిర్వహణ పనులు సవాల్* జగిత్యాల మండల సర్పంచుల ఆవేదన!

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** వర్షాకాలం ప్రారంభమైన వేళ గ్రామాల్లో అత్యవసరంగా చేపట్టాల్సిన పరిశుభ్రత, మురుగునీటి పారుదల, దోమల నివారణ, రహదారుల మరమ్మతులు, తాగునీటి వసతుల నిర్వహణ వంటి పనులకు అవసరమైన నిధులు అందుబాటులో లేకపోవడంతో గ్రామపంచాయతీల పాలన సంక్షోభంలో పడిందని జగిత్యాల మండల సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థాయిలో నిధుల విడుదలలో జాప్యం కారణంగా గ్రామాల అభివృద్ధి పనులు నిలిచిపోయాయని వారు పేర్కొన్నారు.

ప్రతి సంవత్సరం వర్షాకాలం ప్రారంభానికి ముందే గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, డ్రైనేజీల శుభ్రపరిచే ప నులు, చెత్త తొలగింపు, దోమల నివారణకు ఫాగింగ్, బ్లీ చింగ్ పౌడర్, సోడియం హైపోక్లోరైట్ వంటి చర్యలు చే పట్టాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం గ్రామపంచాయతీ ల ఖాతాల్లో తగిన నిధులు లేకపోవడంతో కనీస




అవసరాలకే ఇబ్బందులు ఎదురవుతున్నాయని జగిత్యాల మండలసర్పంచులు తెలిపారు.గ్రామాల్లో డ్రైనేజీలు మురుగు తో నిండిపోవడం, వర్షపు నీరు నిల్వ ఉండటం వల్ల దో మల వ్యాప్తి పెరిగి డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలు ప్ర బలే ప్రమాదం ఉందని సర్పంచులు ఆందోళన వ్యక్తం చే శారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే చ ర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ, ఆర్థిక వనరు ల కొరత వల్ల పనులు చేపట్ట లేకపోతున్నామని సర్పంచు లు పేర్కొన్నారు.అలాగే గ్రామాల్లో దెబ్బతిన్న సిసి రోడ్లు, అంతర్గత రహదారులు, కల్వర్టులు, వీధిదీపాల మరమ్మతులు, తాగునీటి పైప్‌లైన్ల లీకేజీల నివారణ వంటి ప నులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. చిన్నచి న్న మరమ్మతులకు కూడా స్థానికంగా అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని, కొన్నిచోట్ల సర్పంచులు వ్యక్తిగతంగా ఖర్చు చేసి గ్రామ అవసరాలు తీర్చాల్సి వస్తోంద ని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీలకు రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు, ఇతర అభివృ ద్ధి నిధులు, బిల్లుల చెల్లింపులు సకాలంలో విడుదల కాకపోవడం వల్ల పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించడంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు తెలిపారు. దీంతో కార్మికుల పనితీరు ప్రభావితమవుతోందని సర్పంచులు తెలిపారు. వర్షాకాలంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే గ్రామపంచాయతీలకు తక్షణమే ప్రత్యేక నిధులు విడుదల చేయాలని సర్పంచులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గ్రామాల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక గ్రాంట్లు మంజూరు చేయడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని సర్పంచులు ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

## యాప్ ఆధారిత యూరియా పంపిణీ రద్దు

### మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్

**ప్రజాపక్షం / గంగాధర :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యాప్ ఆధారిత యూరియా పంపిణీ విధానం రైతులకు శాపంగా మారిందని వెంటనే ఈ విధానం రద్దు చేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో జాతీయ ప్రధాన రహదారిపై భారీ మహాధర్నా నిర్వహించారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆదేశాలమేరకు జరిగిన ఈ ఆదోళనలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు. రైతులు జాతీయ రహదారిపై బైటాయించడంతో గంటల తరబడి ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్ విధానం వల్ల రైతులు యూరియా కోసం రోజుల తరబడి క్యూలైన్లో పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆరోపించారు. మాకు చదువు రాదు చేతిలో స్మార్ట్‌ఫోన్లు లేవు అలాంటప్పుడు యాప్ ద్వారా యూరియా ఎలా బుక్ చేసుకోవాలో మాకు తెలియడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. గతంలో సొసైటీలు, డీలర్ల వద్ద ఏలాంటి ఇబ్బంది లేకుండా యూరియా అందేదని ఇప్పుడు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే ఈ విధానాన్ని రద్దు చేసి పాత పద్దతిలో యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సుంకె రవిశంకర్ తోపాటు బిఆర్ఎస్ నాయకులను బలవంతంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్టుల సమయంలో పోలీసులు, నాయకుల మధ్య తోపులాట జరగడంతో తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అనంతరం పోలీసులు అరెస్ట్ చేసిన నాయకులను స్వంత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో 6 మండలాల బిఆర్ఎస్ నాయకులు, రైతులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



## 94,321 పిల్లలకు 568 పోలియో కేంద్రాలు

### పోలియోరహిత జిల్లాగా మార్చేందుకు కృషి: కలెక్టర్ హైమావతి

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని నాసర్‌పురా పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్‌రావు, జిల్లా కలెక్టర్ హైమావతితో కలసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపి రఘునందన్‌రావు మాట్లాడుతూ పల్స్ పోలియో కార్యక్రమంం ద్వారా తమ పిల్లల జీవితాలను కాపాడుకోవాలని. ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికి తల్లిదండ్రుల ఈఅవకాశాన్ని వినియోగించుకొని పోలీయో చుక్కలు వెయించుకోవాలనావ్వరు. తమ పిల్లల నిండు జీవితానికి రెండు పోలీయో చుక్కలు వేయించుకోవటం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. జిల్లా కలెక్టర్ హైమావతి చిన్నారులకు పోలీయో చుక్కలు వేసి మాట్లాడుతూ 1995 నుండి పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందన్నారు. జిల్లాలో అర్హులైన పిల్లలు 94.321 ఉం డగా వీరికోసం జిల్లా వ్యాప్తంగా 568 పోలియో చుక్కల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 32 ట్రాన్సిస్టరపాయింట్ల ద్వారా బస్టాండ్లు. రైల్వేస్టేషన్, మోబైల్ టీం, ద్వారా గుర్తించి చుక్కలు వేసినట్లు తెలిపారు. ఈరోజు చుక్కల కేంద్రానికి రాని పిల్లలు 29 సోమవారం,30 మంగళవారం ఆశా, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి చుక్కల మందులు వేసుకోని పిల్లలను గుర్తించి చుక్కల మందు వేస్తారని, ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులువ వినియోగించుకోవాలన్నారు. సిద్దిపేట జిల్లాను పోలియో రహిత జిల్లాగా మార్చేందుకు ప్రజలు,ప్రజాప్రతినిధులు. అధికారులు, స్వచ్ఛంద సంస్థలు,విద్యాశాఖ, ఐసిడిఎస్, గ్రామపంచాయతీ, ఇతర లైన్ డిపార్టుమెంట్ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖలో సహకరించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ధనరాజ్, ప్రోగ్రాం ఆఫీసర్లు ,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## 'సర్'తో.. ఏ ఒక్కరి ఓటూ పోదు

* ఇంటిలో ఉండి ఓటు మ్యాపింగ్ చేయించే వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

* ప్రతిపక్షాలు కావాలనే ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు...

* సర్‌తో ఓట్లు తీసేస్తారని మంత్రులు మాట్లాడడం సిగ్గుచేటు...

* మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** సర్‌తో ఏ ఒక్కరి ఓటు పోదని,ప్రతిపక్ష పార్టీల నాయకులు కావాలనే ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట బిజెపి పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రధానమంత్రి మాన్‌కి బాత్ కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ మరియు పార్టీ కార్యకర్తలతో కలిసి మోదీ సందేశాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపి రఘునందన్‌రావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రారంభమైన సర్,మన తెలంగాణలో ఈ నెల 25వ తేదీన ప్రారంభమైందని,బిజెపి బిఎల్‌ఏలు అందరూ ఎస్ఐఆర్‌లో విధిగా పాల్గొంటూ పర్యవేక్షిస్తున్నారన్నారు. కాంగ్రెస్,ఎం ఐ ఎం తదితర పార్టీల వారు బిఎల్‌ఎలను పెట్టుకొని ఓట్లు పోతాయని ఓటర్లను భయందోళనలకు గురి చేస్తున్నారని,వారికి ఇష్టం లేనప్పుడు బిఎల్‌ఎలను ఎందుకు పెట్టుకున్నారని ప్రశ్నించారు.అంబేద్కర్ రా సిన రాజ్యాంగ ంప్ర కారం అందిరి ఓట్లు రక్షించబడుతాయ ని,పల్లెల నుండి పట్టణాలలో నివసిస్తున్న వ్యక్తులు ఎక్కడ ఓట్లు మ్యాపింగ్ చే సుకుంటే అక్కడనే ఓట్లు ఉంటాయన్నారు. ఎస్ఐఆర్‌తో ముస్లింలు,బిజెపికి నచ్చని వారి ఓట్లు పోతాయని మంత్రులు మాట్లాడడం సిగ్గు చేటు అని,వారికి భారత రాజ్యాంగం పట్ల విశ్వాసం లేనట్లేనని అన్నారు. కొన్ని పార్టీల నాయకులు అత్యుత్సాహంతో వారి ఇంటికి బిఎల్‌ఎలను పిలిచి కూర్చోబెట్టుకొని ఓటు మ్యాపింగ్ చేపిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని జిల్లా కలెక్టర్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఇంట్లో కూర్చోపెట్టుకొని ఓటు మ్యాపింగ్ చేసిన ఆ ఓట్లను తొలగించబడుతాయన్నారు. ప్రైవేట్ వ్యక్తులు చేస్తున్న ఓటు మ్యాపింగ్‌కు ప్రజలు ఎవరు సహకరించవద్దని,ప్రతి ఒక్కరూ బిఎల్‌ఓ ,బిఎల్‌ఎల ద్వారానే ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు ఓటు మ్యాపింగ్ చేసుకొవాలని,ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దని సూచించారు. దేశంలో జరుగుతున్న మంచిని ప్రతి నెల నాల్గవ ఆదివారం ఉదయం 11 గంటలకు మాన్‌కి బాత్ ద్వారా ప్రజలందరికీ ప్రధాని మోదీతెలుపుతారన్నారు.

### బిజెపి జిల్లా కార్యాలయాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన నితిన్ నబీన్..



సిద్దిపేట అర్బన్ మండలం బక్రీచెప్యాల గ్రామ పరిధిలో నూతనంగా నిర్మించిన భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలను బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ వర్చువల్‌గా ప్రారంభించగా,బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ రిబ్బన్ కట్ చేసి నూతన కార్యాలయంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్‌గౌడ్,మోహన్ రెడ్డి,సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ దూది శ్రీకాంత్ రెడ్డి,కౌన్సిలర్ సాయికుమార్‌గౌడ్,సీనియర్ నాయకులు గాడిపల్లి బాస్కర్,విభీషణ్‌రెడ్డి,చింత సంతోష్,తొడుపునూరి వెంకటేశం,బాసంగారి వెంకట్,జనార్ధన్,కొత్తపల్లి వేణుగోపాల్,మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పద్మ,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంటు సమావేశాలలోపు

# మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ

- బిజెపి అగ్రశ్రేణి వర్గాల సంకేతాలు
- వివాదాస్పద ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగిస్తారా? లేదా?
- 'టీమ్ నితిన్ నబీన్' రెడీ
- టిఎంసి, శివసేన, ఆప్ ఫిరాయింపుదారులకు అవకాశం!



**న్యూఢిల్లీ:**కేంద్ర మంత్రివర్గంలో మార్పులు,చేర్పులు జరుగుతాయని కొద్దిరోజులుగా వినిపిస్తున్న ఊహాగానాలు ఇప్పుడు నీట్–సిబిఎస్‌సి పరీక్షల లీకేజీ అవకతవకల ఆరోపణల నేపథ్యంలో అనివార్యంగా మారాయి. వివాదాస్పద మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించే విషయంలో ఉత్కంఠ నెలకొంది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యేలోపే నరేంద్రమోదీ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరుగుతుంది. జులై మూడోవారం లోపే మంత్రివర్గ పునర్వ్యస్థీకరణకు అవకాశాలు ఉన్నాయి. కీలక మంత్రిత్వశాఖల నిర్వహణకు కొత్త మంత్రుల అవసరం ఉందని ఉన్నత స్థాయీ ప్రభుత్వ అధికారవర్గాల్లో బలమైన అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా రాష్ట్రం,ప్రాంతం,కులం,వర్గం,రాజకీయ విధేయతల ప్రాతిపదికపై అన్ని అంశాలను సమతుల్యం చేయాల్సిన బాధ్యత కూడా అధికారపార్టీపై ఉంది. ఉత్తరప్రదేశ్,ఉత్తరాఖండ్,పంజాబ్ రాష్ట్రాలకు వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి గనుక ఆ రాష్ట్రాల నుండి కూడా కేంద్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.పశ్చిమ బెంగాల్‌లో కూడా బిజెపి ఘన విజయం సాధించినందువల్ల ఆ రాష్ట్రానికి కూడా మోదీ మంత్రివర్గంలో చోటు లభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.జూన్ 23న పద్మ పురస్కార కార్యక్రమంలో మోదీ, తర్వాత రెండు రోజులకు అమిత్ షా రాష్ట్రపతిని కలుసుకోవడంతో మంత్రివర్గ పునర్వ్యస్థీకరణ ఖాయమని భావిస్తున్నారు.

పార్టీలో ఇన్నాళ్ళూ కష్టపడిన సీనియర్లు మంత్రివర్గంలోకి,మంత్రివర్గంలో ఉన్న కొందరు పార్టీ కీలక సంస్థాగత బాధ్యతల్లోకి స్థానాలు తారుమారయ్యే అవకాశాలు ఉన్నాయని సంకేతాలు వచ్చాయి. పార్టీ ఆఫీసు బేరర్లు కొందరు మోదీ మంత్రివర్గంలోకి వస్తారు. ఖచ్చితంగా కొందరు మంత్రులను తొలగించి సంస్థాగత బాధ్యతల్లోకి పంపుతారు. ఈ జాబితాలో ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నారా?లేదా? అనేది తేలాల్సి ఉంది. ఈ స్థానాల భర్తీకోసం కొందరు కేంద్ర సహాయ మంత్రులతో కూడా నితిన్ నబీన్ గతవారంలో ఈ విషయాలపై చర్చలు జరిపారన్నది అధికారపార్టీ వర్గాల సమాచారం. అదేవిధంగా మంత్రివర్గంలో కొందరికి శాఖల మార్పులు కూడా ఉంటాయన్న ఊహాగానాలు జోరందుకున్నాయి. దేశంలో కొత్తగా ఆవిర్భవించిన కాంక్రోచ్‌పార్టీ ఉద్యమంవల్ల విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఆయనను సగౌరవంగా సాగనంపేందుకు పార్టీలో పెద్ద స్థానం,కీలక బాధ్యతలు ఇస్తారా? లేక శాఖ మారుస్తారా? అనే విషయం కూడా చర్చనీయాంశంగా ఉంది. ఈ మేరకు కొందరు మంత్రులకు పార్టీలో కీలకమైన సంస్థాగత బాధ్యతలు అప్పగిస్తారు. యువకులను కూడా సంస్థాగత బాధ్యతల్లో మోహరిస్తారు. ఇద్దరు కేంద్రమంత్రులు పంకజ్ చౌధురి,హర్ష్ మల్హోత్రాలను ఇప్పటికే ఉత్తరప్రదేశ్–ఢిల్లీలో పార్టీ బాధ్యతల్లో నియమించారు. "టీమ్ నితిన్ నబీన్" రంగ ప్రవేశం చేసేందుకు సిద్ధంగా ఉంది. ఈ టీమును ఆయన త్వరలోనే ప్రకటిస్తారు.జులై మూడోవారంలో పార్లమెంటు సమావేశాలు ప్రారంభమవుతాయి. అందువల్ల జులైలో ఆ లోపే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు అవకాశాలు ఉన్నాయి. టిఎంసి నుండి తిరుగుబాటుదారులు బిజెపికి విధేయులయ్యారు. శివసేన (యుబిటి) అసమ్మతి ఎంపీలు ఆరుగురు కూడా మహారాష్ట్రలో షిండేకు విధేయులుగా మారారు. అందువల్ల షిండే నేతృత్వంలో ఒక సీనియర్ శివసేన నాయకుడికి, ఆమ్ ఆద్మీపార్టీని విడిచి బిజెపిలో చేరిన ఏడుగురు రాజ్యసభ ఎంపీలలో ఒకరిద్దరికి కూడా మంత్రివర్గ స్థానాలు దక్కే అవకాశాలు ఉన్నాయి. దీంతో రాజధాని ఢిల్లీలో ఆ సందడి పెరిగింది. ఈ విషయాలపై ఇప్పటికే అధికారపార్టీలో అంతర్గతంగా చర్చలు జరుగుతున్నాయి. బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఇప్పటికే కొన్ని రాష్ట్రాలలో పర్యటనలు కూడా చేసి వచ్చారు.ఆయన నాయకత్వంలో పార్టీ కొత్త బృందాన్ని ఏర్పాటు చేయడంతో పాటు మోదీ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరుగుతుందన్నదే ప్రధానాంశం. పార్టీ అగ్రశ్రేణి వర్గాల సమాచారం ప్రకారం మంత్రివర్గంలో మార్పులు–చేర్పుల జాబితా కూడా సిద్ధమైంది. అధికారాపార్టీలో నితిన్ నబీన్ తన కొత్త బృందాన్ని తెరమీదకు తీసుకురానున్నారు. ఈ బృందంలో యువతరానికి ఆయన ప్రాధాన్యత ఇస్తారన్నది భోగట్టా. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరిగితే జులై మూడోవారంలోపే జరుగుతుంది. ఇది ప్రధానమంత్రి మోదీ షెడ్యూలుపైనే ఆధారపడి ఉంది. ప్రస్తుతం ప్రధానమంత్రి మోదీ రేపటి వరకూ అంటే సోమవారం వరకూ హిందూమహాసముద్ర ద్వీప సమూహ దేశం సేషెల్స్ పర్యటనలో ఉంటారు. ఆ తర్వాత ఇండోనేసియా, ఆస్ట్రేలియా,న్యూజిలాండ్ దేశాలలో కూడా జులై 7 నుండి 11వ తేదీ వరకూ పర్యటనలు చేసే అవకాశాలు ఉన్నాయి. జపాన్ ప్రధానమంత్రి సనే తకైచీ కూడా నిర్ణీత ప్రకారం జులై ఒకటో తేదీన న్యూఢిల్లీ పర్యటనకు వస్తారు.

## అధికార కేంద్రీకరణ, రాష్ట్రాలపై

# అదనపు ఆర్థిక భారం

- 'విబి– జి రామ్ జి' చట్టం హామీనిచ్చేది ఇదే...
- ఎలాంటి సంప్రదింపులు జరపకుండానే 'ఎంజి నరేగా' రద్దు
- కేంద్ర సర్కార్‌పై కాంగ్రెస్ మండిపాటు



**న్యూఢిల్లీ :** ఎంజి నరేగా స్థానంలో ఇటీవల 'విబి– జి రామ్ జి' చట్టాన్ని తీసుకురావడంపై ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలు కేంద్ర ప్రభుత్వంగా తీవ్రంగా మండిపడుతున్నాయి. ఈ చట్టాని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. అయినప్పటికీ వారి డిమాండ్లను బేఖాతరు చేయకుండా జూల 1వ తేదీ నుంచి అమల్లో తీసుకువచ్చేందుకు బిజెపి నేతృత్వంలోని నరేంద్ర మోదీ సర్కార్ అన్ని ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ స్పందిస్తూ 'విబి– జి రామ్ జి'పై పలు రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని పేర్కొంది. ఈ కొత్త చట్టం కేవలం అధికార కేంద్రీకరణకు, రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారాన్ని మోపడానికి మాత్రమే దారితీస్తుందని వ్యాఖ్యానించింది. ఎప్పటిలాగే కక్షపూరిత, సంకుచిత ధోరణితో వ్యవహరిస్తున్న మోదీ ప్రభుత్వం, గ్రామీణాభివృద్ధిపై పార్లమెంటరీ స్థాయీ సంఘం, రాష్ట్ర ప్రభుత్వాలు లేదా ఇతర సంబంధిత వర్గాలతో ఎలాంటి సమగ్ర సంప్రదింపులు జరపకుండానే ఎంజి నరేగా రద్దు ప్రక్రియను పార్లమెంటులో బలవంతంగా ఆమోదింపజేసిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ విమర్శించారు. జులై 1న ప్రారంభం కానున్న దీని ప్రత్యామ్నాయ పథకం 'విబి– జి రామ్ జి' విషయంలో పలు రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు వెల్లడైందని రమేశ్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఈ కొత్త చట్టం అమల్లోకి వస్తే రాష్ట్రాలపై పడనున్న భారీ అదనపు వ్యయ భారాన్ని మధ్యప్రదేశ్, బిహార్, ఉత్తరాఖండ్ వంటి బిజెపి పాలిత రాష్ట్రాలు కూడా వ్యతిరేకించాయని ఆయన తెలిపారు. వ్యవసాయ పనుల రద్దీ ఎక్కువగా ఉండే కీలక సమయంలో ఈ పథకం అమలును నిలిపివేసే (బ్లాక్అవుట్) విధానాన్ని మరో నాలుగు రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకించాయని, అలాగే కనీసం ఐదు రాష్ట్రాలు గ్రామీణ కార్మికుల వేతనాలను పెంచాలని కోరాయని రమేశ్ చెప్పారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి (శివరాజ్ సింగ్ చౌహాన్) సొంత రాష్ట్రమైన మధ్యప్రదేశ్ కూడా మోదీ ప్రభుత్వం ఈ కొత్త ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుపై ఆందోళన వ్యక్తం చేస్తోందని రమేశ్ ఆరోపించారు. 'ఎంజి నరేగా రాజ్యాంగం కల్పించిన పని హక్కుకు హామీనిచ్చింది. కానీ 'విబి– జి రామ్ జి' మాత్రం కేవలం అధికార కేంద్రీకరణకు, రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారాన్ని మోపడానికి మాత్రమే హామీ ఇస్తుంది' అని రమేశ్ అన్నారు. పని హక్కుపై మోదీ ప్రభుత్వం చేసిన నాలుగు దాడులను వివరిస్తూ ఒక చార్ట్‌ను కూడా కాంగ్రెస్ నేత ఎక్స్‌లో పంచుకున్నారు. 'విబి– జి రామ్ జి' చట్టం ద్వారా ప్రభుత్వం పని హక్కు, న్యాయమైన వేతనాల హక్కు, పంచాయతీ రాజ్ వ్యవస్థ, రాష్ట్రాల ఆర్థిక వనరులపై దాడి చేస్తోందని అందులో ఆరోపించారు. ఈ చట్టం కల్పించే ఏకైక హామీ అత్యధిక అధికార కేంద్రీకరణ, గ్రామీణ కార్మికుల బేరసారాల శక్తిని బలహీనపరచడం మాత్రమేనని కాంగ్రెస్ ఆరోపించింది. రెండు దశాబ్దాల నాటి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజి నరేగా) స్థానంలో, 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్)' చట్టం లేదా 'విబి– జి రామ్ జి' చట్టం జూలై 1 నుండి దేశవ్యాప్తంగా అమల్లోకి వస్తుందని కేంద్రం ప్రకటించింది. ఈ కొత్త చట్టం ఒక నూతన విధానాన్ని కలిగి ఉండి, గ్రామీణ కుటుంబాలకు 125 రోజుల చట్టబద్ధమైన వేతన ఉపాధిని కల్పిస్తామని హామీ ఇస్తుంది.

# ఎండిఎంకెకు భారీ దెబ్బ

డిఎంకెలో చేరిన అ పార్టీ అగ్రనేతలు, జిల్లా కార్యదర్శులు
డిఎంకెతో తెగదెంపులు చేసుకున్న మరుసటి రోజే ఈ పరిణామం



**చెన్నై :** తమిళనాడులోని ఎండిఎంకెకు ఎదురు దెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన 150 మందికి పైగా ముఖ్య నేతలు... రాష్ట్ర స్థాయి నాయకులు, జిల్లా కార్యదర్శులు, న్యాయవాదులు, విద్యార్థులతో సహా ఆదివారం డిఎంకెలో అధికారికంగా చేరారు. ఎండిఎంకె అధినేత వైకో నేతృత్వంలోని ఆ పార్టీ సర్వసభ్య సమావేశం, డిఎంకెతో పొత్తును తెంచుకుంటున్నట్లు ప్రకటించిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ కీలక చేరికలు డిఎంకె ప్రధాన కార్యాలయమైన 'అన్నా అరివాలయం'లో జరిగాయి. డిఎంకె అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ సమక్షంలో ఆ నాయకులు పార్టీకి తమ విధేయతను చాటుకున్నారు. ఈ పరిణామం డిఎంకెకు అనేక కీలక ప్రాంతాలలో బలాన్ని చేకూర్చింది. ముఖ్యంగా శివగంగ, తిరువళ్లూరు, విరుదునగర్, తిరుప్పూర్ జిల్లాల్లోని ఎండిఎంకె ప్రధాన నాయకత్వ వర్గం నుండి పెద్ద సంఖ్యలో నేతలు డిఎంకె వైపు మళ్లారు. ఈ వలసలో ఉన్నత స్థాయి కమిటీ సభ్యులు, జిల్లా కార్యదర్శులు ముందున్నారు. వీరిలో పులవర్ ఎస్. సేవంతీయప్పన్ (శివగంగ), టి.ఆర్.ఆర్. సెంగుట్టువన్ (తిరువళ్లూరు), ప్రచార కార్యదర్శి తిరుపరంకుంద్రం అళగుసుందరం, ఆర్.ఎం.ఎస్. శేఖర్ (విరుదునగర్) ఉన్నారు. అనుభవజ్ఞులైన రాజకీయ నాయకులతో పాటు తమిళనాడు డాక్టర్ అంబేద్కర్ లా యూనివర్సిటీకి చెందిన 40 మంది విద్యార్థుల బృందం కూడా పార్టీలో చేరింది. ఇది ఎండిఎంకె యువజన, విద్యార్థి విభాగాలను డిఎంకె వైపు మళ్లించేందుకు జరిగిన వ్యవస్థీకృత ప్రయత్నాన్ని సూచిస్తోంది.

## రామాలయం విరాళాల కేసు..

# అరెస్టయిన 8 మంది ఇళ్లల్లో సోదాలు

ఆధార్ కార్డులు,
పాన్ కార్డులు, బ్యాంకు సంబంధిత
వివరాలతో సహా పలు పత్రాలను
స్వాధీనం చేసుకున్న పోలీసులు



**అయోధ్య :** ఉత్తరప్రదేశ్ అయోధ్యలోని రామ మందిరానికి వచ్చిన విరాళాలను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై అరెస్టయిన ఎనిమిది మంది నిందితుల ఇళ్లలో అయోధ్య పోలీసులు ఆదివారం ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. స్థానిక మెజిస్ట్రేట్ల సమక్షంలో పోలీసు బృందాలు లవ్ కుశ్ మిశ్రా, అవినాష్ శుక్లా, రామశంకర్ యాదవ్‌లతో సహా నిందితుల ఇళ్లలో తనిఖీలు చేపట్టాయని పోలీసు వర్గాలు తెలిపాయి. అయోధ్యలోని ఒక న్యాయస్థానం ఈ ఎనిమిది మంది నిందితులను ఈనెల 29 వరకు జ్యుడీషియల్ కస్టడీకి పంపిన రెండు రోజుల తర్వాత ఈ సోదాలు జరిగాయి. సోమవారం వారిని కోర్టులో హాజరుపరిచినప్పుడు, పోలీసులు వారిని తమ కస్టడీకి (పోలీస్ రిమాండ్‌కు) అప్పగించాలని కోరే అవకాశం ఉంది. ఆదివారం జరిగిన సోదాల సమయంలో, నిందితుడు మనీష్ యాదవ్ ఇంటిని తెరవాలని కుటుంబ సభ్యులను కోరిన తర్వాత, పోలీసులు ఆధార్ కార్డులు, పాన్ కార్డులు, బ్యాంకు సంబంధిత వివరాలతో సహా పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నారని ఆ వర్గాలు పేర్కొన్నాయి. రామశంకర్ అలియాస్ తిన్ను యాదవ్‌తో సహా ఇతర నిందితుల ఇళ్లలో కూడా సోదాలు జరిగాయి. అక్కడ కుటుంబ సభ్యులను ప్రశ్నించి పత్రాలను పరిశీలించారు. అలాగే, నిందితుల ఆస్తులు, నేపథ్యం, కార్యకలాపాల గురించి సమాచారం సేకరించడానికి పోలీసులు వారి పొరుగువారు, బంధువులతో కూడా మాట్లాడారు. అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్ కుశ్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణేష్ పాండే, రామ్ శంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, రామశంకర్ అలియాస్ తిన్ను యాదవ్... ఈ ఎనిమిది మంది నిందితులు రామమందిరానికి వచ్చిన నగదు, విలువైన వస్తువులను లెక్కించే పనిలో నిమగ్నమై ఉండేవారు. ప్రాసిక్యూషన్ ప్రకారం, దర్యాప్తు అధికారులు ఇప్పటివరకు రూ. 79.85 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఉద్యోగి ద్వారా చోరీ, నేరపూరిత విశ్వాసఘాతకం, దొంగిలించబడిన ఆస్తిని స్వీకరించడం, నేరపూరిత కుట్రకు సంబంధించిన 'భారతీయ న్యాయ సంహిత' నిబంధనలతో పాటు, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ల కింద ఈ కేసు నమోదైంది. ఈ నెల ప్రారంభంలో ఆలయ నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు వచ్చిన తర్వాత ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ముగ్గురు సభ్యుల ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సమర్పించిన ప్రాథమిక నివేదిక సిఫార్సు మేరకు ఈ ఎఫ్ఐఆర్ నమోదైంది. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలతో సహా ప్రతిపక్ష పార్టీలు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లను లక్ష్యంగా చేసుకోవడంతో ఈ వ్యవహారం పెద్ద వివాదంగా మారింది.

# ఆర్‌ఎస్‌ఎస్-బిజెపిల నిజస్వరూపం బట్టబయలు

రాజకీయ లబ్ధి కోసం కాషాయ పార్టీ మతాన్ని,
రాముడిని వాడుకుంటోంది : బినోయ్ విశ్వం



**తిరువనంతపురం :** అయోధ్య రామ మందిర విరాళాల దుర్వినియోగం వ్యవహారం ఆర్‌ఎస్‌ఎస్–బిజెపిల నిజస్వరూపాన్ని బయటపెట్టిందని సిపిఐ కేరళ కార్యదర్శి బినోయ్ విశ్వం ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఆ పార్టీ మతాన్ని, శ్రీరాముడిని వాడుకుంటోందని ఆయన విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసమే సంఘ్ పరివార్ బాబ్రీ మసీదును కూల్చివేసిందని, ఇప్పుడు రామమందిరం బిజెపికి అక్రమంగా సంపదను కూడబెట్టుకునే సాధనంగా మారిందని ఆయన ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ కుంభకోణం గురించి ప్రస్తావిస్తూ, ఆలయ నిధుల నుంచి రూ. 1,400 కోట్లు పక్కదారి పట్టించారని, భక్తులు సమర్పించిన బంగారం, వెండి కానుకలు కూడా మాయమయ్యాయని విశ్వం పేర్కొన్నారు. ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం వహించడాన్ని కూడా ఆయన తప్పుబట్టారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువులను పక్కన పెట్టారని ఆరోపించారు. ఈ వివాదంపై దేశవ్యాప్తంగా భక్తులు బిజెపిని ప్రశ్నిస్తున్నారని పేర్కొన్న బినోయ్ విశ్వం... రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలకు తగిన గుణపాఠం చెబుతారన్నారు. విరాళాల దుర్వినియోగం ఆరోపణలకు సంబంధించిన వివాదం ఈనెల 7న వెలుగులోకి వచ్చింది.

# ఆ ఎంపిలపై అనర్హత వేటు వేయాలి



శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాక్రే డిమాండ్
పార్టీ మార్పు రాజకీయ కుట్రలో భాగమని వ్యాఖ్య

**పర్భానీ :** పార్టీ ఫిరాయించిన ఎంపిలను వెంటనే అనర్హులుగా ప్రకటించాలని శివసేన (యుబిటి) డిమాండ్ చేసింది. ఇటీవల ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని వర్గంలోకి శివసేన (యుబిటి)కు చెందిన ఆరుగురు ఎంపిలు ఫిర్యాంపులకు పాల్పడ్డారు. దీనిపై శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాక్రే తీవ్రంగా మండిపడుతూ పార్టీ మార్పు ఒక పెద్ద రాజకీయ కుట్రలో భాగమని ఆయన ఆరోపించారు. ఆదివారం మహారాష్ట్ర బర్భానీలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో లోక్‌సభ స్పీకర్ చట్టాన్ని గౌరవించాలని ఆయన కోరారు. అలాగే, బిజెపి కేంద్ర నాయకత్వం తమ సొంత రాష్ట్ర నాయకుల రెక్కలను క్రమపద్ధతిలో కత్తిరిస్తోందని (అధికారాన్ని హరిస్తోందని) ఆయన ఆరోపించారు. రామమందిర విరాళాల దుర్వినియోగం అంశంపై బిజెపిని తీవ్రంగా విమర్శించిన థాక్రె.. ఆ పార్టీ ఆలయాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందన్నారు. బిజెపికి కొత్త అర్థాన్నా చెబుతూ 'బాబర్ జనతా పార్టీ'గా అభివర్ణించారు. 'బాబర్ రామమందిరాన్ని కూల్చివేశాడు. ఇప్పుడు కొత్తగా నిర్మించిన ఆలయాన్ని దోచుకోవడానికి ఒక 'బాబర్ జనతా పార్టీ' వచ్చింది. వారికి, వీరికి మధ్య తేడా ఏముంది? అని ఆయన ప్రశ్నించారు. 'ఈ దేశంలో చట్టం అమల్లో ఉంటే, ఆ ఆరుగురు ఎంపిలను అనర్హులుగా ప్రకటించాలి. నాకు ఇప్పటికీ లోక్‌సభ స్పీకర్ పట్ల నమ్మకం ఉంది, ఎందుకంటే ఆయన చట్టాన్ని పాటించకపోతే, ఇతరులను పాటించమని అడగలేరు. మేము ఆయన అధికారాన్ని గౌరవిస్తాము, ఆయన వ్యక్తిగత కోరికలను కాదు' అని ఆయన అన్నారు. ఇటీవల శివసేన (యుబిటి)కు చెందిన ఆరుగురు రెబల్ లోక్‌సభ సభ్యులు ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని అధికారిక శివసేనలో చేరారు. కాగా, రెబల్ ఎంపిలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో థాక్రే పర్యటన చేపట్టారు. రెబల్ చట్టసభ సభ్యులలో ఒకరైన సంజయ్ జాదవ్ పర్భానీకి చెందినవారు. ఈ ఫిరాయింపులు ఒక పెద్ద రాజకీయ క్రీడలో భాగమని, దీనిని తాను 'ఆపరేషన్ దేవేంద్ర' అని పిలుస్తున్నానని సేన (యుబిటి) అధినేత ఆరోపించారు. గతంలో ఇతర నాయకుల విషయంలో చేసినట్లుగానే, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను పక్కన పెట్టడమే దీని లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, నితిన్ గడ్కరీ, ఫడ్నవీస్‌లను ఉదాహరణలుగా చూపుతూ, బిజెపి కేంద్ర నాయకత్వం ప్రధాన మంత్రి పదవికి అర్హులైన వారిని పక్కన పెడుతోందని థాక్రే పేర్కొన్నారు. ఇటీవల తాము కలిసి ప్రయాణించిన విమానంలో ఫడ్నవీస్ అసహాయంగా కనిపించారని, ఎందుకంటే ఆయన సొంత అధిష్టానమే ఆయన రెక్కలను కత్తిరిస్తోంది అని ఆయన ఆరోపించారు. ఏక్‌నాథ్ షిండేను లక్ష్యంగా చేసుకుంటూ బిజెపి నేతృత్వంలోని కూటమిలో ఆ ఉప ముఖ్యమంత్రికి భవిష్యత్తు లేదని, అవసరం తీరాక ఆయనను పక్కన పడేస్తారని థాక్రే వ్యాఖ్యానించారు.

# బిహార్‌లో రబ్బర్‌స్టాంప్ సిఎం

- రాష్ట్రంలో నేరాలు, అవినీతి పెరిగిపోతోంది
- ఎన్‌డిఎ ప్రభుత్వంపై ఆర్‌జెడి జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు తేజస్వీ యాదవ్ ఫైర్




**పాట్నా :** బిహార్‌లో నేరాలు, అవినీతి పెరిగిపోతున్నాయని ఎన్‌డిఎ ప్రభుత్వంపై ఆర్‌జెడి జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు తేజస్వి యాదవ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరిని అసమర్థుడైన 'రబ్బర్‌స్టాంప్' సిఎంగా అభివర్ణించారు. రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న యాదవ్, ఆదివారం పాట్నాలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రశ్నలు సంధించారు. ఖజానా ఖాళీగా ఉండటం వల్ల జీతాలు, పింఛన్ల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. 'రాష్ట్రం అత్యంత క్లిష్టమైన ఆర్థిక పరిస్థితిని ఎదుర్కొంటోంది... నిధుల కొరత కారణంగా జీతాలు ఆలస్యమయ్యాయి, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు దెబ్బతిన్నాయి. రాష్ట్రంలో అవినీతి, నేరాలు విపరీతంగా పెరిగిపోయాయి. కొందరు ఎంపిక చేసిన ఉన్నతాధికారులు (బ్యూరోక్రాట్లు) ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. సామ్రాట్ చౌదరి కేవలం ఒక రబ్బర్‌స్టాంప్ ముఖ్యమంత్రి... ఆయనకు పరిపాలనా సామర్థ్యం లేదు, పైగా ఆయన తన అగ్ర నాయకత్వం నిర్దేశించినట్లుగా పనిచేస్తున్నారు' అని యాదవ్ అన్నారు. రాష్ట్రంలో పూర్తిగా అరాచక పరిస్థితి నెలకొందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం బిహార్ ప్రభుత్వానికి తగిన నిధులు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీ, కొన్ని పథకాల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 'అత్యవసర నిధి' నుండి రూ. 3,660 కోట్లను ఉపసంహరించుకుందని, సంక్షేమ కార్యక్రమాల కోసం సాధారణ బడ్జెట్ కేటాయింపులు చేసే బదులు, ప్రభుత్వం అత్యవసర నిధులపై ఆధారపడుతోందని యాదవ్ విమర్శించారు. రాష్ట్రంలో జరిగినట్లుగా ఆరోపించబడుతున్న టెండర్ కుంభకోణం గురించి ప్రస్తావిస్తూ 'ఈ భారీ టెండర్ కుంభకోణం ఎన్‌డిఎ నాయకుల, ముఖ్యంగా బిజెపి నాయకుల నిజస్వరూపాన్ని బయటపెట్టింది. రాష్ట్రంలో అవినీతి ఏ స్థాయిలో ఉందో ఇది స్పష్టం చేస్తోంది. ఈ కుంభకోణంలో ప్రమేయం ఉన్న కొందరు పెద్దలను ప్రభుత్వం కాపాడుతోంది; అందుకే ఈ కేసులో ఇటీవల ఛార్జ్‌షీట్ దాఖలు చేసిన స్పెషల్ విజిలెన్స్ యూనిట్, అధికారులతో సహా కేవలం ఏడుగురి పేర్లను మాత్రమే నిందితులుగా చేర్చింది. ఈ కుంభకోణంలో కేవలం ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి వర్గాలకు చెందిన అధికారులనే లక్ష్యంగా చేసుకుంటున్నారని యాదవ్ ఆరోపించారు.

# సుప్రీంకోర్టు కొలీజియం సభ్యుడిగా జస్టిస్ పి.ఎస్.నరసింహ నియామకం

**న్యూఢిల్లీ :** జస్టిస్ జె.కె.మహేశ్వరి ఆదివారం పదవీ విరమణ చేయడంతో, జస్టిస్ పి.ఎస్.నరసింహ సుప్రీంకోర్టు కొలీజియం సభ్యుడుగా బాధ్యతలు చేపట్టనున్నారు. 5వ అత్యంత సీనియర్ న్యాయమూర్తి అయిన జస్టిస్ నరసింహ 2028 మే 2న పదవీ విరమణ చేసేవరకూ కొలీజియంలో భాగంగా ఉంటారు. దాదాపు ఐదేళ్ల పదవీ కాలం తర్వాత జస్టిస్ జె.కె.మహేశ్వరి పదవీ విరమణ చేశారు. కొలీజియానికి ఇప్పుడు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఎం.ఎం. సుంద్రేష్, జస్టిస్ పి.ఎస్.నరసింహ ప్రాతినిధ్యం వహించనున్నారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత 1999లో అమలులోకి వచ్చిన కొలీజియం వ్యవస్థ ప్రకారం...సుప్రీంకోర్టుకు చెందిన ఐదుగురు ఉన్నత న్యాయమూర్తులు సుప్రీం కోర్టు, 25 హైకోర్టులకు న్యాయమూర్తుల నియమాకం, బదిలీ, పదోన్నతిని సిఫార్సు చేస్తారు. ఈ విధానం కింద ప్రభుత్వం కొలీజియంకు సిఫార్సును తిరిగి పంపవచ్చు. కొలీజియం ఆ సిఫార్సును తిరిగి పునరుద్ఘాటిస్తే ప్రభుత్వం సాధారణంగా దానిని ఆమోదించినప్పటికీ, ప్రభుత్వం ఆ ఫైల్‌ను తిరిగి పంపినా లేదా సిఫార్సుకు స్పందించని సందర్భాలు కూడా ఉన్నాయి.

**జస్టిస్ పి.ఎస్.నరసింహ ప్రస్థానం...**

1963సంవత్సరం మే 3న హైదరాబాద్‌లో జన్మించిన జస్టిస్ నరసింహ హైదరాబాద్‌లోని నిజాం కళాశాల నుంచి అర్థశాస్త్రం, రాజనీతి శాస్త్రం, ప్రజా పరిపాలనలో ట్రిపుల్ మేజర్లతో పట్టభద్రులై, 1988లో ఢిల్లీ యూనివర్సిటీ క్యాంపస్ లా సెంటర్‌లో న్యాయశాస్త్రం అభ్యసించారు. అదే సంవత్సరంలో న్యాయవాదిగా నమోదు చేసుకున్న జస్టిస్ జె.కె.నర్సింహ సుప్రీంకోర్టుకు తన న్యాయవాద వృత్తిని మార్చుకోవడానికి ముందు హైదరాబాద్‌లోని హైకోర్టు, సివిల్ కోర్టులు, ట్రిబ్యునల్స్‌లో ప్రాక్టీసు చేశారు. ఆయన రాజ్యాంగ ధర్మాసనాలతో సహా సుప్రీం కోర్టు ముందు అనేక కేసులలో హాజరయ్యారు. ఈ సమయంలో ఆయన జస్టిస్ చిన్నపరెడ్డి కమిషన్‌కు కమిషన్ కౌన్సెల్‌గా నియమితులయ్యారు. ఆయన సుప్రీంకోర్టు న్యాయసహాయ కమిటీలో కూడా సభ్యుడిగా ఉన్నారు.జస్టిస్ నరసింహను 2008లో సుప్రీంకోర్టు ఫుల్ కోర్టు సీనియర్ అడ్వకేట్‌గా నియమించింది. సీనియర్ అడ్వకేట్‌గా ఆయన రాజ్యాంగ, పరిపాలన, పర్యావరణ సమస్యలకు సంబంధించిన అనేక ప్రజా న్యాయ కేసులలో వాదించారు. ఆయన 2014లో భారతదేశపు అదనపు సొలిసిటర్ జనరల్‌గానియమితులయ్యారు. జస్టిస్ నరసింహ 2021 ఆగస్టు 31న బార్ నుండి నేరుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.

# ఒడిశాలో మావోయిస్టుల డంప్ కలకలం

భారీగా ఆయుధాలు, ఐఇడి స్వాధీనం!

**మల్కన్‌గిరి:** ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లాలో భద్రతా దళాలు భారీ మావోయిస్టు డంప్‌ను ఛేధించి, పెద్ద ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాయి. ఇటీవల లొంగిపోయిన మావోయిస్టులు ఇచ్చిన సమాచారం ఆధారంగా ఒడిశా ఆంధ్రప్రదేశ్ సరిహద్దు (ఎబిఎ) పరిసర ప్రాంతాల్లో పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారని మల్కన్‌గిరి ఎస్‌పి వినోద్ పాటిల్ హెచ్ తెలిపారు. ఈ సోదాల్లో భాగంగా మావోయిస్టులు దాచిపెట్టిన కీలకమైన డంప్ను గుర్తించి, అందులోని రెండు సెల్ఫ్‌లోడింగ్ రైఫిళ్లు (ఎస్‌ఎల్ఆర్), నాటు తుపాకులు, సుమారు 70 కేజీల బరువైన ఐఈడీ (ఇంప్రూవైజ్డ్ డివైస్) పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# వెనెజులా శిథిలాల్లోంచి అరుపులు, మూలుగులు

•ప్రాణాలు రక్షించేందుకు కాలంతో పోరాటం •దాదాపు 69వేలమంది కోసం సహాయ బృందాల గాలింపు •కొరవడిన పరిశుభ్రత, రోడ్లమీదే నిద్ర, నివాసం •జిడిపిలో ఆరుశాతంపైగా భూకంప నష్టం •అంతర్జాతీయ సంఘీభావానికి పోప్ పిలుపు



**కారకస్:** వెనెజులాలో భూకంపం వచ్చి నాలుగు రోజులు తర్వాత కూడా సహాయ కార్యక్రమాలలో ఎక్కువ మందిని వెలికి తీయలేకపోతున్నారు. కాగా పలు ప్రాంతాలలో శిథిలాల నుండి అరుపులు,మూలుగులు వినిపిస్తున్నాయి. దీంతో ఆయా కుటుంబాలకు చెందినవారు కన్నీళ్ళుపెట్టుకుంటూ ఆత్రంగా వట్టి చేతులతోనే శిథిలాల రాళ్ళను తొలగిస్తూ తీవ్ర మనోవేదన అనుభవిస్తున్నారు. ప్రతి క్షణం వారికి ఎంతో విలువైనది. వారి ప్రాణాలు కాపాడేందుకు బంధువులు కాలంతో పోరాటం చేస్తున్నారు. తమ ప్రియతముల ఆర్తనాదాలు వినిపిస్తాయనే ఆశతో కాంక్రీటు శిథిలాలు, ఇనుప ఊచలు వేలాడుతున్న విరిగిపోయిన స్తంభాల మధ్య చెవులు పెట్టి వింటున్నారు. ఈ ప్రాంతంలో వందల భవనాలు కూలిపోయాయి. వేలాదిమంది లోపల ఉండిపోయారు. భూకంపంవల్ల తీవ్రంగా నష్టపోయిన లాగువైరా రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఎటుచూసినా శిథిలాల దిబ్బలే కనిపిస్తున్నాయి. సహాయ చర్యలకు భారీ క్రేన్లు రావడానికి తీవ్ర ఆటంకాలు ఉన్నాయి.

భూకంపంలో జాడ తెలియకుండా పోయినవారి సంఖ్య 68,900గా ఉంటుందని ప్రభుత్వ వర్గాలు ప్రాథమికంగా పేర్కొన్నాయి. వీరంతా బహుశా శిథిలాల అడుగున ఉండిపోయి ప్రాణాలకోసం పోరాటం చేస్తూ ఉండి ఉంటారని, వారిని త్వరలోనే వెలికి తీస్తామని, ప్రభుత్వం సమగ్ర సహాయ చర్యలు చేపడుతోందని తాత్కాలిక అధ్యక్షురాలు రోడ్రిగ్జ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక నష్టాన్ని జిడిపిలో ఆరుశాతంగా అంచనా వేశారు. కరెన్సీలో చూస్తే ఈ నష్టం 6.70 బిలియన్ డాలర్ల మేరకు ఉంటుందని అంచనా. ఒక ప్రాంతంలో శిథిలాలల నుండి మూలుగులు వినిపించడంతో గుర్తించిన బంధువులు ఆ ప్రాంతం అంతటా తవ్వకాలు చేస్తున్నారు. తమ ప్రియతములైన బంధువుల కోసం కుటుంబీకులు శిథిలాల్లోనే తిరుగాడుతున్నారు.

విమానాశ్రయాలు, ఆసుపత్రులు వంటి మౌలిక సదుపాయాలకు భూకంపం వల్ల తీవ్ర నష్టం వాటిల్లింది. విదేశాల నుండి పెద్ద ఎత్తున విరాళాలు, వస్తువులు సహాయంగా తరలి వెళుతున్నాయి. సహాయ బృందాలు కూడా పెద్ద సంఖ్యలో విదేశాల నుండి కారకస్‌కు వెళ్ళి పనిచేస్తున్నారు. ఇప్పటికే 2000 మంది విదేశీ బృంద సభ్యులు ఈ శిథిలాలను తొలగించే పనుల్లో మునిగి ఉన్నారు. తీవ్రంగా దెబ్బతిని పాక్షికంగా పునరుద్ధరించిన ప్రధాన అంతర్జాతీయ విమానాశ్రయానికి విదేశాల నుండి సహాయ సామాగ్రి తరలి వస్తోంది. గడచిన బుధవారం సాయంత్రం సంభవించిన రెండు తీవ్ర భూకంపాలలో ఐదు రోజుల్లో 1500 సొగా మృతదేహాలను వెలికితీశారు. వెనిజులా చరిత్ర తలక్రిందులైంది. రాజకీయ సంక్షోభంలో ఉన్న వెనెజులా ఇప్పుడు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. భూకంపానికి ముందే వెనిజులా ఆర్థిక సంక్షోభంలో ఉంది.దేశం వెలుపల నివసిస్తున్న 80 లక్షలమంది వెనెజులా పౌరులు దేశంలో తమ ప్రియతముల జాడ తెలియక, వారితో సంప్రదించే అవకాశంలేక వారేమైపోయారో తెలియక తీవ్ర మానసిక క్షోభ అనుభవిస్తున్నారు. ఒక్క అమెరికాలోనే 12 లక్షలమంది వెనిజులా దేశీయులు నివసిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పోప్ తీవ్రంగా స్పందించారు. అంతర్జాతీయ ప్రపంచం వెనెజులాకు సంపూర్ణం సంఘీభావం ప్రకటించాలని పిలుపు ఇచ్చారు.

## జపాన్‌లో మళ్ళీ భూకంపం

ఈశాన్య జపాన్‌లో ఆదివారం తెల్లారుజామున భూకంపం వచ్చింది. రిచ్‌టర్ స్కేలుపై ఈ భూకంపం తీవ్రత 6.1 గా నమోదైనట్లు సంబంధిత వాతావరణ శాఖాధికారులు చెప్పారు.వెనిజులాల్లో భూకంపం వచ్చిన తర్వాత నాలుగు రోజులుగా వరుస భూకంపాలు వస్తున్నాయి. ఈ వరుసలో జపాన్‌ను తాకిన రెండో భూకంపం ఇదే. ఈసారి సునామీ హెచ్చరిక జారీ చేయలేదు. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించలేదు. దీనికి సమీపంలోనే గడచిన గురువారం 7.2 తీవ్రతతో భూకంపం వచ్చింది.

# హెజ్బొల్లా అణచివేతకు సిరియా పోరాటం: ట్రంప్

ఇజ్రాయెల్-లెబనాన్‌లో ఆందోళన



**వాషింగ్టన్:** హెజ్బొల్లాను అణచివేసేందుకు ట్రంప్ సిరియాను రెచ్చగొట్టారు. హెజ్బొల్లాను అణచివేయడంలో ఇజ్రాయెల్ కంటే సిరియా లో కొత్త ప్రభుత్వం ఉత్తమస్థాయిలో పని నిర్వహించగలదని ట్రంప్ అన్నారు. "హెజ్బొల్లాపై ఇజ్రాయెలీకు బదులుగా మీరు పోరాటం చేయండి" అని సిరియా కొత్త అధ్యక్షుడు అహ్మద్ అల్-షరాను ట్రంప్ కోరారు. జి-7 సమావేశం సందర్భంగా కూడా ట్రంప్ చూచాయగా ఇదే విషయాన్ని మొదటిసారి ప్రస్తావించారు. హెజ్బొల్లాపై నెతన్యాహూ పోరాటం చేయలేకపోతే సిరియా కొత్త ప్రభుత్వం పోరాటం చేస్తుందని అన్నారు. పశ్చిమాసియాలో ఇరాన్ పెంచిపోషిస్తున్న హమాస్,హెజ్బొల్లా సైన్యాలను తుడిచిపెట్టేయాలని, ఇజ్రాయెల్ ఆధిపత్యాన్ని స్థాపించాలని ట్రంప్ గట్టి పట్టుదలతో ఉన్నారు. ఈ లక్ష్యంలో భాగంగానే గడచిన శుక్రవారం (జూన్ 26) వాషింగ్టన్ వేదికగా ఇజ్రాయెల్-లెబనాన్ రాయబారులతో జరిగిన చర్చల్లో ఒక ఎంఓయుపై సంతకాలు చేయించారు. ట్రంప్ తరఫున ఈ సమావేశంలో మధ్యవర్తిగా విదేశాంగమంత్రి మార్కో రుబియో కీలకపాత్ర నిర్వహించారు. 14 అంశాలతో కుదిరిన ఈ మధ్యంతర ఎంఓయులో హెజ్బొల్లాను నిరాయుధులను చేయడం, నిర్మూలించడమే ప్రధాన లక్ష్యంగా నిర్దేశించారు. సిరియా నియంత బషర్ అస్సాద్ ప్రభుత్వాన్ని ఏడాదిన్నరక్రితం కూల్చివేసి ప్రత్యామ్నా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఇస్లామిస్టు నాయకత్వానికి దిగ్విజయంగా ఉగ్రవాదులే ఈ ప్రాంతంలో ఇజ్రాయెల్ కంటే అత్యుత్తమంగా ఇరాన్ పెంచి పోషిస్తున్న హెజ్బొల్లాపై పోరాటం చేసి తరిమి కొట్టగలదని ,సిరియా పాలకులే సరైన ప్రత్యామ్నాయమని చెప్పడం ద్వారా ట్రంప్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేశారు. ట్రంప్ చేసిన ఈ ప్రతిపాదన అటు ఇజ్రాయెల్‌కు, ఇటు లెబనాన్‌కు కూడా తీవ్ర ఆందోళన కలిగించింది.

## లెబనాన్‌తో ఎంఓయు చరిత్రాత్మకం

అమెరికా మధ్యవర్తిగా లెబనాన్‌తో కుదిరిన తాత్కాలిక ఒప్పందం (ఎంఓయు) చరిత్రాత్మకమైనదని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ ప్రశంసించారు. ఈ ఒప్పందం ఇరాన్‌కు ఒక చావుదెబ్బ అన్నారు. ఇక లెబనాన్‌లో హెజ్బొల్లాకు ఎలాంటి పాత్రాలేదని ఈ ఎంఓయు చాలా స్పష్టంగా తేల్చి చెప్పిందన్నారు. లెబనాన్-ఇజ్రాయెల్ మధ్య ద్వైపాక్షిక సంఘర్షణను ముగించే దిశగా పురోగతి సాధించడంతోపాటు రెండు దేశాలమధ్యా శాశ్వత శాంతి ఒప్పందం కుదరడానికి అవకాశం కల్పిస్తోందన్నారు. ఈ ఎంఓయు అటు ఇరాన్‌కు, ఇటు హెజ్బొల్లాకు కూడా చావు దెబ్బ అని ఆదివారం ఒక ప్రకటనలో చెప్పారు. ఈ ఒప్పందంలో భాగంగా రెండు దిన్ల ప్రాంతాల నుండి వైదొలగిన వాటిని లెబనాన్‌కు అప్పగిస్తున్నామని నెతన్యాహూ అంగీకరించారు.

ఇజ్రాయెల్ భద్రత నిమిత్తం లెబనాన్‌లో ఒక సెక్యూరిటీ జోన్‌ను కావాల్సినంతకాలం తమ వద్ద ఉంచుకోవడానికి లెబనాన్ ఈ ఒప్పందంలో అంగీకరించిందని చెప్పారు. హెజ్బొల్లా, ఇతర ఉగ్రవాద గ్రూపుల అంతమయ్యే వరకూ, లెబనాన్ నుండి ముప్పు లేనంతవరకూ ఈ సెక్యూరిటీ జోన్‌ను తమ ఆధీనంలో ఉంచుకుంటామని నెతన్యాహూ స్పష్టం చేశారు. దక్షిణ లెబనాన్ నుండి వైదొలగాలని ఇరాన్ డిమాండ్ చేస్తున్నప్పటికీ తాము ప్రతిపాదించి నిలదొక్కుకున్నామని చెప్పారు. ఈ విషయం [illegible] రు."ఇక్కడ నీకు ఎలాంటి ప్రమేయం లేదు, ఇది నీకు సంబంధించిన ఒప్పందం కాదు, ఇది నీకు సంబంధించిన విషయం కాదు, ఇక్కడ నీకు-హెజ్బొల్లాకు ఎలాంటి హోదా, ఎలాంటి పాత్రాలేదు" అని ఈ ఒప్పందం ద్వారా అమెరికా,ఇజ్రాయెల్,లెబనాన్ తెలియజేశాయని చెప్పారు. కాగా హెజ్బొల్లా ప్రధాన నాయకుడు క్వాస్సెమ్ స్పందిస్తూ, ఈ ఎంఓయు లెబనాన్‌లో ఇజ్రాయెల్ దురాక్రమణను చట్టబద్ధం చేయడమే అవుతుందని హెచ్చరించారు. ఇదిలా ఉండగా, లెబనాన్‌లో జరిగిన దాడుల్లో మరో ఇద్దరు మరణించారు. ఒక ఇజ్రాయెలీ సైనికులు కూడా మరణించాడు.

# ఫ్రాన్స్ వడగాలుల్లో 1000కిపైగా మృతులు

ఇక తూర్పు యూరప్‌కు మళ్ళిన వేడి



**పారిస్:** ఫ్రాన్స్‌లో వడగాలుల కారణంగా మరణించినవారి సంఖ్య 1000 దాటినట్లు ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వశాఖ ఆదివారం ప్రకటించింది. పశ్చిమ యూరప్ దేశాలను కొద్దిరోజులుగా వడగాలులు పట్టి పీడిస్తున్నాయి. అనేక యూరప్ దేశాలలో రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజల నిత్య జీవనానికి తీవ్ర విఘాతం కలిగింది. ఇక ఈ వడగాలులు ఇప్పుడు తూర్పు యూరప్ ప్రాంతాలవైపు వెళ్ళినట్లు వాతావరణశాఖాధికారులు చెప్పారు. ఈ అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఫ్రాన్స్ దేశ ప్రజలు నష్టపోయారు. ఫ్రాన్స్‌లోనే ఎక్కువగా వడగాలి మరణాలు సంభవించాయి. మరణించిన వారిలో 85 శాతం మంది 65 లేదా ఆ పైబడిన వయసుగలవారే ఉన్నారు.ముఖ్యంగా పారిస్, దాని శివారున ఉన్న ఇలేడి ప్రాంతాలలో ప్రజలు వడగాలుల బారిన పడ్డారు. అనేక రోజులపాటు తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదైన తర్వాత ఆదివారంనాటికి ఈ వేడి తీవ్రత తగ్గుముఖం పట్టింది. ఇదిలా ఉండగా, పశ్చిమ యూరప్‌లో వేడిగాలులు ఇప్పుడు తూర్పు యూరప్ వైపు తరలి వెళ్ళాయని శాస్త్రవేత్తలు చెప్పారు. యూరప్‌లో అత్యధికంగా 44 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతల వరకూ నమోదయ్యాయి. బ్రిటన్‌లో 37 కంటే ఎక్కువగా ఉష్ణోగ్రత నమోదుకాగా, జెకొస్లొవేకియాలో 39 డిగ్రీలు, స్విట్జర్లాండ్‌లో 40 డిగ్రీల మేరకు నమోదయ్యాయి.

# సెర్బియా అధ్యక్ష పదవికి ముందస్తు ఎన్నికలు

రెండువారాలే అధికారంలో ఉంటానని వుసిచ్ ప్రకటన



**బెల్గ్రేడ్:** ఆగ్నేయ-సెంట్రల్ యూరప్ దేశం రిపబ్లిక్ ఆఫ్ సెర్బి యా అధ్యక్షుడు అలెగ్జాండర్ వుసిచ్ పదవికి రాజీనామా చేస్తానన్నారు. నిర్ణీత ప్రకారం సెర్బియాలో అధ్యక్ష పదవికి 2027 మే నెలలో ఎన్నికలు జరగాల్సి ఉండగా, రెండు వారాలు మాత్రమే తాను అధ్యక్ష పదవిలో ఉంటానని, తర్వాత రాజీనా మా చేస్తానని వుసిచ్ ఆదివారం ప్రకటించారు. తాము గతంకంటే భారీ మెజార్టీతో ఈసారి గెలుస్తామని ఆయన ధీమా వ్య క్తం చేశారు. ఆయన ముందస్తు ఎన్నికలకు వెళ్ళాలని గట్టిగా నిర్దేశించుకున్నారు. 14 సంవత్సరాల క్రితం వుసిచ్ పాపులర్ పార్టీని అధికారంలోకి తెచ్చారు. అప్పటినుండీ ఆయన అధ్యక్ష పదవిలో కొనసాగుతూ అధికారంపై, అన్ని రంగాలపై తన ప ట్టు బిగించారు. దేశంలో యువకులు నెలల తరబడి చేసిన నిరసన ప్రదర్శనల నేపథ్యంలో ఆయన రాజీనామా ప్రకటన చేశారు. నోవిసాద్ రైల్వే స్టేషన్‌లో 2024 నవంబరులో జరిగిన దుర్ఘటనలో 16 మంది మరణించారు. దీంతో అప్పటినుండీ విద్యార్థులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. దేశాధ్యక్షుడు రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. నెలల తరబడి జరిగిన ఈ ఉద్యమంలో వేలు,లక్షలమంది పాల్గొన్నారు.ప్రధానం గా సెర్బియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ ఉద్యమం జ రిగింది. ఈ ఉద్యమకారులపట్ల అధ్యక్షుడు వుసిచ్ కఠిన వైఖరి అవలంబించారు.విద్యార్థులను పదే పదే ఆయన విదేశీ ఏజం ట్లు అని పిలిచారు. దేశంలో విభజనలు రెచ్చగొడుతున్నారని, ప్రభుత్వాన్ని కూల్చివేయాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులను బలప్రయోగంతో అరెస్టులు చేశారు. ఈ పరిస్థితులే ఆయన రాజీనామా ప్రకటనకు దారితీశాయి.

# కుప్పకూలిన ఫ్రాన్స్ విమానం, సౌదీ హెలికాప్టర్

వేర్వేరు ప్రమాదాల్లో 25 మంది దుర్మరణం





**పారిస్/రాస్‌తనూర:** యూరప్-పశ్చిమాసియాలలో ఆదివారం జరిగిన రెండు వేర్వేరు గగనయాన ప్రమాదాలలో మొత్తం 25 మంది మరణించారు. ఫ్రాన్స్ ఈశాన్య ప్రాంతంలో ఒక విమా నం కూలిపోవడంతో అందులో ప్ర యాణం చేస్తున్న 11 మంది స్కై డైవ ర్స్ మరణించారు. సౌదీ అరేబియా రాస్ తనూరా పట్టణంలో ఒక హెలికాప్టర్ నేల కూలిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న 14 మంది దుర్మరణం చెందారు. సౌదీ ప్రెస్ ఏజన్సీ సమాచా రం ప్రకారం రాస్ తనూరా పట్టణంలో హెలికాప్టర్ ఎందుకు కూలిపోయిందో పూర్తి సమాచారం తెలియరాలేదు. ఈ విషయంపై ముమ్మరంగా దర్యాప్తు కొనసాగుతోంది. ఫ్రాన్స్ ఈశాన్యప్రాంతం తోంబ్లైన్ పట్టణంలో పౌర విమానం కూలిపోయింది. ఈ ప్రమాదంలో 11 మంది మరణించారు. పూర్తి వివరాలు తెలియరాలేదు.

# ఆరోగ్యమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

సూపర్‌వైజర్లను, 8,393 ఎ ఎన్ ఎంలను, ఆశా కార్యకర్తలను, 27,181, అంగన్వాడి వర్కర్లను నియమించామని ఆయన వివరించారు. భారతదేశంలో చివరి పోలియో కేసు 13 జనవరి 2011న గుర్తించారని, అనంతరం 2012లో పోలియో వ్యాధి ప్రబల దేశాల జాబితా నుండి భారతదేశా న్ని తొలగించారని, 2014 మార్చి 27న ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూహెచ్ఓ నుండి పోలియో రహిత దేశంగా ధ్రువీకరణ పత్రం అందుకున్నామని మంత్రి గుర్తు చేశారు. పోలియో లేదనే భావన ఉండకూడదని , వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే పల్స్ పోలి యో కార్యక్రమంలో చిన్నారులకు తప్పక పోలి యో చుక్కలు వేయించాలని సూచించారు. హైదరాబాద్ జిల్లాలో 5 లక్షల పైగా ఉన్న చిన్నారులకు తల్లిదండ్రులు తప్పక పోలియో చుక్కలు వేయించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేశారు. పోలియో వల్ల కలిగే నష్టాలు, అంగ వైకల్యం పైన తల్లిదండ్రులకు అవగాహన ఉండాలని వివరించారు.

ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా, డైరెక్టర్ మెడికల్ అండ్ హెల్త్ డాక్టర్ రవీంద్ర నాయక్, అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ డాక్టర్ కె. పద్మజ ,జాయింట్ డైరెక్టర్ చైల్డ్ హెల్త్ డాక్టర్ విజయ నిర్మల , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రీధర్, డాక్టర్ సాయిబాబా, డాక్టర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# 'కాళేశ్వరాన్ని ఎటిఎంలా వాడుకున్న బిఆర్‌ఎస్

ఆ అవినీతిని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్న ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం

బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరాన్ని ఏటిఎంలా వాడుకుని అవినీతికి పాల్పడితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ అవినీతిని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తోందని బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఆరోపించారు. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆదివారం 'బూత్ అధ్యక్షుల సమ్మేళనం'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావులతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బూత్ అధ్యక్షులు, సీనియర్ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన 2 లక్షల ఉద్యోగాల హామీని నెరవేర్చకుండా యువతను మోసం చేసిందని విమర్శించారు. ప్రజలు మార్పు కోసం కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే, ఆ పార్టీ పాత రాజకీయ సంస్కృతినే కొనసాగిస్తోందని విమర్శించారు. అధికారంలోకి రావడానికి హామీలు ఇచ్చి, ఇప్పుడు అమలు చేయడం లేదన్నారు. తెలంగాణను అవినీతి, కుటుంబ రాజకీయాల బంధనాల నుంచి విముక్తి చేసి, అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపైనే ఉందన్నారు. తెలంగాణలో బిజెపి ప్రత్యామ్నాయ శక్తిగా వేగంగా ఎదుగుతోందని ఆనందం వ్యక్తం చేశారు. పార్టీకి అసలైన బలం కార్యకర్తలేనని కొనియాడారు. 1984 లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బిజెపికి ఇద్దరు ఎంపిలు గెలిస్తే, అందులో ఒకరు తెలంగాణ నుంచే ఎన్నికయ్యారని, తెలంగాణతో తమకు విడదీయరాని బంధం ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పార్లమెంట్‌లో గళం విప్పిన 'చిన్నమ్మ' సుష్మా స్వరాజ్ కృషిని స్మరించుకున్నారు. రాబోయే జిహెచ్‌ఎంసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు మూడు ముఖ్య సంకల్పాలు (ఇంటింటికీ కేంద్ర పథకాల ప్రచారం, ఓటరు నమోదు, లబ్ధిదారుల సంప్రదింపులు) చేయాలని పిలుపునిచ్చారు.

దొంగ ఓట్లను నిర్మూలించాలి : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మూడు రాష్ట్రాలతో పాటు పశ్చిమ బెంగాల్లోనూ బిజెపి చారిత్రాత్మక విజయం సాధించిందన్నారు. పాతబస్తీలో మజ్లిస్ పెత్తనాన్ని, కాంగ్రెస్, బిఆర్‌ఎస్ లాలూచీ రాజకీయాన్ని అంతం చేయాలంటే తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రావాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ పోలీస్ బదిలీల నిర్ణయాలు దారుస్సలాం నుంచే వస్తున్నాయని ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్, బిఆర్‌ఎస్, ఎంఐఎంలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. నిజమైన భారతీయ పౌరులు ఎవరూ ఓటు హక్కు కోల్పోకుండా, ఇతర ప్రాంతాల వారు కూడా ఇక్కడే ఓటు నమోదు చేసుకునేలా బిజెపి కార్యకర్తలు బూత్ స్థాయిలో శ్రమించాలన్నారు.

## హైదరాబాద్ బిజెపి అడ్డా : ఎన్. రామచందర్ రావు

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు మాట్లాడుతూ బిఆర్‌ఎస్, కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా హైదరాబాద్ ఎప్పటికీ బిజెపి అడ్డానే అని అన్నారు. జిహెచ్‌ఎంసి, సైబరాబాద్, మల్కాజిగిరి ప్రాంతాలను సిఎం రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ అడ్డాలుగా మార్చేశారని విమర్శించారు. నగరంలో చిన్న వాన పడినా రోడ్లు జలమయమై, ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వానికి పట్టింపు లేదన్నారు. మజ్లిస్ పార్టీ అక్రమ ఓట్లతో హైదరాబాద్‌ను కైవసం చేసుకోవాలని చూస్తోందని, ఆ పన్నాగాన్ని బూత్ స్థాయి కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాబోయే మూడు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కమలం జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# విరుచుకుపడిన ఇరాన్

(మొదటి పేజీ తరువాయి)

తెల్లవారుజామున ఒక ప్రకటన చేస్తూ, అమెరికా సైనిక దురాక్రమణకు వ్యతిరేకంగా ఇరాన్ నౌకా-వైమానిక దళాలు సంయుక్తంగా తెల్లవారుజామున రెండు గంటల నుండి డ్రోన్ ఆపరేషన్లు నిర్వహించాయని పేర్కొంది.కువైట్‌లోని అలీ అల్-సలేం వైమానిక స్థావరం, బహ్రైన్‌లో ఉన్న అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్ కార్యాలయంతోపాటు అమెరికాకు చెందిన ఎనిమిది సైనిక మౌలిక సదుపాయయాలపై బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో ప్రతిఘటన దాడులు చేసినట్లు ఐఆర్‌జిసి ప్రకటించింది.ఈ దాడులతో అంతర్జాతీయ విమానాశ్రయం సమీపలో నివాసిత భవనాలు ధ్వంసమైనట్లు బహ్రైన్ హోంశాఖ ప్రకటించింది. అమెరికాతో చర్చలు నిలిపివేస్తామని ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ ప్రభుత్వం ఆదివారం హెచ్చరిక జారీ చేసింది. అదేవిధంగా ట్రంప్ కూడా సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన చేస్తూ, ఇరాన్ దాడులకు ప్రతిగా తాము దాడులు చేయాల్సి వచ్చిందని, ఇదే పరిస్థితి కొనసాగితే ఇరాన్ ఉనికిలో లేకుండా పోతుందని హెచ్చరించారు. ''ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించినందుకు మనం హేతుబద్ధంగా ఆలోచించలేని పరిస్థితి రావచ్చు, ఇన్నాళ్ళూ విజయవంతంగా నిర్వహించిన ఈ పనిని ఇకమీదట సైనిక చర్యతో పూర్తి చేయాల్సి రావచ్చు'' అని రాశారు. ఇరాన్‌ను సంప్రదించకుండా ఆ దేశాన్ని నిర్లక్ష్యం చేసి ఒమన్ సమీపంలో ప్రత్యామ్నాయ రాకపోకల దారుల ద్వారా హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు చేసిన ప్రయత్నాలే ఈ పరస్పర దాడులకు ప్రధాన కారణం. యుద్ధం తర్వాత కూడా ఈ జలసంధి తమ అధీనంలోనే ఉండాలని ఇరాన్ పట్టుపడుతోంది. ప్రపంచవ్యాప్తంగా రవాణా అయ్యే 20 శాతం చమురు ఈ జలసంధి మీదుగానే రవాణా అవుతుంది. ఈ నౌకలపై నిర్వహణా ఫీజులు వసూలు చేస్తామని ఇరాన్ చెబుతుండగా, ఇది ప్రపంచ ఉమ్మడి ఆస్తి అనీ, ఇది శాశ్వతంగా ఎలాంటి ఆంక్షలూ,ఫీజులు లేని ఉచిత,స్వేచ్ఛా వాణిజ్యమార్గంగా ఉండాలని అమెరికా డిమాండ్ చేస్తున్నది. 107 రోజులపాటు కొనసాగిన యుద్ధాన్ని ముగించేందుకు ఉద్దేశించిన తుది విడత ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు 60 రోజులపాటు జరిగే చర్చల నిమిత్తం ఒక బృహత్తర ప్రణాళికను స్విట్జర్లాండ్‌లో 18 గంటలపాటు జరిగిన చర్చల్లో అమెరికా-ఇరాన్ ప్రతినిధులు ఖరారు చేశారు. ఐతే ఈ చర్చల ప్రక్రియను ఆపేస్తామని ఇరాన్ తాజా హెచ్చరిక చేసింది. ఇదిలా ఉండగా హోర్ముజ్ జలసంధిలో కొత్త మార్గాలలో నౌకల రాకపోకలపై వివాదం సమసిపోలేదు. రాబోయే నెలరోజులపాటు ఇరాన్ మాత్రమే హోర్ముజ్ జలసంధిని నిర్వహిస్తుందని, ''ఇస్లామాబాద్ ఒప్పందం'' ప్రకారం హోర్ముజ్ జలసంధిని నిర్వహించే బాధ్యత తమదేనని గుర్తుచేశారు. ఈ ఒప్పందాలను ఉల్లంఘించినట్లు రుజువైన నౌకలపై భవిష్యత్తులో మరిన్ని కఠినమైన చర్యలు తీసుకుంటామని ఐఆర్‌జిసి హెచ్చరించింది. కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన అనేది ఒప్పందంలోని మొదటి నిబంధనను ఉల్లంఘించినట్లేనని, దీనివల్ల ఒప్పందంలో పేర్కొన్న మిగిలిన ప్రక్రియ కూడా నిలిచిపోతుందని గుర్తుచేసింది.

## ఒప్పందంమీద అమెరికాకు గౌరవం లేదు

''ఇస్లామాబాద్ ఒప్పందం'' మీద అమెరికాకు కనీస గౌరవం లేదని ఇరాన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించింది. దక్షిణ ఇరాన్ తీర ప్రాంతంలో పలు నిఘా-పర్యవేక్షణ కేంద్రాలు లక్ష్యంగా అమెరికా చేసిన క్రూరమైన దాడులను తీవ్రంగా ఖండించింది. ఒప్పందం ప్రకారం పాటించాల్సిన కట్టుబాట్ల పట్ల అమెరికా పాలకులకు ఎంతమాత్రం గౌరవం లేదని విమర్శించింది. దేశాల ప్రాదేశిక సమగ్రత, రాజకీయ స్వాతంత్ర్యాలకు వ్యతిరేకంగా దాడులను నిషేధించే ఐక్యరాజ్యసమితి ఛార్టర్ పేర్కొన్న 24వ అధికరణను స్పష్టంగా అమెరికా ఉల్లంఘించిందని పేర్కొంది. అంతర్జాతీయ శాంతి భద్రతలను పరిరక్షించడంలో తమకున్న బాధ్యతలను నిర్వర్తించాలని ఐక్యరాజ్యసమితి భద్రతామండలికి,సమితి ప్రధాన కార్యదర్శికి ఇరాన్ విదేశాంగశాఖ విజ్ఞప్తి చేసింది. ఐక్యరాజ్యసమితి ఛార్టర్ 51వ అధికరణలో ఉన్న స్వీయ రక్షణ,సహజ హక్కుల రక్షణలను ఉటంకిస్తూ, తమ ప్రాదేశిక సమగ్రతను కాపాడుకుంటామన్న సంకల్పాన్ని ఉద్ఘాటించింది.

## జులై 4-9 తేదీల్లో ఖమేనీ అంత్యక్రియలు

అమెరికా దాడుల్లో హతుడైన ఇరాన్ సర్వాధినేత అలీ హుస్సేన్ అలీ ఖమేనీ (87) అంత్యక్రియల కార్యక్రమాలు జులై నాలుగో తేదీ నుండి 9వ తేదీ వరకూ కొనసాగుతాయి. తొమ్మిదో తేదీన ఆయన స్వస్థలంలో ఖనన కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ లోపు రాజధాని టెహ్రాన్ సహా ముఖ్య నగరాలలో ఊరేగింపులు,నివాళుల కార్యక్రమాలు కొనసాగుతాయి. ఐఆర్‌జిసి టెహ్రాన్ కమాండర్ హసన్ హసన్‌జాదే ఈ వివరాలు వెల్లడించారు. జులై 4,5 తేదీలలో టెహ్రాన్‌లో నివాళులు,అంతిమ ఊరేగింపు ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఫిబ్రవరి 28న అమెరికా చేసిన దాడిలో ఖమేనీతోపాటు ఆయన భార్య,అల్లుడు,కుమార్తె,మనుమరాలు సహా అనేకమంది కమాండర్లు,సాధారణ పౌరులు,ముఖ్యులు మరణించారు. దీనికి ప్రతీకారంగా 100 ప్రాంతాలలో ఇజ్రాయెల్ దళాలు విజయవంతంగా ప్రతీకార దాడులు చేసింది. ఆ తర్వాత ఏప్రిల్ 7వ తేదీన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటించారు.

# వాంగ్‌చుక్ నిరాహారదీక్ష

(మొదటి పేజీ తరువాయి)

యువత ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పుడు తాను మౌనంగా ఉండలేనని పేర్కొన్నారు. 'నేను ఇక్కడ కూర్చోవాల్సిన పరిస్థితి కల్పించబడింది, సంతోషంతో దీన్ని చేయడం లేదు. ఈ రెండు అంశాలకు మద్దతుగా నేను దీక్ష చేస్తున్నాను. లఢాఖ్‌లో ఉద్యమం చేస్తున్న మీరు ఇప్పుడు సిజెపితో ఎందుకు ఉన్నారని చాలా మంది నన్ను అడుగుతుంటారు. ఇక్కడ ప్రధాన అంశమైన 'విద్య' అనేది నేను విద్యార్థిగా ఉన్నప్పటి నుండి, అంటే గత 40 ఏళ్లుగా నా హృదయానికి చాలా దగ్గరగా ఉంది' అని ఆయన అన్నారు. 'నేను ఇంజనీరింగ్ చదివాను, కానీ ఎప్పుడూ ఉద్యోగం చేయలేదు; ఎందుకంటే అన్ని తరాల భవిష్యత్తుకు విద్యే కీలకమని నేను భావించాను. విద్యా విధానంలోని సమస్యలపై కొంతమంది యువత గళం విప్పుతున్నప్పుడు, నేను ఎలా మౌనంగా ఉండగలను? వారికి మద్దతు ఇవ్వడం నాకు సహజమైన చర్య' అని వాంగ్‌చుక్ పేర్కొన్నారు. విద్యను ఉపయోగించి పిల్లల జీవితాలను తీర్చిదిద్దడం, దేశానికి దిశానిర్దేశం చేయడంపై దృష్టి సారించాలని ఆయన అన్నారు. లఢాఖ్‌లో తాను చేస్తున్న కృషిని ప్రస్తావిస్తూ, ఆ ప్రాంతం నుండి ఉద్భవించే నీటిపై కోట్లాది మంది ప్రజలు ఆధారపడి ఉన్నందున హిమాలయాలను రక్షించడం అందరి బాధ్యత అని వాంగ్‌చుక్ అన్నారు. జవాబుదారీతనం లేనప్పుడు, ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసన మాత్రమే ఏకైక మార్గమని వాంగ్‌చుక్ అన్నారు. ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ చాలా మంది యువకులు నిరాహార దీక్షలు చేస్తున్నారని చెబుతూ, ఆయన నిరసనకారులను ప్రశంసించారు. దీనిని ఒక సామూహిక నిరాహార దీక్షగా మార్చి, కనీసం ఒక రోజైనా ఉపవాసం పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

హింసాత్మకంగా మారిన లఢాఖ్ రాష్ట్ర సాధన నిరసనలో పాల్గొన్నందుకు, వాంగ్‌చుక్‌ను జాతీయ భద్రతా చట్టం కింద దాదాపు ఆరు నెలల పాటు నిర్బంధంలో ఉంచి, 2026 మార్చిలో జోధ్‌పూర్ జైలు నుండి విడుదల చేశారు. అంతకుముందు, సిజెపి వ్యవస్థాపకుడు దీప్కే రైతులు, విద్యార్థులు, సంస్థలు ఈ నిరసనలో చేరి, జవాబుదారీతనం కోసం చేస్తున్న పిలుపుకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఉదయం, ఆయన ఎక్స్ ఛానెల్‌లో మాట్లాడుతూ, జంతర్ మంతర్‌కు చేరుకోకుండా నిరోధించడానికి ఉత్తర ప్రదేశ్, హర్యానా, పంజాబ్‌లకు చెందిన పలువురు రైతు నాయకులను గృహ నిర్బంధంలో ఉంచుతున్నారని మండిపడ్డారు. కాగా, సర్వ్ ఖాప్ పంచాయత్ ప్రతినిధులు కూ డా ఈ నిరసనలో పాల్గొన్నారు. ఖాప్ ప్రతినిధు లు దీప్కేకు తలపాగా కట్టారు, ఈ చర్య అతనికి బాధ్యతను అప్పగించడాన్ని సూచిస్తుందని కోఆర్డినేటర్ ఓంప్రకాష్ ధంకర్ అన్నారు. 'ఈ తలపాగా ఒక బాధ్యత. దీనితో, మేము అతనికి బాధ్యతను అప్పగిస్తున్నాము' అని ధంకర్ అన్నారు. సుమారు 500 మంది రైతు నాయకులను, సంఘాల సభ్యులను ఢిల్లీకి రాకుండా అడ్డుకున్నారని ఖాప్ ప్రతినిధులు ఆరోపించారు. ప్రధాన్ సొంత రాష్ట్రమైన ఒడిశాకు చెందిన రైతు నాయకుడు అక్షయ్ కుమార్, మంత్రి రాజీనామా చేయకపోతే రాజకీయ పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు.

# టీచర్ పోస్టుల భర్తీ

(మొదటి పేజీ తరువాయి)

ఎస్‌సిఇఆర్‌టి పోస్టుల ఖాళీతో విద్యార్థులకు, ఉపాధ్యాయ శిక్షణ కోర్సులకు తీవ్ర అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో అకడమిక్ కార్యక్రమాలు నిరంతరాయంగా సాగేందుకు వీలుగా పలు పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతినిచ్చింది. అయితే డిప్యూటేషన్‌పైన ఎంపికైన వారు తమ ప్రస్తుత వేతనం, అలవెన్సులను మాత్రమే పొందుతారు. వారికి ఎటువంటి సీనియారిటీ లేదా రెగ్యులరైజేషన్ హక్కులు వర్తించబోవని పాఠశాల విద్యాశాఖ నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. అయితే ప్రస్తుతం ఆయా సంస్థల్లో కొనసాగుతున్న పాత డెప్యుటేషన్లన్నీ రద్దవుతాయి. మరిన్ని పూర్తి వివరాలు, సిలబస్ కోసం విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ https://schooledu.telangana.gov.in ను సందర్శించాలని పాఠశాల విద్యాశాఖ సూచించింది.

**సర్వీస్\యస్సు:** అభ్యర్థులు జూన్ 30,2026 నాటికి కనీసం 5 సంవత్సరాల రెగ్యులర్ సర్వీస్ పూర్తి చేసి ఉండాలి. వయస్సు 58 సంవత్సరాలు దాటకూడదు. సంబంధిత సబ్జెక్టులో 55శాతం మార్కులతో పిజి, అలాగే 55 శాతం మార్కులతో ఎంఇడి ఉత్తీర్ణులై ఉండాలి. (ఎస్‌సి, ఎస్‌టి, బిసి, దివ్యాంగులకు 50 మార్కులు ఉంటే సరిపోతుంది). కాగా డిఇఇటి పోస్టులకు ఉమ్మడి జిల్లా స్థానికత ఉండాలి. సిటిఇ,ఐఎఎస్ఇ పోస్టులకు సంబంధిత మల్టీజోన్ అభ్యర్థులు, ఎస్‌సిఇఆర్‌టి పోస్టులకు రాష్ట్రంలోని ఏ జిల్లా వారైనా దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 100 మార్కులకు గాను ఎంపిక ప్రక్రియ ఉంటుంది. ఇందులో కంప్యూటర్ ఆధారిత పరీక్షకు (సిబిటి) 80 మార్కులు, వ్యక్తిగత ఇంటర్వ్యూ కమ్ డెమోన్‌స్ట్రేషన్‌కు 20 మార్కులను కేటాయించారు.

జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలు ఇంటర్వ్యూల నిర్వహణ నిమ్మితం డిఇఇటి, సిటిఇ,ఐఎఎస్ఇ పోస్టులకు జిల్లా కలెక్టర్ ఛైర్‌పర్సన్‌గా, జిల్లా విద్యాశాఖాధికారి (డిఇఒ) మెంబర్ కన్వీనర్‌గా జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో డిఇఒ ఆయా విద్యాసంస్థల ప్రిన్సిపల్, జిల్లా కలెక్టర్ నామినేట్ చేసిన వ్యక్తి, డిఇఒల ద్వారా నియమితులైన రెండు సబ్జెక్టులలో ఎక్స్‌పర్ట్, మరో ఇద్దరు ప్రొఫెసర్లు. అలాగే ఎస్‌సిఇఆర్‌టి పోస్టులకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఛైర్ పర్సన్‌గా రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. సభ్యులుగా కోఆర్డినేషన్ అదనపు డైరెక్టర్, ఐఎఎస్ఇ ప్రిన్సిపల్, ఇద్దరు ప్రొఫెసర్లు.

**సంస్థల వారీగా ఖాళీలు ఇవే.. (మొత్తం: 202)**

డిఇఇటిఇ(జిల్లా విద్యాశిక్షణ సంస్థలు) 131
సిటిఇ (సార్వత్రిక విద్యా కళాశాలలు) 36
ఐఎఎస్ఇ(ఉన్నత విద్యా అధ్యయన సంస్థ) 17 ఖాళీలు
ఎస్‌సిఇఆర్‌టి(రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి)16 ఖాళీలు

**నోటిఫికేషన్**

ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ జూలై 4 నుండి 14వ తేదీ వరకు.
దరఖాస్తుల సవరణ (ఎడిట్ ఆప్షన్): జూలై 17.
ఆన్‌లైన్ రాత పరీక్ష (సిబిటి) జూలై 25 నుండి 31 వరకు (హైదరాబాద్‌లో).
ఇంటర్వ్యూ, డెమోన్‌స్ట్రేషన్ ఆగస్టు 6 నుండి 8వ తేదీ వరకు .
డిప్యూటేషన్ ఉత్తర్వులు ఆగస్టు 10.

# రేపటి నుంచే నాకౌట్.. 32వ రౌండ్‌లో 32 జట్లు

## సందడిగా ఫిఫా వరల్డ్ కప్



ఆద్యంతం సందడిగా సాగుతున్న ఫిఫా వరల్డ్ కప్ 2026లో గ్రూప్ దశ ముగిసింది. 32వ రౌండ్లో చివరి రెండు స్థానాలు ఖరారవ్వడంతో నాకౌట్ మ్యాచ్‌లకు తెరలేవనుంది. 13 గ్రూప్‌ల నుంచి నాకౌట్‌కు అర్హత సాధించిన 32 జట్లు హోరాహోరీ పోరాటాలకు సిద్ధమవుతున్నాయి. జూన్29 సోమవారం కెనడా, దక్షిణాఫ్రికా మ్యాచ్‌తో 32వ రౌండ్ మొదలవ్వనుంది. లీగ్ దశలోనే రికార్డు గోల్స్‌తో అభిమానులను ఉర్రూతలూగించిన ఫిఫా వరల్డ్ కప్‌లో నాకౌట్ బెర్తులు ఖరారయ్యాయి. ఆఖరి గ్రూప్ మ్యాచ్‌లో నువ్వానేనా అన్నట్టు తలపడిన అల్జీరియా, ఆస్ట్రియాలు 3–3తో డ్రా చేసుకున్నాయి. దాంతో, ఇరుజట్లు 32వ రౌండ్‌కు అర్హత సాధించాయి. లీగ్ దశ పూర్తవ్వడంతో నాకౌట్ సమరానికి జూన్ 29తో తెరలేవనుంది. 12 గ్రూప్‌ల నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచినవి(24 జట్లు).. ఉత్తమ ర్యాంక్‌తో మూడో స్థానం సాధించిన 8 జట్లు.. కలిపి 32 టీమ్‌లు నాకౌట్ బరిలో ఉన్నాయి.

## జోర్డాన్‌పై అర్జెంటీనా గెలుపు

### ‘మరొక విజయంతో లీగ్ దశను ముగించా’..

### మెస్సీ పోస్ట్ వైరల్!

నాలుగేళ్ల క్రితం అర్జెంటీనాకు వరల్డ్ కప్ అందించిన లియోనల్ మెస్సీ ఈసారి మరింతగా రెచ్చిపోతున్నాడు. హ్యాట్రిక్ గోల్స్‌తో టోర్నీని ఆరంభించిన ఈ దిగ్గజం..ప్రతి మ్యాచ్‌లో మెరుస్తున్నాడు. జోర్డాన్‌పై అదిరే విజయం అనంతరం మెస్సీ ఇన్‌స్టాగ్రామ్‌లో ఆసక్తికర పోస్ట్ పెట్టాడు. ‘మరొక విజయంతో లీగ్ దశను ముగించాం. మేమంతా కలిసే ఉన్నాం ‘ అని అతడు పెట్టిన పోస్ట్ క్షణాల్లో వైరలైంది. డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా తిరుగులేని ఆటతో ఫిఫా వరల్డ్ కప్‌లో నాకౌట్‌కు దూసుకెళ్లింది. హ్యాట్రిక్ విజయాలతో జోరు మీదున్న మెస్సీ సేన 32వ రౌండ్‌లోనూ దూసుకెళ్లాలని భావిస్తోంది. తమ జట్టు నాకౌట్ బెర్తుతోనే సంబురపడిపోదని కెప్టెన్ మెస్సీ అంటున్నాడు. జోర్డాన్‌పై విజయం అనంతరం అతడు మరొక విజయంతో లీగ్ దశను ముగించాం’ అని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టాడు. అల్జీరియా హ్యాట్రిక్ గోల్స్‌తో తానేంటో చాటిన మెస్సీ.. మొత్తంగా 19 గోల్స్‌తో రికార్డు నెలకొల్పాడు. ఆరో ఎడిషన్ వరల్డ్ కప్ ఆడుతున్న ఈ లెజెండ్.. అత్యధిక గోల్స్ కొట్టిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. జూన్ 29 సోమవారం కెనడా, దక్షిణాఫ్రికా మ్యాచ్‌తో 32వ రౌండ్ మొదలవ్వనుంది. జూలై 4, శనివారం కాబొ వెర్డెను అర్జెంటీనా ఢీకొట్టనుంది.



## మహిళల టి20 సెమీస్‌లో వెస్టిండీస్



మహిళల టీ20 ప్రపంచకప్ నుంచి న్యూజిలాండ్ నిష్క్రమించింది. చివరి లీగ్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ చేతిలో భారీ ఓటమితో ఉసూరుమంటూ ఇంటిదారి పట్టింది వైట్ ఫెర్న్స్. డిఫెండింగ్ ఛాంపియన్‌గా లీగ్‌లో అడుగు పెట్టిన కివీస్.. పేలవమైన ప్రదర్శనతో వెనకబడింది. ఇంగ్లండ్‌తో గెలిస్తే ముందుకెళ్లే అవకాశమున్నా.. సమిష్టి వైఫల్యంతో వెస్టిండీస్‌కు మార్గాన్ని సుగమం చేసింది. కెన్నింగ్టన్ ఓవల్ మైదానంలో ఇంగ్లండ్ ధాటికి న్యూజిలాండ్ చేతులెత్తేసింది. 163 రన్స్ కొట్టినా మ్యాచ్‌ను కాపాడుకోలేక లీగ్ దశలోనే కివీస్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఓపెనర్లు మేలియా కేర్(42), ఇసబెల్లా గేజ్(28)లు దూకుడుగా ఆడి 70 రన్స్‌తో శుభారంభమిచ్చారు. కానీ, ఇంగ్లండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొని మిడిలార్డర్ పరుగులు చేయకపోవడంతో భారీస్కోర్ సాధ్యపడలేదు. ఇక ఛేదనలో అమీ జోన్స్(17) విఫలమైనా..డానీ వ్యాట్(89 నాటౌట్), సోఫియా డంక్లే(49)లుబౌండరీలతో చెలరేగి. వైట్ ఫెరన్స్ బౌలింగ్ దళానికి చుక్కలు చూపించిన ఈ ద్వయం 9 వికెట్లతో ఇంగ్లండ్‌ను గెలిపించింది. దాంతో.. గ్రూప్ బీ నుంచి సెమీస్ బెర్తులు ఖరారయ్యాయి. ఐదుకు ఐదు విజయాలతో ఇంగ్లండ్ నాకౌట్‌కు దూసుకెళ్లగా.. ఐర్లాండ్ చేతిలో ఓడినప్పటికీ వెస్టిండీస్ సెమీస్ బెర్తు దక్కించుకుంది. చావోరేవో మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఓడడం విండీస్‌కు కలిసొచ్చింది.

# ఆరోగ్యం



## కూనిరాగాలతో ఆరోగ్యం

అందరూ పాటలు పాడలేకపోతుండవచ్చు. కానీ, ఏదో ఒక సమయంలో కూనిరాగాలు తీయనివారు ఎవరూ ఉండరు. ఈ విధంగా పాడడం లేదా రాగాలు తీయడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని ఒక అధ్యయన ప్రాథమిక ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ విధంగా రాగాలు తీస్తున్నప్పుడు శరీరంతో నైట్రిక్ ఆక్సైడ్ స్థాయిలు భారీగా పెరిగి, ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావం చూపుతాయని అంటున్నారు. అయితే, ఈ భావన ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. నైట్రిక్ ఆక్సైడ్ అనేది శరీరంలో కీలక పాత్ర పోషించే అణువు. ఇది రక్తనాళాలను విస్తరింపజేసి రక్తప్రసరణను మెరుగుపరచడం, కణాలకు ఆక్సిజన్ సరఫరాను సులభతరం చేయడం, అలాగే కొన్ని రోగ కారక సూక్ష్మ జీవులపై నిరోధక చర్య చూపడం వంటి పనులు చేస్తుంది. ముక్కు గవ్వలలో ఇది ఉత్పత్తి అవుతుందనే విషయం నిజమే. రాగాలు తీసే సమయంలో గాలి ప్రవాహం, ప్రకంపనలు పెరగడం వల్ల, ముక్కులోని సైనస్ ప్రాంతాల్లో గాలి మార్పిడి మెరుగుపడి, నైట్రిక్ ఆక్సైడ్ విడుదల తాత్కాలికంగా పెరుగుతుందని కొన్ని అధ్యయనాలు సూచించాయి. కానీ, ఈ పెరుగుదల సాధారణంగా చాలా స్వల్పకాలికమే. అంతేగాక, అది మొత్తం శరీర వ్యవస్థపై ఏ స్థాయిలో ప్రభావం చూపుతుంది అన్నది స్పష్టంగా నిరూపణ కాలేదు. కాబట్టి, దీన్ని ఒక స్థిరమైన చికిత్సా విధానంగా పరిగణించడం ముందస్తు నిర్ణయం అవుతుంది. అంతమాత్రం చేత పాటలు పాడడం, రాగాలు తీయడాన్ని తక్కువ చేయడం కూడా సరికాదు. ఎందుకంటే, హమ్ చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు కేవలం నైట్రిక్ ఆక్సైడ్‌కే పరిమితం కాకుండా, శ్వాసను సరైన రీతిలో నియంత్రిస్తుంది. నాడీ వ్యవస్థను శాంతింపజేస్తుంది, ఒత్తిడిని తగ్గిస్తుంది. ఈ ప్రభావాలు కలిపి ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపవచ్చు. అందువల్ల, హమ్ చేయడం ఒక సహాయక సాధనంగా ఉపయోగపడుతుందని ఖచ్చితంగా చెప్పవచ్చు.


## జామలో కేన్సర్ నివారణ మాలిక్యూల్!



జామ కాయలో కనుగొన్న ‘సిగాడియల్’ సంబంధిత మాలిక్యూల్ కాలేయ కేన్సర్ నివారణలో కీలక పాత్ర పోషించవచ్చని, దీన్ని తక్కువ ఖర్చుతో తయారు చేయగలిగితే చికిత్స అందరికీ చేరువవుతుందని ఇటీవల వివిధ మాధ్యమాల్లో వార్తలు వస్తున్నాయి. శాస్త్రీయ పురోగతి కోణంలో చూస్తే ఇది ఆసక్తికరమైన పరిణామమే. కానీ, అభూతకల్పనలను, అతిశయోక్తులను జతకలిపి, ఒక స్థూల ప్రతిపాదనను వైద్య ఆవిష్కరణగా పేర్కోవడం అనుచితం. ఇలాంటి నేచురల్ కంపౌండ్స్‌పై పరిశోధనలు సాధారణంగా ప్రారంభ దశలోనే ఉంటాయి. జామలో కనుగొన్న ఈ మాలిక్యూల్ కాలేయ కేన్సర్ కణాలపై ప్రభావం చూపిందని అంటున్నప్పటికీ, ఎక్కడా మనుషులపై ప్రయోగించిన దాఖలాలు లేవు. ఇవి ప్రస్తుతానికి ప్రయోగశాల స్థాయికే పరిమితమైన ఒక ప్రతిపాదన మాత్రమే. ఈ దశలో కణాలపై ప్రభావం కనిపించడం ఒక ముఖ్యమైన మొదటి అడుగుగా పేర్కోవచ్చు. కానీ, అదే ప్రభావం మనుషుల శరీరంలో సురక్షితంగా, సమర్థంగా పనిచేస్తుందా అన్నది పూర్తిగా వేరే ప్రశ్న. క్లినికల్ ట్రయల్స్ లేకుండా నివారణ లేదా చికిత్స అనే పదాలు ఉపయోగించడం ముందస్తు నిర్ణయంగా మారుతుంది. సహజంగా వచ్చినది కాబట్టి సురక్షితం అనే అంచనా కూడా సరైనది కాదు. చాలా సహజ పదార్థాలు కూడా అధిక మోతాదులో విషపూరితంగా మారవచ్చు. కాబట్టి, ఈ మాలిక్యూల్‌ను ఔషధంగా ఉపయోగించాలంటే దాని డోస్, సైడ్ ఎఫెక్ట్స్, మెటబాలిజం వంటి అనేకానేక అంశాలపై సమగ్ర అధ్యయనం అవసరం. ఈ వార్తల్లో ప్రస్తావిస్తున్న ‘టోటల్ సింథసిస్’ పద్ధతి నిజంగా ప్రాముఖ్యమైనది. ప్రకృతిలో లభించే సమ్మేళనాలను ల్యాబ్‌లో తిరిగి తయారు చేయడం ద్వారా వాటిని పెద్ద పరిమాణంలో, నియంత్రిత నాణ్యతతో ఉత్పత్తి చేయవచ్చు. ఇది ఔషధ పరిశ్రమలో కీలక దశ. కానీ తక్కువ ఖర్చుతో తయారు చేయడం, కేన్సర్‌కు అత్యంత చౌకైన చికిత్స అనే ధోరణి తప్పు. ఔషధ అభివృద్ధిలో ట్రయల్స్, నియంత్రణ అనుమతులు, తయారీ ప్రమాణాలు వంటి ఖర్చులు చాలా ఎక్కువగా ఉంటాయి. కాబట్టి, ఈ పరిశోధనను ఒక డ్రగ్ కాండిడేట్ డిస్కవరీగా చూడడం సబబు. అంటే, ఇది భవిష్యత్తులో ఔషధంగా మారే అవకాశమున్న ఒక అణువు. కానీ అది నిజంగా మందుగా మారాలంటే సంవత్సరాల పాటు పరిశోధన, పరీక్షలు అవసరం. జామ కాయలోని ఈ సమ్మేళనం శాస్త్రీయంగా ఆశాజనకమైనదే.

## మీకు తెలుసా?

ఎండోక్రైన్ సిస్టమ్ అనేది హార్మోన్లు విడుదల చేసే వ్యవస్థ. హార్మోన్లు శరీరంలో రసాయన దూతలుగా పనిచేస్తాయి. శరీరంలోని ప్రధాన గ్రంథి పిట్యూటరీ గ్రంథి, దీనిని ‘మాస్టర్ గ్రంథి’ అని కూడా పిలుస్తారు. మెడలో ఉండే గ్రంథి థైరాయిడ్ గ్రంథి; ఇది థైరాక్సిన్ హార్మోన్‌ను విడుదల చేస్తుంది. రక్తంలోని కాల్షియం స్థాయిని నియంత్రించేది పారా థైరాయిడ్ గ్రంథి. వృక్కాలపై ఉండే గ్రంథులు అడ్రినల్ గ్రంథులు. ఇవి అడ్రినలిన్ వంటి హార్మోన్లు విడుదల



చేస్తాయి.
రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించేది పాంక్రియాస్ లేదా అగ్న్యాశయం. ఇది ఇన్సులిన్ హార్మోన్‌ను విడుదల చేస్తుంది. మహిళల్లో ద్వితీయ లింగ లక్షణాలను నియంత్రించేది ఈస్ట్రోజన్, పురుషుల్లో అది టెస్టోస్టెరోన్. ఈస్ట్రోజన్ మరియు ప్రోజెస్టెరాన్ అండాశయాల నుండి విడుదలవుతాయి. స్పెర్మ్, టెస్టోస్టెరోన్ విడుదల చేసే గ్రంథులు. పాలు ఉత్పత్తి కావడానికి ప్రోలాక్టిన్ హార్మోన్ బాధ్యత వహిస్తుంది. ప్రసవ సమయంలో గర్భాశయ సంకోచాలకు ఆక్సిటోసిన్ కారణం. నిద్రజాగరణ చక్రాన్ని నియంత్రించే పైనీయల్ గ్రంథి మెలటోనిన్ హార్మోన్‌ను విడుదల చేస్తుంది. ఎదుగుదలకు అవసరమైనది గ్రోత్ హార్మోన్. అయోడిన్ లోపం వల్ల గోయిటర్ అనే వ్యాధి వస్తుంది. కాగా, గర్భధారణ కాలం సాధారణంగా సుమారు 9 నెలలు లేదా 280 రోజులు.

## మహిళలకిచ్చిన హామీలు నెరవేర్చాలి

### మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నీలమ్మ, పైమీదా డిమాండ్



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకిచ్చిన హామీలు నెరవేర్చాలని మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.నీలమ్మ, ఎండి పైమీదా డిమాండ్ చేశారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన మహిళా సమాఖ్య సమావేశానికి హాజరై వారు మాటాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను కోటీశ్వరలను చేస్తామని చేసిన వాగ్దానాలను మాటల్లో కాదు చేతల్లో చేసి నిరూపించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు సంక్షేమ పథకాలు అందించి అన్నిరంగాలలో అభివృద్ధి చేయలన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసి ఓటర్ల జాబితా పారదర్శకంగా, నిష్పాక్ష పాతంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి కావలి సురేష్, మహిళ సంఘం నాయకులు అమృత, ఎండి సల్మా, రజిత, పోచమ్మ, పావని, శారద తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన నిరుపేదలకు ఇళ్లస్థలాలిచ్చి ఇండ్లు నిర్మించి ఇవ్వాలి

### సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో జూలై 1న జిల్లా కలెక్టర్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం నేరేడుచర్లలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ప్రజలు ఆశించిన స్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ జరగడం లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో నిరుపేదలు గుడిసెలు వేసుకున్నప్పటికీ వారికి పట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికయిన స్పందించి అర్హులైన పేదలకు ఇంటి పట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా నాయకులు దూళిపాళ ధనుంజయనాయుడు, లక్ష్మి, చిలకరాజు శ్రీను, పరికె భరత్ పాల్గొన్నారు.

# కార్మిక హక్కులు హరిస్తున్న కేంద్రం

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులు హరిస్తుందని, పోరాడి సాధించుకున్న హక్కుల రక్షణకు పోరాటాలకు సిద్ధం కావాలని కార్మిక లోకానికి ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు పిలుపునిచ్చారు. ఆగస్టు 8, 9 తేదీల్లో సత్తుపల్లిలో జరగనున్న ఎఐటియుసిఖమ్మం జిల్లా 17వ మహాసభలను కార్మికులు, ప్రజలు విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆదివారం పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో ఎఐటియుసి కార్యదర్శి తెలగారపు రామారావు అధ్యక్షతన నిర్వహించిన ఆహ్వాన సంఘ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వాలను ప్రశ్నించేందుకు కార్మికులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. 106 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఎఐటియుసి ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి జిల్లా మహాసభలను నిర్వహిస్తుందని, ఈసారి చారిత్రాత్మక కార్మిక కేంద్రంగా పేరుగాంచిన సత్తుపల్లిలో 17వ జిల్లా మహాసభలను నిర్వహించడం ఆనందదాయకమని తెలిపారు. సత్తుపల్లి వంటి కార్మిక ప్రాంతంలో తొలిసారిగా జిల్లా మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో మున్సిపాలిటీ, మండల, డివిజన్ ప్రజలు, కార్మికులు ఆర్థికంగా, నైతికంగా సహకరించి మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. గత మూడు సంవత్సరాల కాలంలో కార్మికుల కోసం సంఘం చేపట్టిన పోరాటాలు, సాధించిన విజయాలు, ఎదురైన సవాళ్లను సమీక్షించి, భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకునే వేదికే జిల్లా మహాసభలని పేర్కొన్నారు. మహాసభలను విజయవంతం చేయడం ప్రతి ఎఐటియుసి కార్యకర్త బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. అనంతరం మహాసభల నిర్వహణ కోసం ఆహ్వాన సంఘాన్ని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఎఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రావి శివరామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు పేరాబోయిన మోహన్‌రావు, వేము రాంబాబు, మహాదేవ లక్ష్మి, జిల్లా కార్యదర్శులు నిమ్మటూరి రామకృష్ణ, సీహెచ్ సీతామహాలక్ష్మి, జిల్లా సమితి సభ్యులు తడికమళ్ల యోబు, తాళ్లూరి లక్ష్మి, పిల్లి భాస్కర్, సముద్రాల సుధాకర్, బుగ్గ సుధాకర్, ఓడల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు బుచ్చన్నయాదవ్



**ప్రజాపక్షం/కరీంనగర్ :** జిల్లాలోని అన్నిప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్‌లో పనిచేస్తున్న మధ్నాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించి కనీస వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య, జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డిభవన్ ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్న భోజన పథకం వర్కర్ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా మహాసభ బొజ్జ సాయిలు అధ్యక్షతన జరిగింది. మహాసభకు ముఖ్య అతిథిలుగా సమ్మయ్య, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ హాజరై మాట్లాడారు. మహాసభ అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా సమ్మయ్య, జిల్లా అధ్యక్షుడిగా బొజ్జ సాయిలు, ఉపాధ్యక్షుడిగా లక్ష్మి, దేవమ్మ, ప్రధాన కార్యదర్శిగా కె.రజిత, సహాయ కార్యదర్శులుగా కవిత, సరోజన, కార్యవర్గ సభ్యులుగా సరోజన, కనకమ్మ, కవితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాటాలు

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** కేంద్రంలోని పాలక వర్గాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో శ్రమ దోపిడీ తీవ్రస్థాయికి చేరిందని, హక్కుల రక్షణకు లేబర్ కోడ్‌ల రద్దుకు కార్మికులంతా ఏకమై ఉద్యమించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మిర్యాలగూడ ఎన్ఎస్‌పి క్యాంప్‌లో నిర్వహించిన ఎఐటియుసి మిర్యాలగూడ నియోజకవర్గ 11వ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో మోదీ సర్కార్ కార్పొరేట్ శక్తులకు వత్తాసు పలుకుతూ దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తోందని మండిపడ్డారు. 44 కార్మిక చట్టాలను సవరించి, యాజమాన్యాలకు లాభం చేకూర్చేలా నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం కార్మికవర్గానికి శాపంగా మారిందన్నారు. చట్టాల సవరణ పేరుతో కార్మికులను బానిసలుగా మార్చే కుట్రలు సాగుతున్నాయని, యాజమాన్యాలకు వేల కోట్ల రూపాయల రాయితీలు ఇస్తున్న పాలకులు, శ్రమకు తగిన కనీస వేతనం ఇప్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. చట్టాల సవరణలను వేగంగా అమలు చేస్తున్న కేంద్రంపై పోరాటానికి సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు సిద్ధం కావాలన్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నా అదుపు చేయలేకపోవడంతో మధ్యతరగతి, పేద కుటుంబాల జీవనం అతలాకుతలమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎన్.రామస్వామి మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వ్యవస్థలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలన్నారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరల పెరుగుదల వల్ల సామాన్యుడు బతికే పరిస్థితి లేదని, ఈ సమస్యలపై పెద్దఎత్తున పోరాటాలు నిర్మిస్తామని హెచ్చరించారు. జూలై 19న ఎఐటియుసి నల్లగొండ జిల్లా మహాసభలను గుర్రంపోడ్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. బంటు రాజేశ్వరి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి తన్నీరు పాండు రంగారావు, నాయకులు జిల్లా యాదగిరి, బి.బాలకృష్ణ, గోగుల యాదగిరి, కె.బిక్షం, గోపనాయక్, ఎం.రాము, షమీమ్, పుల్లారావు, ఆంజనేయులు పాల్గొన్నారు.



## అర్హులైన ప్రతీఒక్కరికి ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత ‘బిఎల్‌ఏ’దే



### సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత ‘బిఎల్‌ఏ’దేనని, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్ల (బిఎల్‌ఏ) పాత్ర అత్యంత కీలకమని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో నిర్వహించిన లక్ష్మీదేవిపల్లి మండల స్థాయి సిపిఐ పక్ష బూత్ లెవల్ ఏజెంట్ల (బిఎల్‌ఎ)ల సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత బిఎల్‌ఎలదేనని స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వీడి క్షేత్రస్థాయిలో జరిగే సర్వేలో బిఎల్ఒలతో కలిసి చురుగ్గా పాల్గొనాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలో బోగస్ ఓట్ల తొలగింపుపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అర్హత లేని వారిని గుర్తించి అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. చనిపోయిన వారు, వలస వెళ్ళిన వారి వివరాలను జాబితా నుండి తొలగించేలా చూడాలని, అర్హులైన యువతీ యువకులకు నూతన ఓటర్ల నమోదు, కార్డుల్లో తప్పుల సవరణపై ప్రజల్లో విస్తృత అవగాహన తేవాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో బూత్ కమిటీలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీ పటిష్టతకు, బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, సిపిఐ మండల కార్యదర్శి దీటి లక్ష్మీపతి, జిల్లా సమితి సభ్యులు మామిడాల ధనలక్ష్మి, నాయకులు సపావట్ రవి, జర్పుల ఉపేందర్, కళ్లెం సత్యనారాయణ, హత్తిరామ్ తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

ప్రమాదంలో ఇద్దరు మృతి, ఏడుగురికి గాయాలు

**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులో ఆదివారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇరువురు మృతి చెందగా, ఏడుగురు గాయపడ్డారు. చిట్యాల వైపు నుండి హైదరాబాద్ వైపు వెలుతున్న వాహనాలు ఒకదానికి ఒకటి ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ముందు వెలుతున్న కారు అకస్మాత్తుగా వేసిన బ్రేక్ కారణంగా వెనుకాలే వేగంగా వస్తున్న రెండు కార్లు ఒకదానికి ఒకటి ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రెండు కార్లు రోడ్డుపైనే పల్టీలు కొట్టాయి. ప్రమాదంలో గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. నార్కట్‌పల్లి మండలం అక్కినెపల్లి గ్రామానికి చెందిన కసిరెడ్డి దేవేందర్‌రెడ్డి, దేప సరితలు ఒక శుభ కార్యానికి హైదరాబాద్ వెలుతున్నారు. వీరివురు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై పూర్తిగా ట్రాఫిక్ స్థంభించిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్రేన్‌ల సహాయంతో రోడ్డుపై పడి ఉన్న కార్లను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

## 30న ఆందోళనలు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఫీజురియంబర్స్‌మెంట్ స్కీమ్‌ను యదాతదంగా అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిసి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన తరగతుల బహిష్కరణతోపాటు కలెక్టరేట్, ఆర్‌డిఓ, తహశీల్దార్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పోలోజు మహేష్ చారి తెలిపారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్, ఫార్మసీ, పిజి, డిగ్రీ తదితర కోర్సులు పూర్తి అయిన వారికి కళాశాల యాజమాన్యాలు ఫీజురియంబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో వారి సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో రూ.80వేల కోట్ల ఫీజు బకాయిలు ఉన్నాయని వెంటనే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 33 నెలలు గడుస్తున్నా ఆర్థిక పరిస్థితులు మెరుగ్గా లేవని ఫీజురియంబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు తండు నగేష్, చరణ్, శశిప్రీతం, సాయితేజ, నవీన్ పాల్గొన్నారు.

## కారుని ఢీకొట్టిన లారీ

అక్కడికక్కడే వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/అర్వపల్లి :** లారీ కారును ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. అర్వపల్లి ఎస్ఐ పి. మధు తెలిపిన వివరాల ప్రకారం కొమ్మాల గ్రామానికి చెందిన బయ్య అవిలయ్య కుమారుడైన బయ్య మధు (22) శనివారం బొల్లంపల్లి గ్రామానికి చెందిన తమ బంధువుల వివాహం కోసం విచ్చేశారు. వివాహనంతరం నూతన దంపతులను పెళ్లికూతురు గ్రామమైన కొత్తపేట గ్రామంలో నూతన వధూవరులను సాగనంపి తిరిగి బొల్లంపల్లి గ్రామానికి వస్తుండగా అర్థరాత్రి ఎదురుగా జనగాం నుండి సూర్యాపేటకు వెళ్తున్న లారీ బలంగా ఢీకొట్టడంతో కారు డ్రైవింగ్ చేస్తున్న మధు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పరాబ్ కుమార్ జీవితం ప్రతీ ఉద్యోగికి స్ఫూర్తి

ప్రముఖ వాగ్గేయకారుడు గోరటి వెంకన్న



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లా ఆరోగ్య శాఖ అధికారి పరాబ్ కుమార్ పదవీ విరమణ సభ ఆదివారం నల్లగొండ జనరల్ హాస్పిటల్ ఎక్సామినేషన్ హాల్‌లో ఆత్మీయులు, సహచర ఉద్యోగుల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ వాగ్గేయకారుడు గోరటి వెంకన్న, అరుణోదయ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క, యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫసర్ రాజశేఖర్,కళాకారుడు అంబటి వెంకన్న ముఖ్య అతిథులుగా హాజరై పరాబ్ కుమార్ సేవలను కొనియాడారు.పరాబ్ కుమార్ జీవితం ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి స్ఫూర్తిదాయకమని, పదవీ విరమణ ఉద్యోగ జీవితానికే గానీ సేవా జీవితానికి కాదని గోరటి వెంకన్న అన్నారు. తండ్రి లక్ష్మారెడ్డి చూపిన మార్గంలోనే సమాజ సేవలో ముందుకు సాగారని, ఇకపై కూడా ప్రజలకు చేరువ కావాలని ఆకాంక్షించారు. వెంకన్న కవిత్వంతో సభికులను ఆకట్టుకున్నారు.పరాబ్ కుమార్ తన విధులను ప్రజా ఉద్యమకారుడిలా నిర్వహించారని, నిరుపేదలు, అణగారిన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సేవ చేశారని అంబటి వెంకన్న కొనియాడారు. ఆయన కుటుంబం విలువలు, సేవా దృక్పథం అనేక మందికి స్ఫూర్తినిచ్చాయని విమలక్క అన్నారు. నిరుపేదల కోసం పరాబ్ కుమార్, ఆయన తండ్రి చేసిన సేవలు ఆదర్శప్రాయమని వీసీ రాజశేఖర్ పేర్కొన్నారు.కార్యక్రమంలో ఆరోగ్య శాఖ అధికారులు,సిబ్బంది,ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని కుమార్‌ను ఘనంగా సన్మానించారు. సభకు వచ్చినవారు పూల దండలు, బొకేలకు బదులుగా పుస్తకాలను బహుమతిగా ఇచ్చి కార్యక్రమాన్ని విభిన్నంగా నిర్వహించారు.

## పదవీ విరమణ తప్పనిసరి

**ప్రజాపక్షం/చివ్వెంల :** ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని సర్పంచ్ బొల్లికొండ సైదులు అన్నారు. రణబోతు వెంకట్‌రెడ్డి అభినందన సన్మాన సభ ఆదివారం మండలంలోని గుంజలూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. అంకితభావంతో పనిచేస్తే ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు.

## వరుణుడి కరుణ కరువై రైతన్న గుండెల్లో గుబులు

ఆకాశం వైపు రైతన్న చూపు...
చినుకు కోసం వెయ్యికళ్లతో నిరీక్షణ
వర్షం లేక భూమిలోనే కుళ్లిపోతున్న పత్తి విత్తనాలు
నారు ముదిరిపోతున్నా సాగుకు సిద్ధంకాని పొలాలు





**ప్రజాపక్షం/నల్లగొండ :** తొలకరి జల్లులను నమ్ముకుని ఆశల విత్తనాలు చల్లిన రైతన్నకు ఈసారి ఆకాశం ఆశాభంగమే మిగులుస్తోంది. జిల్లాలో గత కొద్దిరోజులుగా వర్షాలు ముఖం చాటేయడంతో పొలాల్లో ఆందోళన మేఘాలు కమ్ముకున్నాయి.పత్తి,వరి సహా వివిధ పంటల సాగు కోసం భారీగా పెట్టుబడులు పెట్టిన రైతులు ఇప్పుడు వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు.ఉదయం నుంచి మండిపోతున్న ఎండలు, సాయంత్రానికి వర్షం పడేలా కనిపించే మబ్బులు...కానీ ఒక్క చినుకు కూడా నేలను తాకడం లేదు.దీంతో వర్షాలను నమ్ముకుని విత్తిన పత్తి విత్తనాలు మొలకెత్తక భూమిలోనే కుళ్లిపోతుండగా,మొలకెత్తిన మొక్కలు నీటి లేమితో వాడిపోతున్నాయి.రైతుల కష్టానికి, పెట్టుబడికి ప్రకృతి పరీక్ష పెడుతోంది. జిల్లాలో సుమారు 12 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరిగినట్లు వ్యవసాయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.వర్షాభావం కొనసాగితే ఇప్పటికే వేసిన పంటకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మళ్లీ విత్తనాలు వేసేందుకు అదనపు ఖర్చు భరించే పరిస్థితి లేదని చెబుతున్నారు.మరోవైపు బోరు బావుల ఆధారంగా వరి సాగు చేయాలనే ఉద్దేశంతో రైతులు నారుమడులు సిద్ధం చేశారు. అయితే భూగర్భ జలాలు అడుగంటడం, బోర్లలో నీటి మట్టం తగ్గిపోవడంతో పొలాలను సాగుకు సిద్ధం చేయలేకపోతున్నారు. నారుమడుల్లో నారు రోజురోజుకూ ముదిరిపోతుండగా,వాటిని నాటేందుకు అవసరమైన నీరు లేక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టి పంటల సాగు ప్రారంభించిన రైతాంగం ఇప్పుడు ఆకాశం వైపు ఆశగా చూస్తోంది.ఒక మంచి వర్షం కురిస్తే పంటలు గాడిలో పడతాయని,లేకపోతే భారీ నష్టాలు తప్పవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొలంలో విత్తనం వేసాం... ఇప్పుడు ఆకాశాన్నే చూస్తున్నాం. వర్షం పడకపోతే పంటతో పాటు మా ఆశలు కూడా ఎండిపోతాయి అని రైతులు వేదన వ్యక్తం చేస్తున్నారు. వరుణుడి కరుణ కోసం జిల్లావ్యాప్తంగా రైతన్నల కళ్లలో ఎదురుచూపులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.ఎండలతో అల్లాడుతున్న నేలతో పాటు రైతు గుండె కూడా వర్షపు చినుకుల కోసం తపిస్తోంది.ఈ వారం రోజుల్లో మంచి వర్షాలు కురవకపోతే ఖరీఫ్ సాగుపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు.



## విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం అందజేత

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని దూపాడు గ్రామానికి చెందిన అమ్మనబోయిన ఉషారాణి పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చి మంచి మార్కులు సాధించడంతో ఆ గ్రామానికి చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బోయిళ్ళ అరవింద్ శ్యామల దంపతులు ఆదివారం ఆమెను శాలువాతో సత్కరించి రూ.10,116ల నగదు ప్రోత్సహకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నన్నెపంగ కమలమ్మ మాట్లాడుతూ అరవింద్ దంపతులు పదవ తరగతిలో ఉత్తమ ఫలితం సాధించిన ఉషారాణికి నగదు ప్రోత్సాహకం అందించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ అరవింద్‌ను ఆదర్శంగా తీసుకొని సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. అరవింద్ మాట్లాడుతూ విద్యలో రాణించినవారికి, ఆట పాటల్లో రాణించే విద్యార్థులకు ప్రతి సంవత్సరం నగదు ప్రోత్సహకంతో పాటు ఇతర బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆర్తి నరేష్, మార్కెట్ డైరెక్టర్ కేశవులు, ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు గుగ్గిళ్ళ శాంసన్, భగత్, ఉపాధ్యాయులు పిన్నాని రాంబాబు, గుండు ఆంజనేయులు పాల్గొన్నారు.

## ఎస్ఎల్‌బిసి, డిండి ప్రాజెక్టులకు అధిక నిధులు కేటాయించండి

సిపిఐ ఆధ్వర్యంలో సిఎం రేవంత్ రెడ్డికి మెమోరాండం



**ప్రజాపక్షం/నల్లగొండ :** జిల్లా సమగ్ర అభివృద్ధికి పెండింగ్‌లో ఉన్న ఎస్ఎల్‌బీసీ టన్నెల్,డిండి ఎత్తిపోతల పథకం, బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలని కోరుతూ ఆదివారం సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సిపిఐ నాయకులతో కలిసి ముఖ్యమంత్రిని కలిసి జిల్లాకు సంబంధించిన పలు అభివృద్ధి అంశాలను వివరించారు. అనంతరం నెల్లికంటి సత్యం మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న ఎస్ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులు పూర్తయితే సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు.గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో జిల్లాలోని కీలక ప్రాజెక్టులు నిలిచిపోయాయని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో పనులు పునఃప్రారంభం కావడం స్వాగతించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులకు తగిన నిధులు కేటాయించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు.బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్ట్ ఎడమ కాలువను మునుగోడు మండలం కిష్టాపురం వరకు పూర్తి చేసేందుకు భూసేకరణ చేపట్టి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఈ కాలువ పూర్తయితే మునుగోడు మండలంలోని పది గ్రామాలకు సాగు, తాగునీటి సౌకర్యం అందుతుందని వివరించారు.అలాగే రాష్ట్రంలో అత్యధికంగా బత్తాయి సాగు జరిగే నల్లగొండ జిల్లాలో బత్తాయి జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే రైతులకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు , సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి కార్యవర్గ సభ్యులు గురిజ రామచంద్రం,టీ.వెంకటేశ్వర్లు ఉన్నారు.



## ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ:** ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. ఆదివారం దేవరకొండ పట్టణంలోని 11, 12 వార్డుల్లో నగరాభివృద్ధి నిధుల కింద రూ. 1కోటి 42లక్షల 25వేల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్ల నిర్మాణ పనులకు ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ బాలునాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు నాణ్యమైన రహదారులు, తాగునీరు, డ్రైనేజి, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాల్లో కూడా అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షులు సురేష్‌గౌడ్, సిరాజ్ ఖాన్ పాల్గొన్నారు.

## చరిత్ర- ఆధ్యాత్మికత సమ్మిళితమే నాగార్జునసాగర్



తెలంగాణ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ చిన్నారెడ్డి

**ప్రజాపక్షం/నందికొండ:** అంతర్జాతీయ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్‌ను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, తెలంగాణ రాష్ట్ర ప్రజావాణి ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి ఆదివారం సందర్శించారు.తన పుట్టినరోజు సందర్భంగా సాగర్ పర్యటన చేపట్టిన ఆయన నాగార్జునకొండ, బుద్ధవనం ప్రాంతాలను సందర్శించి అక్కడి చారిత్రక,ఆధ్యాత్మిక విశిష్టతను ఆస్వాదించారు. ముందుగా నాగార్జున కొండ పురావస్తు మ్యూజియాన్ని సందర్శించిన చిన్నారెడ్డి పునర్నిర్మిత అశ్వమేధ యజ్ఞశాల, మహాస్తూపం, సింహాల విహారం తదితర చారిత్రక కట్టడాలను పరిశీలించారు.అనంతరం బుద్ధవనం చేరుకుని బుద్ధుని పాదాలకు వందనం సమర్పించారు. బుద్ధ చరిత వనం, జాతక వనం, ధ్యాన వనం, స్తూప వనాలను సందర్శించి అక్కడి ప్రత్యేకతలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, శాసన, ఎస్టేట్ ఆఫీసర్ రవిచంద్రలు ఆయనను బుద్ధవనం కండువాతో సత్కరించారు స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ నాగార్జునసాగర్ డ్యాం, నాగార్జునకొండ, బుద్ధవనం చారిత్రక, పర్యాటక విశిష్టతలను మాజీ మంత్రికి వివరించారు. ఈసందర్భంగా డాక్టర్ జి. చిన్నారెడ్డి మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా నాగార్జునసాగర్‌ను సందర్శించడం ఎంతో ఆనందంగా ఉందని, బుద్ధవనాన్ని అత్యంత అద్భుతంగా అభివృద్ధి చేశారని" కొనియాడారు. దేశ విదేశాల పర్యాటకులను ఆకర్షించేలా ఈ ప్రాంతాన్ని మరింతగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రొఫసర్ జలంధర్ రెడ్డి,ప్రోటోకాల్ ఆఫీసర్ దండా శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## యువత చొరవతో నెమలి సురక్షితం



**ప్రజాపక్షం/నకిరేకల్(కట్టంగూరు) :** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద సంచరిస్తున్న నెమలిని స్థానిక యువకులు కుక్కల బారిన పడకుండా చాకచక్యంగా రక్షించారు. చెరుకు సురేష్, జెల్లా నవీన్, ప్రవీణ్,శాఖ నెమలిని సురక్షితంగా పట్టుకుని గోపాలమిత్ర చెరుకు శ్రీనివాస్‌కు సమాచారం అందించారు. ఆయన ప్రథమ చికిత్స అందించగా, సమాచారం మేరకు బీట్ అధికారి శిరీష సంఘటన స్థలానికి చేరుకుని నెమలిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వన్యప్రాణుల సంరక్షణలో యువత చూపిన చొరవ అభినందనీయమని ఆమె పేర్కొన్నారు.

## 30న తెలంగాణవ్యాప్తంగా కళాశాలల బంద్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్రంలోని బీసీ విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయంబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30వ తేదీన తెలంగాణవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన పట్టణంలో మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య ఆదేశాల మేరకు ఈ రాష్ట్రవ్యాప్త బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా బీసీ విద్యార్థులకు సంబంధించిన వందలాది కోట్ల రూపాయల ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోవడం దారుణమన్నారు. దీనివల్ల నిరుపేద వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రభుత్వ నిధులు అందకపోవడంతో, కళాశాల యాజమాన్యాలు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను ఇవ్వకుండా నిలిపివేస్తున్నాయని, ఫలితంగా ఉన్నత విద్యావకాశాలు, ఉద్యోగ ఇంటర్వ్యూలకు విద్యార్థులు హాజరుకాలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కేవలం బీసీ విద్యార్థుల పట్లనే వివక్ష చూపుతోందని, వారిని చదువుకు దూరం చేసే కుట్రలో భాగంగానే నిధుల విడుదలలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు.ఈ నెల 30న జరిగే విద్యాసంస్థల బంద్‌కు ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థి లోకం స్వచ్ఛందంగా సహకరించి జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్క నాగేశ్వరరావు, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు రవీందర్ గౌడ్, మిర్యాలగూడ బీసీ జేఏసీ కన్వీనర్ దాసరాజు, బీసీ జేఏసీ కో కన్వీనర్ చిలకల మురళి యాదవ్ పాల్గొన్నారు.



## చిన్నారుల ఆరోగ్యరక్షణే ప్రభుత్వ లక్ష్యం

పోలియో రహిత సమాజానికి సహకరించండి- ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దేశవ్యాప్త జాతీయ పల్స్ పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడ నియోజకవర్గంలో పోలియో నిర్మూలన పకడ్బందీగా సాగింది. మిర్యాలగూడ పట్టణంలోని పలు వార్డుల్లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాలను శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లోని చిన్నారులకు ఆయన స్వయంగా పోలియో చుక్కలు వేసి, వ్యాక్సినేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ భావితరాల ఆరోగ్య పరిరక్షణకు, పోలియో మహమ్మారి లేని సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలన్నారు. ముఖ్యంగా ఐదేళ్ల లోపు వయసున్న ప్రతి చిన్నారికి తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఐదేళ్లలోపు పిల్లలందరికీ చుక్కలు: కలెక్టర్ చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ :** జిల్లాలో ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేసే కార్యక్రమం ఆదివారం విజయవంతంగా ప్రారంభమైంది. స్థానిక మాన్యం చల్క పట్టణ ఆరోగ్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకురాలు, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సుపర్ణ, డీఎంహెచ్‌వో డాక్టర్ కే.రాహుల్,జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ పద్మ పాల్గొన్నారు. జిల్లాలోని పిల్లలందరికీ చుక్కలు వేయాలని ఆరోగ్య సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు.బస్టాండ్, రైల్వే స్టేషన్లలో 24 గంటలపాటు మూడు రోజులు ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.సోమవారం నుంచి ఆరోగ్య బృందాలు ఇంటింటికీ తిరిగి చుక్కలు వేయడంతో పాటు ప్రతి ఇంటికి మార్కింగ్ చేస్తాయని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పోలియో బూత్‌లలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చుక్కలు వేస్తున్నట్లు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ పద్మ తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కూడా జాయింట్ డైరెక్టర్ సుపర్ణ, డీఎంహెచ్‌వో డాక్టర్ రాహుల్, డీఐవో డాక్టర్ పద్మ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ నగేష్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నగేష్, డాక్టర్ శంకర్, ఆరోగ్య విద్య విస్తరణాధికారి అంజయ్య గౌడ్ కలిసి చిన్నారులకు చుక్కలు వేశారు.



## పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

కలెక్టర్ హరిత



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. ఆదివారం కాగజ్ నగర్ మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు కాపువాడలో గల అంగన్వాడి కేంద్రం, రాజంపేటలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ ను పోలియో రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి అందరం సమిష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఐదు సంవత్సరాలలోపు చిన్నారులందరికీ తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం మేరకు ప్రతి ఒక్క చిన్నారికి టీకా అందేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న చిన్నారులు, పోలియో కేంద్రాల ఏర్పాటు, అందుబాటులో ఉన్న వ్యాక్సిన్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట సర్పంచ్ బుర్సా పోచయ్య, అసిఫాబాద్ చైర్మన్ ఆకాష్, కాగజ్ నగర్ మున్సిపల్ కమిషనర్ తిరుపతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, అంగన్వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ కాలనీలో సిసి రోడ్డు.. పనులు పరిశీలించిన వైస్ చైర్మన్



**ప్రజాపక్షం/ మెదక్ :** మెదక్ పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు ఇటీవల ప్రారంభించిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ ఆదివారం జర్నలిస్టులతో కలిసి పరిశీలించారు.నిర్మాణ పనుల పురోగతిని ప రిశీలించిన ఆయన, జర్నలిస్టుల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి ప రిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు మున్సిపాలిటి తరపున అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జర్నలిస్టులు శంకర్ దయాల్ చారి, కమాటి కృష్ణ, సంగమేశ్వర్, ఉషయ్య, ఆంజనేయులు, ఫణి, కృష్ణమూర్తి ఉన్నారు.

### మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్

మెదక్ పట్టణంలోని 14,15వ వార్డులో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమంలో మున్సిపల్ వైస చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. దొంతి నరేష్ గౌడ్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రజలందరూ సహకరించాలని, ఒక్క చిన్నారిని కూడా పోలియో చుక్కలకు దూరం చేయొద్దని పిలుపునిచ్చారు. కౌన్సిలర్ దొంతి లక్ష్మి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడి సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## నిండు జీవితానికి రెండు చుక్కలు

మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి



**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** జాతీయ పల్స్ పోలియో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో పుట్టిన పాప నుండి ఐదు సంవత్సరాల పిల్లల వరకు ఆయా గ్రామాలలో ప్రజాప్రతినిధులు సర్పంచులు అధికారులు పోలియో చుక్కలు వేశారు. రాంపూర్ లో పల్స్ పోలియో కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి, డాక్టర్ సారిక పాల్గొన్నారు. చైర్మన్ మాట్లాడుతూ, నిండు జీవితానికి రెండు చుక్కలు మీ పిల్లలకు పోలియో చుక్కలు వేయించి వారి బంగారు భవిష్యత్తుని కాపాడండి జీరో నుండి 5 సంవత్సరాల లోపు అతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని నెల తల్లిదండ్రులకు కోరారు. అల్లాదుర్గం లో స్థానిక సర్పంచ్ మద్దూరి సౌమ్య సురేష్ గౌడ్ డాక్టర్ సారిక కలిసి చిన్న పిల్లలకు పోలో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి, తహసిల్దార్ మలయ్య, ఆయా గ్రామాల సర్పంచులు గోపాల్ రెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శశిధర్ రెడ్డి, వీరప్ప, రేణుక, కవిత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## అతి త్వరలోనే 100 పడకల ఆస్పత్రి

ముత్యాల సునీల్‌కమార్



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మండల కేంద్రంలో బాల్కొండ నియోజకవర్గ కాం గ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ వివిధ ప్రభుత్వ దవాఖాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన 100 పడకల ఆస్పత్రి ని ర్మాణ పనులను పరిశీలించి ప్రజలకు త్వరలో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## మాజీప్రధాని పివి రావు జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** దేశ గతిని మార్చిన అపర చాణక్యుడు మాజీ ప్రధాని పివి నర్సింహారావు 105వ జయంతి వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనిల్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించామన్నారు.



# వెల్దుర్తిలో రూ.25 లక్షలతో.. గ్రంథాలయ భవన నిర్మాణం

రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**ప్రజాపక్షం/వెల్దుర్తి:** గ్రంథాలయంను యువత సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలో రూ. 25 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనంను ఆదివారము ఎమ్మెల్యే సునీత రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసిన్ రెడ్డితో కలిసి మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. అంతకుముందు వెల్దుర్తిలో జరుగుతున్న ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ గ్రంథాలయ ఏర్పాటుతో యువత, విద్యార్థులకు , నిరుద్యోగులకు ఎంతో మేలవుతుందన్నారు. ఎల్లమ్మ దీవెనతో రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరినట్లు మంత్రి తెలిపారు. వెల్దుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎం, స్వీపర్ల పోస్టులు ఖాళీ ఉన్నాయని వాటిని భర్తీ చేయాలని, ప్రస్తుతం ఆరోగ్య కేంద్రంలో ఆరు బెడ్లు ఉన్నాయని, వాటిని 30 బెడ్లకు పెంచాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేశారు. శనివారం వెల్దుర్తి కి చెందిన పానుగంటి మైసయ్య పై ధర్పల్లి గ్రామంలో పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి మృతి చెందాడని, మైసయ్య భార్య లక్ష్మి తమకు ఎలాంటి ఆధారం లేదని, పొలం లేదని, ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. స్పందించిన మంత్రి బాధిత కుటుంబం యొక్క వివరాలను సేకరించి తమకు పంపించాలని, నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, వెల్దుర్తి సింగిల్ విండో డైరెక్టర్ కిష్టా గౌడ్, వెల్దుర్తి బిఆర్ఎస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, వెల్దుర్తి సర్పంచ్ ఆదర్శ్, ఉప సర్పంచ్ శ్రావణ్ కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సమర్థవంతంగా ఓటరు.. జాబితా ప్రక్రియ నిర్వహించాలి

కలెక్టర్ హరిత



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. ఆదివారం కాగజ్ నగర్ మున్సిపల్ పరిధిలోని 1వ వార్డులో కొనసాగుతున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూలై 24వ తేదీ వరకు జరగనున్న ఈ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి సంబంధిత ఓటరుకు ఫారం అందించి బిఎల్ఓ యాప్ లో మార్కింగ్ చేసుకోవాలని సూచించారు. మరణించిన, గ్రామం వదిలి వెళ్ళిపోయిన, రెండు అంతకంటే ఎక్కువ ఎపిక్ కార్డులు కలిగిన ఓటర్లను జాబితా నుండి తొలగించాలని పేర్కొన్నారు. అందరూ సమన్వయంతో పని చేసి సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్, సూపర్వైజర్లు, పంచాయితీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా కళాకారుల సంక్షేమానికి తోడ్పాటు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లాలోని ప్రతి ఒక్క కళాకారుల సంక్షేమానికి తోడ్పాటునందిస్తానని కళాకారుల అభ్యున్నతికి పాటుపడుతానని తెలంగాణ ఉద్యమకారుల జిల్లా అధ్యక్షుడు ఆర్టీసీ శ్రీనివాస్ అన్నారు. శనివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని న్యూఅంబేద్కర్ భవన్‌లో జిల్లా ఉద్యమ కళాకారుల జెఎసి సమవాఏశం నిర్వహించగా నూతన కమిటీ ఎన్నుకుని ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్‌కు జిల్లా కళాకారులు జాబితా అందజేశారు. తెలంగాణ ఉద్యమంలో ఆటపాటతో ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన కళాకారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం కళాకారులను ఆదుకోవాలన్నారు. రాష్ట్రం సాధించుకున్న తర్వాత కూడా కళాకారులకు పూర్తి న్యా యం జరగలేదన్నారు. ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఏర్పాటు చేయటం గప్ప విషయమని, కమిటీ సభ్యులు కోదండరాం కలాకారుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలన్నారు.

### నూతన కార్యవర్గం

జిల్లా అధ్యక్షులుగా ఆర్టీసీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా అష్ట గంగాధర్, కోశాధికారిగా రాంపూర్ సాయి, ఉపాధ్యక్షులు రేలారే రేలా గంగా, సాయిలావోల, గోదావరి, సవిత, సహాయ కార్యదర్శి కర్క రమేష్, క్రాంతి కుమార్, రాజు, మహేందర్, ప్రశాంత్‌రెడ్డి, కోకిల నాగరాజు, తోట శ్రీనివాస్, పస్క నర్సయ్య, పాశంకుమార్, సభ్యులుగా రాజేందర్, గోపి, చిట్టిబాబు, నర్సయ్యర్, రాజేందర్, దుష్యంత్, సంతోష్, మనోజ, దివ్య, రవినాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## అంబేద్కర్ స్ఫూర్తితో సమానత్వ సమాజం నిర్మించాలి

మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/శివ్వంపేట :** ప్రతీఒక్కరు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో సమానత్వ సమాజాన్ని నిర్మించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో సర్పంచ్ బుర్ర మురళీగౌడ్, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు ముంద్రాతి బాలేష్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ నూతన విగ్రహాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి చేతులమీదుగా ఆవిష్కరణ చేశారు.గ్రామంలో పండగ వాతావరణం నెలకొందని, రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. అంబేద్కర్ సమానత్వానికి ప్రతీక, సమాజిక న్యాయానికి చిహ్నం, ప్రతీ పేద కుటుంబానికి ఆశాజ్యోతి, ప్రతీ యువకుడికి స్ఫూర్తిగా నిలిచారన్నారు. అంబేద్కర్ చదువుతోనే ప్రపంచాన్ని గెలిచారన్నారు. అంబేద్కర్ తన కోసం జీవించలేదని, సమాజం కోసం జీవించారన్నారు. అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడారని, సమాన హక్కుల కోసం దేశవ్యాప్తంగా ఉద్యమించారన్నారు. గౌరవంగా జీవించడం ప్రతీ మనిషి హక్కు అని ఆయన మనకు నేర్పించారని అన్నారు. మన దేశానికి అంబేద్కర్ అందించిన అత్యంత గొప్ప కానుక భారత రాజ్యాంగం. రాజ్యంగం ప్రతీ భారతీయుడికి సమానత్వం, స్వేచ్ఛ, గౌరవప్రదమైన జీవితం అందించారన్నారు. అందుకే ఆయనను భారత ప్రజాస్వామ్య శిల్పిగా పిలుస్తామన్నారు. మన యువత బాబాసాహెబ్ జీవితాన్ని చదవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వ్యక్తి కాదని ఒక శక్తి అన్నారు. ఆయన రాసిన రా జ్యాంగం వల్లే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందన్నారు. ప్రతీ ఒక్కరు ఆయనను స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో ముందుకెళ్లాలని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, అదనపు కలెక్టర్ నగేష్, నియోజకవర్గ ఇంచార్జ్ పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటరాంరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్, నాయకులు నవీన్‌గుప్తా, వేణుగోపాల్‌రెడ్డి, రమణాగౌడ్,శంకర్, హంసాన్‌పల్లి చంద్రశేఖర్ రెడ్డి, రాఘవరెడ్డి, లచ్చయ్య తదితరులు ఉన్నారు.

## ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్




**ప్రజాపక్షం/మెదక్ :** ప్రతి ఐదేళ్ల లోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు.0నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు స్వయంగా కలెక్టర్ పోలియో చుక్కలు వేశారు.పోలియో రహిత సమాజ నిర్మాణంలో పల్స్ పోలియో కార్యక్రమం అత్యంత కీలకమైందన్నారు. ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి కుటుంబం తమ చిన్నారులను సమీపంలోని పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఏ ఒక్క చిన్నారి కూడా ఈ కార్యక్రమానికి దూరం కాకుండా అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడి సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పోలియో చుక్కలు చిన్నారుల ఆరోగ్య రక్షణకు సురక్షితమైనవి, అత్యంత ప్రభావవంతమైనవని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన అన్ని పోలియో కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కేంద్రాలకు రాలేని చిన్నారులకు ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేసేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి చిన్నారి పోలియో చుక్కలు తీసుకునే వరకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. డీఎంహెచ్ఓ గణేశ్వర్, మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్లు దీపక్ కుమార్, సంబంధిత వైద్యాధికారులు శివ దాయల్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే చింతాప్రభాకర్

**ప్రజాపక్షం/కొండాపూర్ :** కొండాపూర్ మండల పరిధిలోని తేర్పోల్ గ్రామంలో సంగారెడ్డి శాసన సభ్యులు చింతా ప్రభాకర్ పలు అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఏంజిఎన్ 3 లక్షల నిధులతో గ్రామంలో మురికి కాలువ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతాప్రభాకర్ మాట్లాడుతూ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు నిరంతరం కృషి చేస్తానని అధికారి ప్రతిపక్ష భేదం లేకుండా నియోజకవర్గ అభివృద్ధి తన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎల్లప్పుడు అండగా ఉంటానన్నారు. బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు విఠల్ సదాశివపేట అధ్యక్షులు అంజనేయులు ,గ్రామ సర్పంచ్ సతీష్ ,ఉప సర్పంచ్ మల్లేశం, మాజీ ఎంపిటీసీ మోహన్ గౌడ్, డాకూరి శేఖర్ గ్రామస్థులు పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితా సవరణపై అవగాహన



**ప్రజాపక్షం/వాంకిడి :** ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులే నారాయణ అన్నారు. వాంకిడి మండల కేంద్రంలోని బూత్ నెంబర్ 296 వద్ద జరుగుతున్న ఓటర్ల జాబితా సవర ణ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. బిఎల్ఏ, బిఎల్ఓలకు పలు సూచనలు చేస్తూ ఓటర్ల జాబితాలో పేర్లు చేర్పించడం, తొలగించ డం, సవరణలు చేయడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి అర్హుడైన వ్యక్తి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. యూత్ మండల అధ్యక్షుడు కృష్ణ, శివాజీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఎంఆర్ఓ కార్యాలయ భవన నిర్మాణానికి రూ. 2.25 కోట్లు మంజూరు



**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండల ప్రజలకు ప్రభుత్వం శుభవార్త అందించింది. మండలంలోని ఎంఆర్వో కార్యాలయ భవన నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం 2.25 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ సందర్భంగా మండల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే రోహిత్ రావు చిత్ర పటనికి ఆదివారం మండల పార్టీ అధ్యక్షుడు గుండారం కిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు పరుశురాం, శ్రీకాంత్, శ్రీనివాస్, ప్రవీణ్, వినోద్, సంతోష్, పోశెట్టి, శేఖర్, ఇతర నాయకులతో కలిసి పాలాభిషేకం నిర్వహించి, కృతజ్ఞతలు తెలియజేశారు.మండలంలో ఆధునిక సౌకర్యాలతో ఎంఆర్వో కార్యాలయం నిర్మాణం జరుగుతుందని దీనితో మండల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రెవెన్యూ సేవలు మరింత వేగవంతంగా జరిగేందుకు ఈ భవనం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే హయాంలో ప్రతి గ్రామంలో డ్వాక్రా భవనలు నిర్మాణం జరుగుతుందని తెలిపారు. మండల అభివృద్ధికి ఎమ్మెల్యే రోహిత్ రావు నిరతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన సర్పంచ్‌లు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యత లేని అభివృద్ధి పనులు!

రెండున్నర ఏళ్ళకే సిసి రోడ్డు పగుళ్లు
పట్టించుకోని అధికారులు

**ప్రజాపక్షం/కొండాపూర్ :** గ్రామాలలో అభివృద్ధి పేరుతో చేపడుతున్న సీసీ రోడ్డు మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పూర్తిగా గాలికొదిలేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణల్లో అవసరమైన మోతాదులో ఇసుక వినియోగించకు ండా కేవలం సిమెంట్ ,కంకరతో పనులు చేస్తున్నారని స్థానిక నేలు ఆపోపిస్తున్నారు. దీంతో నిర్మాణాలు పూర్తయ్యే నాటికి పగుళ్ళు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మండల పరిధిలోని మారెపల్లి లో గత రెండేళ్ల క్రి తం ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా సిసి రోడ్లను ఏర్పాటు చేశారు. అయితే సిసి రోడ్లలో ఇసుకకు బదులు మొత్తం డస్ట్‌ను ఉపయోగించి నిర్మించారు. దీంతో సీసీ రోడ్డు వేసినా రెండున్నర ఏళ్ళకే పగుళ్లు ఏర్పాడాయి. కేవలం మారేపల్లి లోనే కాకుండా సదరు కంట్రాక్టర్ వేసిన అన్ని గ్రామాలలోను ఇదే పరిస్థితి ఉందని స్థానిక గ్రామాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవలే ప్రభుత్వం అ న్ని గ్రామాలలో డ్వాక్రా మహిళల సమాఖ్య భవానాల ని ర్మాణాలు చేపట్టారు. ఈ నిర్మాణ ప్రస్తుతం స్లాబ్ వరకు పూర్తి కాగా స్లాబ్‌లోను సుక వాడకుండా కేవలం డస్ట్‌ను మాత్రమే వినియోగించారు. నిబంధనలకు విరుద్ధంగా అతి తక్కువ ఖర్చుతో సిమెంట్ ఇటుకలతో గోడలను నిర్మించడం విశేశం, గతంలో వేసినసీసీ రోడ్డుకు సైడ్ టర్మ్ వేయకపోవడంతో గ్రామాలలో వాహానదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### అధికారుల పర్యవేక్షణ కరువు

కాంట్రాక్టర్‌లు తమ ఇష్టారాజ్యంగా నిబంధనలకు విరుద్దంగా నిర్మాణాలు చేపటడుతున్న సదరు అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు, ప్రతి అధికారికి మాముళ్లు ఇస్తున్నామని ఎవరు వచ్చినా ఇలాగే నిర్మాణాలు చేపడుతామంటూ సదరు కాంట్రాక్టర్‌లపై చర్యలు తీసుకొని అవసరమైతే పనులను నిలిపివేసి తిరిగి నాణ్యతతో చేట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



### లోపాలను సరిచేస్తాం:పిఆర్ఎఇ శ్రీనివాస్‌రెడ్డి

గతంలో వేసిన రోడ్డుకు సంబందించి పగుళ్ల ఏర్పడిన విషయం ఇటీవలే నా దృష్టికి వచ్చింది. పగుళ్ల వచ్చిన దగ్గర వాటిని సరి చేస్తాం. నాణ్యత లేకుండా నిర్మాణాలు చేపడితే తప్పని సరిగా చర్యలు తీసుకుంటాం, మ హిళా సమాఖ్య భవనాల నిర్మాణస్తాలలోను డస్ట్ కాకుండా ఇసుకను వాడాలి నాణ్యతను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

## బెదిరింపులకు పాల్పడిన కార్పొరేటర్‌పై చర్యలు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** బెదిరింపులకు పాల్పడిన కోటగల్లీ బిజెపి కార్పొరేట్‌పై చర్యలు తీసుకోవాలని బాధితులు ఆనంద్‌కుమార్ కో రారు. అన్నదమ్ముల పంచాయతీలో మధ్యవర్తిగా వచ్చి బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు. గాయత్రినగర్ రోడ్డు నెం. 2ర లో మాపై దాడికి పాల్పడటం జరిగిందన్నారు. ముగ్గురం అన్నదమ్ములుం మూడు భాగాలున్నాయని, నా భాగం రిజిస్ట్రేషన్ చేయమంటే ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.మధ్యవర్తి అయిన కార్పోరేటర్ ఇంటికి వచ్చి బెదిరించటం సరికాదన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
సోమవారం
29-06-2026
www.prajapaksham.in

రీల్

"విరాజ్ అశ్విన్ హీరోగా వినోద్ గాలి దర్శకత్వంలో శరత్ చంద్ర నాయుడు నిర్మిస్తున్న సిరీస్ 'గుర్తుకొస్తున్నాయి'. యశశ్రీ రావు, రోహిణి హట్టంగడి, శివ నారాయణ నారిపెద్ది, ప్రియదర్శిని రామ్ ఇతర కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా గ్లింప్స్, సాంగ్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది."

## 3న వస్తున్న 'ఆర్ కే దీక్ష'



ఆర్ కే ఫిల్మ్స్, సిగ్గ క్రియేషన్స్ బ్యానర్లపై డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శకత్వం వహించి నిర్మించిన చిత్రం ఆర్ కే దీక్ష. డి. ఎస్. రెడ్డి సమర్పణలో రూపొందిన ఈ చిత్రంలో ఢీ, జోడి ఫేమ్ అక్స ఖాన్, అలేఖ్య రెడ్డి హీరోయిన్లుగా నటించగా, కిరణ్ హీరోగా కనిపించనున్నారు. తులసి, అనూష, కీర్తన, ప్రవల్లిక, రోహిత్ శర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా జూలై 3న థియేట్రికల్ రిలీజ్కు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ప్రెస్ మీట్ నిర్వహించారు. దర్శక నిర్మాత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ మా 'ఆర్ కే దీక్ష' సినిమా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని జూలై 3న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. మా మూవీ చాలా బాగా వచ్చింది. ఐదు పాటలు ఆకట్టుకుంటాయి. . ఈ సినిమా మ్యూజిక్ ను మా ఆర్కే ఆడియో లేబుల్ ద్వారా రిలీజ్ చేస్తాం. నేను నిర్మాతగా 44 చిత్రాలు చేశాను, దర్శకుడిగా 9 చిత్రాలు రూపొందించాను. 'ఆర్ కే దీక్ష' సినిమాకు ఆంధ్ర, సీడెడ్ డిస్ట్రిబ్యూషన్ కంప్లీట్ అయ్యింది. నైజాంలోనే థియేటర్స్ ఇవ్వడం లేదు. ఇండస్ట్రీలోని ఆ నలుగురు థియేటర్స్ ను గుప్పిట్లో పెట్టుకుని చిన్న సినిమాను చంపేస్తున్నారు. మా సినిమాకు థియేటర్స్ ఇవ్వకుంటే పోరాటం మొదలుపెడతాం. సోమవారం నుంచి ఫిలింఛాంబర్ ముందు టెంట్ వేసి నిరాహార దీక్ష చేపడతాం. క్యూబ్ మీద వీపీఎఫ్ లతో దోపిడీ చేస్తూ, థియేటర్స్ లోనూ మోనోపలీ చేస్తున్నారు. చిన్న సినిమాలు మనుగడ లేకుండా చేస్తున్న ఇలాంటి వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. సినిమా బాగా లేకుంటే థియేటర్స్ నుంచి తీసేయడం వేరు, కానీ అసలు థియేటర్స్ ఇవ్వకుండా ప్రేక్షకులకు చిన్న సినిమా ఎలా చేరువ అవుతుంది. మా 'ఆర్ కే దీక్ష' సినిమా కంటెంట్ మీద నమ్మకం ఉంది. ప్రేక్షకులు మంచి విజయాన్ని అందిస్తారని ఆశిస్తున్నాం. బుక్ మై షోలో కూడా టికెట్ బుకింగ్స్ ప్రారంభం కాబోతున్నాయి అన్నారు. ఫైట్ మాస్టర్ రవి, హీరో కిరణ్, నటి తులసి ఈ ప్రెస్ మీట్ లో పాల్గొన్నారు.

## 'గుర్తుకొస్తున్నాయి' ట్రైలర్ ఆవిష్కరించిన బోయపాటి శ్రీను



విరాజ్ అశ్విన్ హీరోగా వినోద్ గాలి దర్శకత్వంలో శరత్ చంద్ర నాయుడు నిర్మిస్తున్న సిరీస్ 'గుర్తుకొస్తున్నాయి'. యశశ్రీ రావు, రోహిణి హట్టంగడి, శివ నారాయణ నారిపెద్ది, ప్రియదర్శిని రామ్ ఇతర కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా గ్లింప్స్, సాంగ్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. జూలై 3 నుంచి ఈటీవి విన్ లో ప్రత్యేకంగా స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. ఈ వేడుకలో హీరో సత్యదేవ్, దర్శకులు బోయపాటి శ్రీను, కరుణా కరణ్, నిర్మాతలు మైత్రి రవి, బన్నీవాసు, ఎస్ కెఎన్, ధీరజ్, వంశీనందిపాటి అతిథులుగా పాల్గొన్నారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ.. మన ఇండస్ట్రీలో నేను పని చేసిన గొప్ప సంస్థల్లో గీతా ఆర్ట్స్ ఒకటి. 'సరైనోడు' సినిమా సమయంలో బన్నీ బాబుతో చేసిన ప్రయాణం ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఆ ప్రయాణంలో ఎంతోమంది పరిచయమయ్యారు. గీతా ఆర్ట్స్, ఈటీవీ విన్ రెండూ కూడా అత్యుత్తమ కంటెంట్ను అందించే సంస్థలు. అలాంటి సంస్థల్లో ఈ సిరీస్ విడుదల కావడం గొప్ప విషయం. ఈ విజయం ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాను. ఈ రోజుల్లో చిన్న సినిమా, పెద్ద సినిమా అనే తేడా లేదు. కంటెంట్ ఈజ్ ది కింగ్ అని అన్నారు. హీరో సత్యదేవ్ మాట్లాడుతూ ఈటీవీ విన్ అద్భుతమైన కంటెంట్ను అందిస్తోంది. విరాజ్కు ఆల్ ది వెరీ బెస్ట్. 'బన్నీని పిక్ చేసుకోవడానికి వెళ్తున్నాను' అని చెప్పారు. నన్ను కూడా రమ్మన్నారు. అక్కడ వారందరిని కలిసి చూసినప్పుడు చాలా ఆనందంగా అనిపించిందని చెప్పారు. హీరో విరాజ్ అశ్విన్ మాట్లాడుతూ ఈ ట్రైలర్ ఈవెంట్కు మేము ఎప్పటికీ మర్చిపోలేం. ఈ సిరీస్ చేస్తున్నప్పటి నుంచి నాకు కూడా ఎన్నో జ్ఞాపకాలు గుర్తుకొచ్చాయి. యశశ్రీ తెలుగు నేర్చుకుని ఇక్కడ చాలా చక్కగా నటించింది. తప్పకుండా ఈ సిరీస్ మీ అందరికీ నచ్చుతుంది అని ఆశాభావం వ్యక్తం చేశారు

## 'నాగబంధం'పై రూ.110 కోట్ల ఖర్చు



**నిర్మాతలు కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి**

విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'నాగ బంధం ది సీక్రెట్ ట్రెజర్'. నిక్ స్టూడియోస్ బ్యానర్పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్, రిషభ్ సాహ్నీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జూలై 3న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. మేము సాఫ్ట్వేర్ కంపెనీని విజయవంతంగా నిర్వహించాం. అక్కడి నుంచి ఎగ్జిట్ అయిన తర్వాత బిజినెస్ను డైవర్సిఫై చేయాలనే ఉద్దేశంతో సినిమా పరిశ్రమను కూడా ఒక మంచి అవకాశంగా భావించాం. నాగబంధం కంటే ముందు మరో కథ విన్నాం. అది చాలా పెద్ద హీరోతో చేయాల్సిన భారీ ప్రాజెక్ట్. అయితే అప్పటికి మేము నిర్మాతలుగా నిరూపించుకోలేదు కాబట్టి ఆ అవకాశం రాలేదు. నాగ బంధం కంటెంట్ పై వున్న నమ్మకంతో రూ.110 కోట్లకు పైగా బడ్జెట్ తో నిర్మించాం.బిటెక్ చేసి అమెరికా వెళ్లి మంచి ఉద్యోగం సంపాదించి స్థిరపడాలనే ఆలోచనే ఎక్కువగా ఉండేది. కానీ మేము ఆ ట్రెండ్ను బ్రేక్ చేశాం. ఐఐటి గ్రాడ్యుయేట్స్ అయినప్పటికీ నాలుగేళ్ల పాటు ఎలాంటి ఆదాయం లేకుండా కష్టపడ్డాం. అదే నమ్మకంతో సినిమా రంగంలో కూడా రిస్క్ తీసుకున్నాం.మాకు కంటెంట్పై బలమైన నమ్మకం ఉంది. లార్జర్ దాన్ లైఫ్ మైథాలజికల్ కథతో సినిమా చేయాలనే ఆలోచన మొదటి నుంచే ఉంది. .ఈ సినిమా మేము ఆశించిన స్థాయిలో విజయం సాధిస్తే కచ్చితంగా సీక్వెల్ రూపొందించే ఆలోచన ఉంది.ప్రస్తుతం మా దృష్టంతా నాగబంధం విడుదలపైనే ఉంది. సినిమా విడుదలైన తర్వాత కొత్త కథలు వింటాం. వైవిధ్యమైన, కొత్త కంటెంట్తో సినిమాలు చేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నాం.



## అక్టోబర్ 2న 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47' విడుదల

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో వస్తోన్న కుటుంబ కథా చిత్రం ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47 ఎకె 47 విడుదల తేదీ ఖరారైంది. ఈ చిత్రాన్ని అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో భారీస్థాయిలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచేసింది. ఈ పోస్టర్ సినిమాలోని హృద్యమైన, ఉత్సాహభరితమైన ప్రపంచాన్ని పరిచయం చేస్తోంది. ఇందులో వెంకటేష్, శ్రీనిధి శెట్టి ఎంతో హుందాగా, ఆకర్షణీయంగా కనిపిస్తూ, ఆత్మీయ కుటుంబ కథకు అద్దం పట్టేలా ఉన్నారు. వెంకటేష్, త్రివిక్రమ్ కలయికలో వస్తున్న సినిమా కావడంతో ప్రకటన వచ్చినప్పటి నుంచే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. త్రివిక్రమ్ శైలిలో మనసును హత్తుకునే భావోద్వేగాలు, గుర్తుండిపోయే పాత్రలు, కట్టిపడేసే హాస్యం, అర్థవంతమైన కథనం కలగలిపి, ప్రేక్షకులకు సంపూర్ణమైన సినిమా అనుభూతిని అందించడానికి 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47' సిద్ధమవుతోంది. తన సహజమైన ఆకర్షణ, అద్భుతమైన కామెడీ టైమింగ్తో ప్రేక్షకులను అలరించే వెంకటేష్.. ఈసారి కూడా కుటుంబ విలువలతో కూడిన పాత్రలో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించనున్నారు. శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్, కెవిన్ కుమార్ యాక్షన్ సన్నివేశాల కొరియోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు.హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

## ఆధ్యాత్మిక కథతో 'ఇరుముడి'




రవితేజ హీరోగా 'ఇరుముడి' చిత్రంతో విభిన్నమైన ఎమోషనల్ పాత్రలో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రం, ఇప్పటికే విడుదలైన 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' వీడియోతో మంచి ఆసక్తిని రేకెత్తించింది. ఆ వీడియో ఎమోషన్ ని అద్భుతంగా ఆవిష్కరించింది. ఇందులో రవితేజ అంకితభావం గల తండ్రిగా కనిపించారు, తండ్రి కూతురు అనుబంధమే కథకు ప్రధాన బలంగా నిలవనుంది.ఇప్పుడు షూటింగ్ మొత్తం పూర్తయిన నేపథ్యంలో చిత్ర బృందం మ్యూజిక్ ప్రమోషన్స్ పై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా, జూన్ 29న 'ఇరుముడి కట్టు' తొలి పాటను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అయ్యప్ప మాల ధరించిన రవితేజ, రాబోయే యాత్రా సీజన్కు అనుగుణంగా ఈ పాట విడుదల కానుండటంతో, ఇది ఆధ్యాత్మిక అనుభూతిని అందించడమే కాకుండా చిత్ర సంగీతానికి సరైన ఆరంభంగా నిలవనుంది.ఈ పాట పోస్టర్లో ఆలయం వైపు చేయి ఎత్తి చూపిస్తూ, భారీ సంఖ్యలో భక్తుల మధ్య రవితేజ కనిపించారు. భక్తిభావం ఉట్టిపడే సన్నివేశాలు... ఈ పాట విజువల్ గా, ఎమోషనల్ గా హృదయానికి హత్తుకునేలానూ ఉండబోతోందని సూచిస్తున్నాయి.ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవాని శంకర్ నటిస్తుండగా, కథకు కీలకంగా నిలిచే పాత్రలో బేబీ నక్షత్ర నటిస్తోంది. సాయి కుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, స్వసిక ఇతర ముఖ్య పాత్రల్లో కనిపిస్తారు.నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ నిర్మాణ సారథ్యంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది. విష్ణు శర్మ ఛాయాగ్రహణం, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైన్, ప్రవీణ్ పూడి ఎడిటింగ్, జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.'ఇరుముడి' చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది.

## డిండి పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

కోమటిరెడ్డి వెంకట్రెడ్డి వంటి నాయకులు పదవులను త్యాగం చేశారని సిఎం గుర్తు చేశారు. శ్రీకాంతాచారి, కానిస్టేబుల్ కృష్ణయ్య, యాదయ్య, ఈశాన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి వంటి అమరుల త్యాగాలతో తెలంగాణ సాధ్యమైందన్నారు. అలాంటి త్యాగాలతో పోలిస్తే కొందరు నాయకులు చెప్పుకునే త్యాగాలకు విలువ లేదని వ్యాఖ్యానించారు. వందల మంది త్యాగాలు చేసి తెలంగాణ సాధిస్తే దాన్ని బిఆర్ఎస్ నేతలు వాళ్ల ఖాతాలో వేసుకున్నారని మండిపడ్డారు. పెట్రోల్ పోసుకుని అగ్గిపెట్టె తెచ్చుకోని వాళ్లు త్యాగాలు చేసినట్లు చెప్పుకొంటున్నారని, పెట్రోల్ పోసుకుని ప్రాణాలు అర్పించిన శ్రీకాంతాచారి త్యాగాన్ని ఏమనాలని ప్రశ్నించారు. బిఆర్ఎస్ పాలనలో రాష్ట్ర అప్పులు రూ.60 వేల కోట్ల నుంచి రూ.6 లక్షల కోట్లకు చేరాయని సిఎం ఆరోపించారు. ఎలక్షన్, కలెక్షన్, సెలక్షన్ రాజకీయాలతో బిఆర్ఎస్ రాష్ట్రాన్ని నష్టపరిచిందన్నారు. గత ప్రభుత్వంలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోగా, నాణ్యత లేని బియ్యం పంపిణీ చేశారని ఆరోపించిన సిఎం, తమ ప్రభుత్వం అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు అందజేసిందన్నారు. ప్రతి ఏడాది రూ.16 వేల కోట్ల వ్యయంతో మూడు కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతున్నామని, పేదలకు ఇళ్లు నిర్మిస్తుంటే ప్రతిపక్షాలకు కడుపుమంటగా మారిందని విమర్శించారు. వారు వందల ఎకరాల్లో ఫామ్హౌస్లు, భవంతులు కట్టుకోవచ్చు కానీ పేదలకు ఇళ్లు ఇవ్వడం మాత్రం ఇష్టపడరని బిఆర్ఎస్ నాయకులపై వ్యాఖ్యలు చేశారు. దేశంలోనే అత్యధిక వరి ధాన్యం ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని సిఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని, అందులో నల్లగొండ జిల్లా అగ్రస్థానంలో నిలిచిందన్నారు. రైతు భరోసా వంటి పథకాలతో రైతుల కళ్లలో ఆనందం కనిపిస్తోందని చెప్పారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులకు వెళ్లేందుకు ప్రజలు భయపడేవారని, ప్రస్తుతం వాటి అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్య, వైద్య రంగాలను బలోపేతం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మూసీ కాలుష్యం కారణంగా నల్లగొండ ప్రజలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేసిన సిఎం, మూసీ నది ప్రక్షాళన కార్యక్రమాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం కోసం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అడ్డుకునే వారిని ప్రజలే ప్రశ్నిస్తారని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బలమైన మద్దతు ఇస్తున్నారని, 2028 నుంచి 2034 వరకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగుతుందని సిఎం ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తూ తెలంగాణను దేశంలోనే నంబర్వన్ రాష్ట్రంగా నిలబెడతామని ప్రకటించారు. నల్లగొండ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ జిల్లా అభివృద్ధికి అవసరమైన ప్రతి కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

**ప్రజా సంక్షేమమే మా ఎజెండా : భట్టి విక్రమార్క**



'ప్రజా సంక్షేమమే మా ఎజెండా..మీ అవసరాలే మా ప్రాధాన్యత' అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి రూ.90 వేల కోట్లతో ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. దశాబ్ద కాలం పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఎస్ఎల్బిసి, డిండి, నక్కలగండి ప్రాజెక్టులను గాలికొదిలేసిందని విమర్శించారు. ఆ ప్రభుత్వం అధికార అహంకారంతో ప్రజలను హింసిస్తే, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం మానవీయ కోణంతో పనిచేస్తోందన్నారు. ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ అభ్యర్థనతో సిఎం హెలికాప్టర్లో పర్యటించి,నిధుల సమస్య లేదని ఎస్ఎల్బీసీ, డిండి ప్రాజెక్టులను పదవీకాలంలోనే పూర్తి చేయాలని ఆదేశించారని తెలిపారు.

**రూ.78 వేల కోట్లతో రోడ్ల విప్లవం.. : మంత్రి కోమటిరెడ్డి**

తెలంగాణలో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్రవ్యాప్తంగా రూ.78 వేల కోట్ల విలువైన రహదారి ప్రాజెక్టులు అమలవుతున్నాయని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. మెరుగైన రహదారులు కేవలం రవాణా కోసమే కాకుండా పరిశ్రమలు, ఉపాధి అవకాశాలకు కూడా దోహదపడతాయని అన్నారు. హైదరాబాద్విజయవాడ సిక్స్లేన్ రహదారి, గ్రీన్ఫీల్డ్ హైవేలు వంటి కీలక ప్రాజెక్టులు తెలంగాణ అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు.

**రూ. 79,886 కోట్లు రైతు ఖాతాల్లో వేశాం : ఉత్తమ్**




తాము అధికారంలోకి వచ్చిన డిసెంబర్ 2023 నుండి ఇప్పటివరకు 79,886 కోట్ల రూపాయలను ధాన్యం అమ్మిన రైతుల ఖాతాలలో జమ చేసామని తెలిపారు. ఈ సంవత్సరం 81 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని యాసంగిలో కొనుగోలు చేసి 19,313 కోట్ల రూపాయలు రైతులకు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేనివిధంగా 13,000 కోట్ల రూపాయలతో రహదారుల పటిష్టం, విస్తరణ కార్యక్రమానికి శంకుస్థాపన చేయడం శుభసూచకమన్నారు. నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ నాగార్జునసాగర్ నియోజకవర్గంలో హెచ్ ఎల్ సి, ఎల్ ఎల్ సి లింకు కెనాల్ ను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేశారు. బహిరంగ సభలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, శాసనసభ్యులు కుందురు జైవీర్ రెడ్డి, బీర్ల ఐలయ్య యాదవ్, వేముల వీరేశం,కుంభం అనిల్ రెడ్డి,బత్తుల లక్ష్మారెడ్డి, ఉత్తమ్ పద్మావతి,కేతావత్ బాలునాయక్, ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం,శంకర్ నాయక్ ,మేయర్ చైతన్య శ్రీనివాస్ రెడ్డి , కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు పూర్ణ కైలాస నేత. గ్రంధాలయం చైర్మన్ ఆఫీస్ ఖాన్ మాజీ శాసన మండల చైర్మన్ నేతి విద్యాసాగర్, గుమ్ముల మోహన్ రెడ్డి ,బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వంగూరు లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

## మహానేత పి.వి.

(మొదటి పేజీ తరువాయి)

పలువురు ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ కార్యకర్తలు, పివి కుమార్తె ఎంఎల్సి సురభి వాణిదేవి, పివి కుటుంబ సభ్యులు, అభిమానులు పివి సమాధి వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ సంక్షోభ సమయంలో దేశాన్ని సమర్థవంతంగా ముందుకు నడిపిన మహా నేత పి.వి. నరసింహారావు అని, దేశ ఆర్థిక సంస్కరణలకు ఆయనే ఆద్యుడని టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ కొనియాడారు. 1994లో తనకు అసెంబ్లీకి పోటీ చేసేందుకు బిఫామ్ ఇచ్చిన మహనీయుడు పి.వి. నరసింహారావు అని, తాను ఈ స్థాయిలో ఉండటానికి ఆనాటి అవకాశమే కారణమని గుర్తుచేసుకున్నారు యావత్ తెలుగు ప్రపంచం పి.వి. నరసింహారావు ఒక గొప్ప మేధావిగా, సమర్థవంతమైన రాజనీతిజ్ఞుడిగా ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకుంటుందన్నా రు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, తెలంగాణ ముద్దుబిడ్డ, భారత రత్న, మాజీ ప్రధానమంత్రి, బహుముఖ ప్రజ్ఞాశాలి, దూరదృష్టి గల మహానేత పివి నరసింహారావు అని కొనియాడారు.పి.వి.కేవలం తెలంగాణకే కాకుండా యావత్ భారతదేశానికి మార్గదర్శకులని అన్నారు.మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ మాట్లాడుతూ, పి.వి. నరసింహారావు తెలంగాణ గడ్డకు చెందిన మహోన్నత మేధావి, దేశ రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన దార్శనిక నాయకుడని అన్నారు. దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి, తన దూరదృష్టి, ధైర్యవంతమైన నిర్ణయాలతో భారత ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టిన సంస్కరణల రూపశిల్పిగా నిలిచారని కొనియాడారు.





నేడు ప్రపంచ వేదికపై భారత్ ఆర్థిక శక్తిగా ఎదగడానికి ఆయన చేపట్టిన ఆర్థిక సంస్కరణలే బలమైన పునాదిగా నిలిచాయని పేర్కొన్నారు.

**గాంధీభవన్లో పివికి ఘన నివాళి**

మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు జయంతివేడుకలను గాంధీభవన్లో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పి.వి. నరసింహారావు చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు కుమార్ రావుతో పాటు పలువురు నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

**సిఎం రేవంత్రెడ్డి ఘన నివాళి**

మాజీ ప్రధానమంత్రి, భారతరత్న పి.వి. నరసింహారావు జయ ంతి సందర్భంగా ఆదివారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తన నివాసంలో ఆ మహనీయుడికి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, బహుభాషా కోవిదుడు దేశ ప్రధానిగా ఆధునిక భారత నిర్మాణంలో చిరస్థాయిగా నిలిచే సేవలు అందించిన పివినరసింహారావు ఆర్థిక సంస్కరణలకు నాంది పలికి, సంక్లిష్ట పరిస్థితుల్లో దేశాన్ని సమర్థవంతంగా ముందుకు నడిపించిన మహానేత అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి కొనియాడారు. తెలంగాణ ముద్దు బిడ్డ, జాతి గర్వించదగిన మహానేత, బహుభాషా కోవిదుడు, గొప్ప మేధావి పీవీ నరసింహారావు సేవలు, ఆదర్శాలు భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని సిఎం పేర్కొన్నారు. పివినరసింహారావుకు ముఖ్యమంత్రితో పాటు మంత్రులు కొమటిరెడ్డి, వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ నివాళ్లు అర్పించారు.

## పునరుద్ధరణ

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించమని కొన్ని రాష్ట్రాలు ఇప్పటికే ప్రకటించాయి. దీనిని బలపరిచేలా ఓ పరిణామం చోటు చేసుకుంది. సర్ సందర్భంగా పశ్చిమ బెంగాల్ ఓటర్ల జాబితా నుంచి తన పేరును తొలగించడంతో, తన పాస్పోర్ట్ పునరుద్ధరణ నిలిచిపోయిందని 'ది టెలిగ్రాఫ్' మాజీ ఎడిటర్ ఆర్. రాజగోపాల్ పేర్కొన్నారు. ఈ పరిణామంపై కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సిపిఐ(ఎం) పార్టీలు కేంద్రంపై విమర్శలు గుప్పించాయి. రాజగోపాల్ దుస్థితి పౌరుల హక్కుల విస్తృత కోతకు నిదర్శనమని ప్రతిపక్ష నాయకులు అన్నారు. ఓటర్ల జాబితా నుంచి తన పేరును తొలగించడంపై వచ్చిన ప్రతికూల పోలీసు నివేదిక కారణంగా పాస్పోర్ట్ పునరుద్ధరణ నిలిచిపోవడంతో, తాను 'పౌర అనిశ్చితి'లో చిక్కుకున్నానని, దశాబ్దాల నాటి కుటుంబ రికార్డులను పునర్నిర్మించడానికే ఎక్కువ సమయం గడుపుతున్నానని రాజగోపాల్ ఒక వివరణాత్మక లేఖలో పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్లోని దాదాపు 27 లక్షల మంది ఇతర నివాసితుల మాదిరిగానే, తార్కిక వ్యత్యాసాలుగా వర్ణించబడిన వాటి కారణంగా తనను మినహాయించారని, తన మెట్రిక్యులేషన్ సర్టిఫికేట్ సమర్పించిన తర్వాత కూడా ఎటువంటి కారణం చెప్పలేదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్స్లో ఒకదాని ముందు తన అప్పీల్ ఇప్పుడు పెండింగ్లో ఉందని రాజగోపాల్ రాశారు. 'నా పాస్పోర్ట్ పునరుద్ధరణ దరఖాస్తుకు పట్టిన గతి మరింత బాధాకరంగా ఉంది. నేను మార్చి 19న బయోమెట్రిక్ లాంఛనాలను పూర్తి చేసినప్పటికీ, ఓటర్ల జాబితాలో నా పేరు ఇకపై కనిపించకపోవడంతో పోలీసు వెరిఫికేషన్ క్లియర్ కాలేదు' అని ఆయన తెలిపారు. తనను తాను బాధితుడిగా చిత్రీకరించుకోవడం తన ఉద్దేశ్యం కాదని, సాధారణ పౌరులు ఎదుర్కొంటున్న దుస్థితిని తెలియజేయడమే తన ఉద్దేశ్యమని ఆయన అన్నారు. 'తన వృత్తి జీవితాన్ని జర్నలిజంలో గడిపి, ఒక మోస్తరు పేరున్న వార్తాపత్రికకు సంపాదకత్వం వహించిన వ్యక్తికే ఇటువంటి ఇబ్బందులు ఎదురైతే, నిజంగా అణగారిన వర్గాల వారు ఎంతగా బాధపడతారో ఊహించవచ్చు' అని ఆయన రాశారు. ఈ పోస్ట్పై తీవ్రమైన రాజకీయ ప్రతిచర్యలు వెల్లువెత్తాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పశ్చిమ బెంగాల్లో ఎన్నికల సంఘం చేపట్టిన వివాదాస్పద సర్ ప్రక్రియతో ఆయన అనుభవాన్ని ప్రతిపక్ష నాయకులు ముడిపెట్టారు. ఈ ఉదంతం దేశం చేరుకున్న 'అహేతుకత స్థాయిని' ప్రతిబింబిస్తోందని కాంగ్రెస్ రాజ్యసభ ఎంపి వివేక్ తంఖా అన్నారు. రాజగోపాల్ కథనాన్ని టిఎంసి రాజ్యసభ ఎంపి సాగరిక ఘోష్ దిగ్భ్రాంతికరం, హృదయ విదారకంగా అభివర్ణించారు. మాజీ సంపాదకుడైన రాజగోపాల్కే ఇలా జరిగితే, ఇంతకంటే చాలా అనుభవిస్తున్నారో ఊహించండి అని ఆమె అన్నారు. బిజెపి విభజనవాద హిందుత్వ ఎజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు, ప్రజల ఓటు హక్కును హరించడానికి, పౌరసత్వాన్ని నిర్ధారించడానికి 'సర్' ప్రక్రియను వాడుకుంటున్నారని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ ఆరోపించారు. 'ఎస్ఐఆర్ ప్రక్రియ మన దేశంలోని పేద, బలహీన వర్గాల ఓటు హక్కును హరిస్తుందని సిపిఐ(ఎం) మొదటి నుంచీ హెచ్చరిస్తూనే ఉంది. కానీ ఇప్పుడు, ఆర్. రాజగోపాల్ వంటి పేరున్న సంపాదకుడికి, ప్రఖ్యాత పాత్రికేయుడికి కూడా ఓటు హక్కును నిరాకరించారు' అని బేబీ అన్నారు.

## సంద్రం'గా మారుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

దార్శనికతకు మూలమని ఆయన జోడించారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల వ్యూహాత్మక వ్యూహాత్మక స్వభావాన్ని హైలెట్ చేస్తూ మోదీ ఇలా అన్నారు. 'ఇండియా, సీషెల్స్ రక్షణ, భద్రత ఒకదానికొకటి విడదీయరానివని మేము విశ్వసిస్తున్నాం' అని పేర్కొన్నారు. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పటిష్టంగా, భవిష్యత్తుకు సిద్ధంగా తీర్చిదిద్దే విషయమై ఇరుపక్షాలు చర్చించినట్లు మోదీ తెలిపారు. 'మన రెండు దేశాల కోసం కొత్త అవకాశాలను కొనసాగిస్తామని, భారత్, సీషెల్స్ మధ్య అనుసంధానాన్ని పెంపొందించేందుకు కూడా కృషి చేస్తాం' అని ఆయన అన్నారు. డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల రంగంలో తన విజయవంతమైన అనుభవాన్ని సీషెల్స్తో పంచుకుంటుందని కూడా మోదీ వివరించారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో సముద్ర భద్రత, ద్వైపాక్షిక సంబంధాలకు కేంద్రంగా ఉందని, సముద్ర దొంగతనం, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను ఎదుర్కోవడానికి ఇరుదేశాలు తమ నిబద్ధతను పునరుద్ఘాటించాయని సీషెల్స్ ప్రెసిడెంట్ హెర్మినీ చెప్పారు. 175 మిలియన్ డాలర్ల ప్రత్యేక ప్యాకేజీపై చర్చలు జరపడానికి ఇరుపక్షాలు చాలా సంతోషంగా ఉన్నాయని ఆయన చెప్పారు. దీనికిముందు హెర్మినీ సభలో భారత ప్రధాని మోదీకి ప్రత్యేక స్వాగతం పలికారు. ప్రధాని మోదీ చివరిసారిగా 2015లో సీషెల్స్ను సందర్శించగా, ప్రెసిడెంట్ హెర్మినీ భారతదేశాన్ని గతేడాది సందర్శించారు.

**రక్షణ, డిజిటల్ చెల్లింపులు, అంతరిక్షం వంటి 19 ఫలితాలను ఆవిష్కరించిన భారత్-సీషెల్స్**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీషెల్స్ ప్రెసిడెంట్ పాట్రిక్ హెర్మినీ మధ్య జరిగిన చర్చల అనంతరం రక్షణ, సముద్ర భద్రత నుంచి డిజిటల్ చెల్లింపుల రంగం, ఆరోగ్యసంరక్షణ, వ్యవసాయం, విద్య వరకు పలు రంగాలలో సహకారాన్ని విస్తరిస్తూ భారత్, సీషెల్స్ దేశాలు ఆదివారం 19ఫలితాలను వెల్లడించాయి. ఈ ఫలితాలు, ప్యాకేజీ, భద్రత, అనుసంధానం, సామర్థ్య నిర్మాణం, భాగస్వామ్య అభివృద్ధి వంటి అంశాలలో వ్యూహాత్మకంగా కీలకమైన హిందూమహాసముద్ర దేశంతో న్యూఢిల్లీతో సంబంధాలు విస్తరించడాన్ని ప్రతిబింబిస్తుంది. ద్వీపసమూహ దేశమైన సీషెల్స్లో యుపిఏ ఆధారిత డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడానికి, ఆర్థిక, సాంకేతిక సహకారాన్ని మరింతగా పెంపొందించడానికి, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పిసిఐ),ఇ ంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ (ఐపిఎల్), సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ సీషెల్స్ మధ్య ఒక ఒప్పందంపై ఇరుదేశాలు సంతకాలు చేశాయి.

**ప్రధాని మోదీకి దక్కిన సీషెల్స్ అత్యున్నత పురస్కారం**

ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మరో అరుదైన గౌరవ పురస్కారం లభించింది. సీషెల్స్ దేశ అత్యున్నత 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హోరిజన్' పురస్కారాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అందుకున్నారు. ఆదేశ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ ప్రధాని మోదీకి అవార్డును అంజేశారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనాన్ని పెంపొదించడం, సుస్థిర అభివృద్ధిని సాధించడంలో ప్రపంచ దేశాలకు నాయకత్వం వహిస్తున్నందుకుగాను సీషెల్స్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది.ఒక విదేశం నుంచి మోదీ అందుకున్న 34వ అంతర్జాతీయ గౌరవం ఈ బిరుదు. ఈ గౌరవానికిగాను సీషెల్స్కు ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలిపారు. వాతావరణ మార్పుల సవాళ్లతో పోరాడుతున్న దేశాలకు సీషెల్స్ దేశం అందజేసిన గౌరవ పురస్కారాన్ని అంకితం చేసినట్లు ప్రధానమంత్రి మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com